అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 23-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 204 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఇక ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో

ప్రభుత్వోద్యోగులు

58 ఏండ్ల నాటి నిషేధాన్ని ఎత్తేసిన కేంద్రం

న్యూఢిల్లీ : ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వోద్యోగులు భాగస్వాములు కావడంపై దీర్ఘకాలంగా అమలులో ఉన్న నిషేధాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం సోమవారం ఎత్తివేసింది. 1966 నవంబర్ 30, 1970 జులై 25, ...13లో



మూసీకి పదివేల కోట్లు ఇవ్వండి

జల్ జీవన్ మిషన్ నిధులు కేటాయించాలి

ఓఎంసీలకు గ్యాస్ సబ్సిడీ ముందుగానే చెల్లించండి

పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి :

కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్దీప్ సింగ్ పూరీ, జోషికి సీఎం రేవంత్ వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద రూ.పది వేల కోట్లు కేటాయించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడా లేని విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్దీప్ సింగ్ పూరీ, ప్రహ్లాద్ జోషిలను ఆయన సోమవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలోని మురికి నీరంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీలో చేరే మురికి నీరును శుద్ధి చేయడం, వరద ...6లో



కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

నీట్ లీకేజీపై దద్దరిల్లిన పార్లమెంట్

లోపభూయిష్టంగా పరీక్షల వ్యవస్థ

విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోతోంది : రాహుల్ గాంధీ

- సుపరిపాలనకు ఈ బడ్జెట్ కీలకం
- ప్రతిపక్షం సభను సాగనివ్వట్లేదు : ప్రధాని మోడీ
- తొలిరోజే వాడీవేడిగా సభ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజే నీట్ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్ దద్దరిల్లింది. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ నీట్ పేపర్ లీక్‌తో పాటు యూజీసీ నెట్, సీయూ నెట్ వంటి అనేక పరీక్షల అవకతవకలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానం ఇవ్వగా సంతృప్తి చెందని ప్రతిపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ నీట్ 2024 ప్రశ్నాపత్రాల లీకేజీ మన విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల్లో తీవ్ర సమస్యని, నీట్ ఒక్కటే కాక అన్ని కీలక పరీక్షల్లో ఇదే తంతు జరుగుతోందని ...13లో



కేంద్రవిద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షనేత రాహుల్

ప్రతిపక్షాలకు ప్రధాని సుద్దులు



పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ పలు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని విమర్శించారు. "ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు తనపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్టు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు ...13లో

వికలాంగులకు

క్షమాపణ చెప్పాలి

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగాల్లో వికలాంగుల కోటాపై స్మితా సబర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రతిభ అనేది ఎవరి సొత్తుకాదనీ, వైకల్యాలు, శక్తి సామర్థ్యాలు మేధోశక్తిపై ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. స్మితా సబర్వాల్ ఓ ఐఏఎస్ అధికారిగా వికలాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమె తన స్థాయిని దిగజారుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బ్రెయిలీ లిపిని అందించిన లూయిస్ బ్రెయిలీ మొదలుకుని, అనేక మంది సివిల్ సర్వెంట్లు, రాజకీయవేత్తలు, డాక్టర్లు వారి వారి రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ ఉన్నతస్థాయి సేవలందిస్తున్న వాస్తవం మనకండ్లముందు ఉందికదా అని తెలిపారు. వికలాంగుల మనోభావాలను దెబ్బతినేలా చేసిన ఈ వ్యాఖ్యలను వెంటనే ఆమె వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన

అంగవైకల్యం శరీరానికే..

ప్రతిభకు కాదు

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

వికలాంగులకు క్షమాపణ చెప్పే వరకు ఉద్యమం

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్య 13లో

మూసీ ప్రాజెక్టును

ఆధునీకరించండి

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి పాదయాత్ర ప్రారంభం

వివరాలు 6లో

తెలంగాణను కేంద్ర బడ్జెట్

కరుణించేనా?



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌పై లోక్‌సభలో 20 గంటలపాటు చర్చిస్తారు. ఈ చర్చల్లో అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొననున్నారు. అయితే ఈ బడ్జెట్‌పై తెలంగాణ ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం ఈసారైనా తమ వైపు చూస్తుందని గంపెడాశలతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యే మిగిలింది. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలకు, కేంద్ర విద్యా సంస్థలకు ఎటువంటి కేటాయింపులు లేవు. విభజన హామీల ఊసేలేదు. కొత్తగా పార్లమెంట్ ఆమోదించిన సమ్మక్క సారక్క యూనివర్శిటీకి కూడా నిధులు కేటాయించలేదు. సెంట్రల్ యూనివర్సిటీలకు కేటాయించిన వాటిలోనే ఈ యూనివర్సిటీకి కూడా నిధులు వస్తాయని ప్రభుత్వం చెబుతోంది. బయ్యారం స్టీల్ ప్లాంట్, ఐటీఐఆర్ వంటి ప్రాజెక్టు గురించి కనీసం ప్రస్తావన కూడా లేదు. వెనుకబడిన జిల్లాల నిధుల ఊసేలేదు. అయితే ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వరుస ఢిల్లీ పర్యటనల్లో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏ మేరకు కేటాయింపులు ఉంటాయోనని ఎదురు చూస్తున్నారు.

పాత జిల్లా సర్వీస్ మేరకే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రి దామోదర

వివరాలు 13లో



అధ్యక్షా...

6లో..

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అందరి చూపు కేసీఆర్ వైపే..

గులాబి బాస్ సభకు వచ్చేనా ?

తొలి రోజు డుమ్మా కొట్టే అవకాశం

25 నుంచి వస్తారని అంచనా

నేడు తెలంగాణ భవన్‌లో శాసనసభాపక్ష భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



'సార్... మీరు ఈసారి నుంచైనా అసెంబ్లీకి వస్తారా...?' అని విలేకరులు అడిగితే, 'ఈసారి చూస్తారుగా అసెంబ్లీలో కేసీఆర్ ప్రళయ గర్జన...' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఘాటుగా జవాబిచ్చారు. ఇది జరిగి దాదాపు మూడు నెలలవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి నిర్వహించబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఆ పార్టీ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేకపోవటం గమనార్హం. తొలి రోజు సభకు కేసీఆర్ రాకపోవచ్చనే అభిప్రాయాలే ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశానికి సీఎం హోదాలో రేవంత్ హాజరైతే, అదే మీటింగుకు కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ విషయంలో బీఆర్ఎస్ అధినేత ఇబ్బంది పడుతున్నారని సమాచారం. అందువల్ల తొలి రోజు సభకు, బీఏసీకి హాజరు కాకుండా బడ్జెట్ ప్రవేశపెట్టే రోజైన గురువారం (ఈనెల 25) ఆయన నేరుగా అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశాలు ...13లో



ఉగ్ర గోదావరి

50 అడుగులకు చేరిన వరద

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

విలీన మండలాలకు నిలిచిన రాకపోకలు

జలవనరుల శాఖ హై అలర్ట్

పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్న అధికారులు

వివరాలు 13లో

కనీస చెల్లింపులూ కష్టమే


ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోండి

ప్రభుత్వానికి సహకరించండి : ఏపీ గవర్నర్ నజీర్

ఉభయ సభల నుద్దేశించి ప్రసంగం

వైసీపీ సభ్యుల వాకౌట్ వివరాలు 6లో





ఆశల పల్లకిలో ఆర్థిక సర్వే

ప్రతికూలతలున్నా వృద్ధి సాధిస్తామని డాంబికాలు


ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందంటూ కట్టుకథలు

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై ప్రయివేటు సంస్థలకు సూచనలు

జీడీపీ వృద్ధి రేటు 6.5 నుంచి 7 శాతానికే పరిమితం

నేడు కేంద్ర బడ్జెట్

వివరాలు 3లో



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.5 శాతం నుంచి 7 శాతం వరకూ వృద్ధి సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో 2023-24 సంవత్సరపు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసే ఈ సర్వే...దేశంలో బలమైన వృద్ధి రేటు కొనసాగుతుందని తెలిపింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు అనిశ్చితిలో ఉన్నప్పటికీ గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో వృద్ధి రేటు బాగానే ఉందని చెప్పుకొచ్చింది.

అంతా బాగుంటుంది

క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఆశాజనకంగా లేకపోయినప్పటికీ ఆర్థిక సర్వే మాత్రం 'అంతా బాగుంది... మున్ముందు కూడా బాగానే ఉంటుంది' అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. ఈ ఏడాదిలో అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఘర్షణలు పెరిగితే సరఫరాలకు ఆటంకం కలగవచ్చునని, వినియోగ వస్తువుల ధరలు పెరగవచ్చునని, ద్రవ్యోల్బణ ఒత్తిడులు అధికమవుతాయని, పెట్టుబడుల ...3లో

పర్యాటక శాఖ హౌటళ్ళు, రిసార్టుల

ప్రయివేటీకరణను ఆపాలి

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పర్యాటక శాఖ సంస్థకు చెందిన హరిత హోటళ్ళు, రిసార్టులను ప్రయివేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, కార్యదర్శి జె కుమారస్వామి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతూ అభివృద్ధి చెందుతున్న వాటిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పర్యాటక సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కడెం రిసార్టు, హైదరాబాద్‌లోని తామతి-బారాదరి, నిజామాబాద్ అనంతగిరి హిల్స్ ఈ జాబితాలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ టూరిజం ప్రపంచవ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతలు సంపాదిస్తున్నదనీ, ఈ హోటళ్లకు,రిసార్టులకు కోట్ల రూపాయల విలువ చేసే భూములు, భవనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 20 ఏండ్లకు పైగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. 8 నెల్ల క్రితం ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించటమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం టూరిజానికి చెందిన హోటళ్ళు, రిసార్టులను ప్రయివేటీకరించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మధ్యప్రదేశ్ టూ హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా

- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్
- రూ.45 లక్షల ఎండీఏంఏ డ్రగ్స్, ముడిసరుకు పట్టివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో


మధ్యప్రదేశ్ టూ హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను రాచకొండ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 10గ్రాముల ఏండీఏంతోపాటు 40కిలోల మాదకద్రవ్యాల (గసగసాల గడ్డి) ముడిసరుకు, రూ.10వేలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.45లక్షలుంటుందని సీపీ తెలిపారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన ఓమా రామ్, సన్వాలారామ్ కార్పెంటర్, రైలింగ్ వర్క్ చేస్తుండేవారు. జల్సాలకు అలవాటుపడిన నిందితులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దాంతో సులువుగా డబ్బులు సంపాదించాలని భావించి డ్రగ్స్‌ను విక్రయించాలని పథకం వేశారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మాదకద్రవ్యాలను సరఫరా చేసే వికాస్ అలియాస్ ముఖేష్‌ను కలిశారు. అతని సహాయంతో ఎండీఎంఏ డ్రగ్స్‌తోపాటు మాదక ద్రవ్యాలను తయారు చేసే ముడిసరుకు(గసగసాల గడ్డి)ని కొనుగోలు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న నిందితులు అక్కడి నుంచి బస్సులు, లారీలు, ఆటోలు, ఇతర వాహనాల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. తెలిసిన వారికి, స్నేహితులతోపాటు కావాల్సిన వారికి అధిక ధరలకు డ్రగ్స్ విక్రయిస్తున్నారు. జవహర్‌నగర్ సమీపంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వికాస్ కోసం గాలిస్తున్నామని త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు. ఎవరైనా డ్రగ్స్‌ను కొనుగోలు చేసినా, సరఫరా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. విద్యార్థులు, యువకులు డ్రగ్స్ జోలికెళ్లొద్దని సూచించారు. మాదక ద్రవ్యాల కేసులో పట్టుబడితే 10సంవత్సరాలకుపైనే జైలు శిక్ష పడుతుందన్నారు.

సమాచారం ఇవ్వండి.. అవార్డు అందుకోండి..

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీపీ సుధీర్‌బాబు అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయించినా, సరఫరా చేస్తున్నట్టు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, వారికి ప్రోత్సాహకరంగా అవార్డు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ కె.మురళీధర్, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ బాస్కర్‌రెడ్డి, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

నేడు కేంద్ర బడ్జెట్

- జనరంజక నిర్ణయాలు ఉంటాయా?
- గత అనుభవాలన్నీ నిరాశాజనకమే
- పెరగని కార్పొరేట్ పెట్టుబడులు
- 'సంక్షేమా'నికి తగ్గుతున్న కేటాయింపులు
- పడిపోతున్న కుటుంబ పొదుపు



జనం చూపు ఆర్థిక మంత్రి వైపే

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ 3.0 ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో తొలి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు బీజేపీ సంఖ్యాబలం బాగా పడిపోవడం, ప్రభుత్వ మనుగడ కోసం టీడీపీ, జేడీయూ వంటి మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో జనరంజక నిర్ణయాలు ఉంటాయని ప్రజలు ఆశతో ఎదురు చూడడంలో ఆశ్చర్యమేమీ ఉండబోదు.

తగ్గుతున్న 'సంక్షేమ' కేటాయింపులు

ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం సంక్షేమ రాజ్యంగా పాలన సాగించే అవకాశాలు లేవనే చెప్పాలి.

ఇప్పటికే కీలక రంగాలకు కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు 2019-20లో బడ్జెట్‌లో ఆరోగ్యానికి 2.46 శాతం కేటాయించగా 2023-24లో అది 2.08 శాతానికి తగ్గింది. జీడీపీలో విద్యా బడ్జెట్ 6% ఉండాలని నూతన విద్యా విధానం సిఫార్సు చేయగా ఇప్పుడది కేవలం 0.36 శాతంగానే ఉంది. జీడీపీలో ఆహార సబ్సిడీలకు కూడా కేటాయింపులు దారుణంగా పడిపోయాయి. 2019-20 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలకు 6.61 శాతం కేటాయించగా 2023-24లో కేవలం 4.4 శాతం మాత్రమే విదిల్చారు. దీనిని బట్టి జీడీపీ వృద్ధి కేవలం సంపన్నులకు మాత్రమే ప్రయోజనకరంగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు కన్పిస్తోంది.

పడిపోయిన పొదుపు

2023-24లో గృహ వినియోగ వృద్ధి 20 సంవత్సరాల కనిష్ట స్థాయికి పడిపోయింది. జీడీపీలో నికర పొదుపు మొత్తం 5.1 శాతానికి తగ్గడంతో కుటుంబ పొదుపు 47 సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరిందని ఆర్‌బీఐ తెలిపింది. జీడీపీలో తయారీ రంగం వాటా 16 శాతం దాటడం లేదు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు విఫల ప్రయోగంగా మారుతున్నాయి. 2014 నుండి పారిశ్రామిక ఉత్పత్తి సూచిక ఏడాదికి సగటున 3.2% వృద్ధి చెందింది. దురదృష్టవశాత్తూ ఉద్యోగ కల్పనకు అవకాశమున్న జౌళి, దుస్తులు, ఎలక్ట్రికల్ పరికరాలు వంటి రంగాలు 2013-14 నుండి ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.

ఉద్యోగ కల్పనపై గొప్పలు

దేశంలో ఎన్నో సమస్యలు మన చుట్టూనే కన్పిస్తున్నాయి. ప్రభుత్వం చేయాల్సిందల్లా వాటిని పరిష్కరించడమే. గాయాలు మాన్పడమే. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం క్రమేపీ సంక్షేమ కార్యక్రమాల నుండి వైదొలిగింది. దేశంలో నెలకొన్న ఉద్యోగ సంక్షోభంపై ఇటీవల సిటీగ్రూప్ విడుదల చేసిన నివేదిక ప్రభుత్వాన్ని, ఆర్‌బీఐని కలవరపరచింది.

2019-20, 2023-24 మధ్య దేశంలో 10.9 కోట్ల ఉద్యోగాలు వచ్చాయని ఆర్‌బీఐ విడుదల చేసిన సమాచారం చెబుతోంది. 8.2 శాతం వృద్ధి రేటు సాధిస్తామని చెప్పుకున్న గొప్పల్లో ఎంత వాస్తవం ఉన్నదో ఇందులోనూ అంతే ఉంది.

వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాలే ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. దేశంలోని కార్మికుల్లో దాదాపు 46 శాతం మంది వ్యవసాయంలో ఉపాధి పొందిన వారే. ఇక గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేరి కుటుంబాలను పోషించుకుంటున్న వారు లక్షల్లోనే ఉన్నారు. ఏదేమైనా నిర్మలమ్మ బడ్జెట్ తమ కష్టాలు కడతేరుస్తుందని, సమస్యలు పరిష్కరిస్తుందని, జీవితాలను సుఖమయం చేస్తుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారి ఆశలు ఫలించేనా ?

ప్రశంసలే కానీ పెట్టుబడులు ఏవి?

2019లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించిన కొన్ని వారాల తర్వాత మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలపై వరాలు కురిపించింది. కార్పొరేట్ పన్నును 30 నుండి 22%కి తగ్గించింది. వృద్ధిని, పెట్టుబడులను పెంచేందుకు ఈ చర్య తీసుకున్నానని సమర్థించుకుంది. ఈ నిర్ణయం ఫలితంగా ప్రభుత్వం అప్పటి నుండి ఏటా కనీసం రూ.1.45 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పెట్టుబడుల్లో కార్పొరేట్ పెట్టుబడుల వాటా 19 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా కనిష్ట స్థాయికి పడిపోయింది. కార్పొరేట్ సంస్థల అధిపతులు ఓ వైపు ప్రభుత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తుతూనే మరోవైపు పెట్టుబడులు మాత్రం పెట్టడం లేదు. ప్రభుత్వం లేదా భారత ఆర్థిక వ్యవస్థపై వారికి చాలా కొద్దిపాటి విశ్వాసం మాత్రమే ఉన్నదని దీని ద్వారా అర్థమవుతోంది.

సంపద పంపిణీలో అసమానతలు

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు బీజేపీ తోక కత్తిరించారు. ప్రభుత్వం కొనసాగాలంటే మిత్రులపై ఆధారపడక తప్పని పరిస్థితి కల్పించారు. ఈ నేపథ్యంలో బీజేపీ తన పూర్వ పంథానే కొనసాగిస్తుందా లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందా అనేది బడ్జెట్‌లో కానీ తెలియదు. 2022-23లో యువతలో నిరుద్యోగం 45 శాతానికి చేరింది. దేశంలో అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదు. వాటి పంపిణీలో అసమానతలు కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. శతాబ్దం క్రితం బ్రిటీష్ వలస పాలకుల హయాంలో దేశంలో నెలకొన్న అసమానతలతో పోలిస్తే ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉన్నదని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ పత్రాలు చెబుతున్నాయి. దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక శాతం వ్యక్తుల సగటు ఆదాయం దిగువ 50 శాతం ఆదాయ సమూహంలోని ఓ వ్యక్తి ఆదాయం కంటే సుమారు 75 శాతం ఎక్కువగా ఉంది. ఈ విస్తృత అసమానతలు రోజువారీ ఆర్థిక కార్యకలాపాల్లో కన్పిస్తున్నాయి. ద్విచక్ర వాహనాల కోసం డిమాండ్ 2017లో కంటే తక్కువగానే ఉన్నప్పటికీ విలాసవంతమైన వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. దేశ ప్రజల్లో 80 శాతం మంది రోజుకు 200 కంటే తక్కువే ఖర్చు చేస్తున్నారని, సుమారు 34 శాతం మంది చేస్తున్న ఖర్చు రూ.100 కంటే తక్కువేనని ఇషాన్ ఆనంద్ ఇండియా ఫోరమ్‌లో రాశారు.

ఆశల పల్లకిలో ఆర్థిక సర్వే

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహం నిలిచిపోతుందని, ఈ పరిణామాలన్నీ రిజర్వ్‌బ్యాంక్ ద్రవ్య విధానాన్ని ప్రభావితం చేయవచ్చునని తెలిపింది. అయినప్పటికీ భవిష్యత్తుపై ప్రజలకు ఆశలు కల్పించే ప్రయత్నం చేసింది.



ఏం చెప్పిందంటే...

ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున పంటలు బాగా పండుతాయని, గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపింది. ప్రభుత్వం అనుసరిస్తున్న ధరల స్థిరీకరణ విధానం కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని చెప్పుకొచ్చింది. కార్పొరేట్ సంస్థల ఆర్థిక పరిస్థితి బాగుందని, కాబట్టి ప్రయివేటు పెట్టుబడులు పెరుగుతాయని అంచనా వేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పంట నష్టాల కారణంగా గత రెండు సంవత్సరాలలో ఆహార ధరలు పెరిగాయని తెలిపింది.

వివిధ రంగాలలో ఉద్యోగాలపై కృత్రిమ మేథ (ఏఐ) ఏ విధంగా ప్రభావం చూపుతుందో చెప్పలేమని ఆర్థిక సర్వే తెలిపింది. చైనా నుంచి భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరుగుతున్నందున దేశీయ ఎగుమతులు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, ఫలితంగా అంతర్జాతీయ సరఫరాల వ్యవస్థలో మనకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజలు మంచి ఆహార అలవాట్లను అలవరచుకోవాలని సూచించింది. ఈ సంవత్సరంలో మన వసూళ్లు 3.7 శాతం పెరిగి 12.400 కోట్ల డాలర్లకు చేరతాయని, వచ్చే ఏడాది 4 శాతం పెరిగి 12.900 కోట్ల డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. ఆటోమొబైల్ రంగంలో ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల కారణంగా రూ.67,690 కోట్ల మేరకు పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని, వీటిలో రూ.14,000 కోట్లు కార్యరూపం దాల్చాయని తెలిపింది.

ఉపాధి కల్పన, మూలధనపు వ్యయం వంటి విషయాలలో ప్రయివేటు రంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆర్థిక సర్వే కోరింది. దేశానికి ఆర్థిక, ద్రవ్య సుస్థిరత చేకూర్చడంలో శాసనకర్తలు కీలక పాత్ర పోషించారని ప్రశంసించింది. దీనిని నిలుపుకోవాలంటే దేశీయంగా కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నొక్కి చెప్పింది. 2021-22 నుంచి ప్రయివేటు పెట్టుబడులు కూడా పెరగడం మొదలైందని తెలిపింది. కొన్ని ఆహార వస్తువుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ మొత్తంమీద ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని చెప్పింది. 2022-23తో పోలిస్తే 2023-24లో వాణిజ్య లోటు తగ్గిందని గుర్తు చేసింది. జీడీపీలో కరెంట్ ఖాతా లోటు 0.7 శాతం ఉన్నదని, చాలినన్ని విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయని వివరించింది.

తగ్గిన వృద్ధి రేటు అంచనా

2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. 2024-25లో ఇదే వృద్ధి రేటు సాధిస్తామని గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం అంచనా వేసింది. వచ్చే ఏడాది మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి 7.2 శాతం వృద్ధి రేటు నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) వంటి ప్రపంచ సంస్థలు 7 శాతం వృద్ధి రేటును అంచనా వేశాయి.

గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలలోనూ జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పైగానే నమోదైంది. కానీ ఆర్థిక సర్వే మాత్రం వీటన్నింటి కంటే తక్కువగా 6.5-7 శాతం వృద్ధి రేటును మాత్రమే అంచనా వేయడం గమనార్హం.

సవాళ్లు తప్పడం లేదు

దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా, స్థిరంగా ఉన్నప్పటికీ దేశీయంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలోనే ఆర్థిక సర్వే రూపొందింది. వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలక అంతర్జాతీయ అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకోవడం చాలా కష్టంగా మారిందని ఆయన తెలిపారు.

మార్కెట్లపై మితిమీరిన విశ్వాసం..

- పెరిగిన రిటైల్ ఇన్వెస్టర్లు
- పొంతన లేని రాబడులు
- ఆర్థిక సర్వే 2024లో వెల్లడి



న్యూఢిల్లీ : అత్యంత వేగంగా పెరుగుతోన్న దేశీయ స్టాక్ మార్కెట్లపై కేంద్ర ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. మార్కెట్ల పెట్టుబడుల జూదంలో అధిక రాబడులు వస్తాయనే మితిమీరిన విశ్వాసం ఆందోళన కలిగించే అంశమని తెలిపింది. సోమవారం పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే 2024ను ప్రవేశపెట్టారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రకాశవంతంగా కనిపిస్తున్నప్పటికీ కొన్ని రంగాలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించడం అవసరం అని పేర్కొంది. "స్టాక్ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లలో భారీ పెరుగుదలను జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాస్తవ మార్కెట్ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పొంతన లేని మరింత ఎక్కువ రాబడిని ఆశించడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తుంది." అని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆర్థిక సంవత్సరం 2023-24లో ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 26.8 శాతం పెరిగింది. ఇంతక్రితం 2022-23లో 8.2 శాతం నష్టపోయింది. ప్రస్తుతం అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మార్కెట్‌లలో ఒకటిగా భారతీయ స్టాక్ మార్కెట్ ఉందని సర్వే పేర్కొంది. బిఎస్ఇలో ప్రస్తుతం 18.2 కోట్ల పైగా మంది రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లు ఉన్నారు. గత ఏడాదిలో కొత్తగా 4.5 కోట్ల (33.4 శాతం మంది) వినియోగదారులు చేరారు. 2024లో ఇప్పటి వరకు సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు 10 శాతం పెరిగాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 25 శాతం చొప్పున ర్యాలీ చేశాయి."మునుపెన్నడూ లేనివిధంగా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లలోకి వస్తున్నారు. గత కొన్ని ఏళ్లుగా పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఒ) విభాగంలోని ఊహాజనిత కార్యకలాపాల్లోకి వస్తోంది. దీన్ని తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది." అని ఈక్వినామిక్స్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు, రీసెర్చ్ హెడ్ జి చొక్కలింగం అన్నారు. 'భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ రంగానికి మద్దతు ఇవ్వాలి. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అవసరమైన మూలధనంలో అంతరాన్ని పూరించాల్సిన అవసరం ఉంది. బ్యాంకింగ్, బీమా, క్యాపిటల్ మార్కెట్‌లలో పనిచేసే సంస్థలు వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సరసమైన అమ్మకాలు, పారదర్శకత, విశ్వసనీయత, నాణ్యత సేవలను మెరుగుపరచాలి.' అని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆహారోత్పత్తుల ధరలు రెట్టింపు

ఆర్థిక సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : గడిచిన రెండేళ్లలో అహారోత్పత్తుల ధరలు రెట్టింపు అయ్యాయని మోడీ సర్కార్ అంగీకరించింది. '2021-22లో వినియోగదారులు అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం సూచీ (సీఎఫ్‌పీఐ) 3.8 శాతంగా ఉండగా.. 2022-23లో 6.6 శాతానికి, 2023-24 నాటికి 7.5 శాతానికి ఎగిసింది. రెండేండ్లలోనే 97 శాతం ద్రవ్యోల్బణం పెరిగింది.' అని ఆర్థిక సర్వే 2024 వెల్లడించింది. గతేడాది టమాటా ధరలు, ఉల్లి ధరలు మాత్రమే కాకుండా పప్పు ధాన్యాల ధరలు చుక్కలనంటిన విషయం తెలిసిందే. వాతావరణంలో ఏర్పాడిన మార్పులు, రిజర్వాయర్లలో నీటిమట్టం తగ్గడం, పంట నష్టం వంటివి ఆహార ధరలు పెరగటానికి ప్రధాన కారణాలని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఉల్లి ధరలు పెరగడానికి గత కోత సీజన్‌లో వర్షాలు, విత్తడంలో జాప్యం మాత్రమే కాకుండా ఇతర దేశాలు తీసుకున్న వాణిజ్య సంబంధిత చర్యలు కూడా కారణమని తెలుస్తోంది. తక్కువ ఉత్పత్తి కారణంగా పప్పుధాన్యాల ధరలు పెరిగాయని సర్వే పేర్కొంది.

బడ్జెట్‌పై మదుపర్ల భయాలు..!

- సెన్సెక్స్‌కు 102 పాయింట్ల నష్టం

ముంబయి : అమ్మకాల ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 102 పాయింట్లు కోల్పోయి 80,502 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 22 పాయింట్లు తగ్గి 24,509 వద్ద నమోదయ్యింది. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు కాసేపటికే కోలుకున్నప్పటికీ.. మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,800 - 80,100 మధ్య కదలాడింది.

దాదాపు 1953 షేర్లు రాణించగా.. 1575 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కోగా.. మరో 116 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి. నిఫ్టీలో విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టాటా కన్స్యూమర్, ఇన్ఫోసిస్ సూచీలు అధికంగా లాభపడ్డాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.3 శాతం, 0.85 శాతం చొప్పున లాభపడ్డాయి.

కృత్రిమ మేధాతో ఉద్యోగాలకు దెబ్బ

- ఆర్థిక సర్వే హెచ్చరిక



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ)తో ఉద్యోగాలపై తీవ్రమైన ప్రభావం పడనుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. ఎఐ ఉత్పాదకను పెంచనున్నప్పటికీ భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్యకు భారీగా ఎసరు పెట్టనుందని సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2024లో హెచ్చరించింది. ఆ వివరాలు.. 'ఎఐ ప్రభావం అనేక రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల మీద పడనుందని అంచనా. రాబోయే రోజుల్లో ఎఐ ప్రతి రంగంలోనూ పెను మార్పులను తీసుకురానుంది. కృత్రిమ మేధా ఒక్క భారత్‌పైనే కాదు. ప్రపంచ దేశాలపైనా ఉంటుంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో కూడా భారీ మార్పులు సంభవించే అవకాశం ఉంది. కస్టమర్ సర్వీస్, టీచింగ్, యాంకరింగ్ వంటి వాటిలో కూడా ఎఐ ప్రభావం చాలా ఉంది. కాబట్టి ఈ రంగాల్లో రాబోయే రోజుల్లో ఉద్యోగావకాశాలు తగ్గవచ్చు.ఈ నేపథ్యంలో ఉద్యోగార్థులు తప్పకుండా ఎఐ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి.' అని ఆర్థిక సర్వే పేర్కొంది.

విద్యలో లింగ వ్యత్యాసం

- పురుషులు, స్త్రీల మధ్య అక్షరాస్యత అంతరం 17 శాతం పైనే
- ఇది గతేదాది కంటే కాస్త ఎక్కువే
- ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో బాలురలోనూ డ్రాపౌట్లు



న్యూఢిల్లీ : దేశాభివృద్ధికి విద్య అనేది చాలా కీలకం. అయితే, విద్యావ్యవస్థలో ఏండ్లుగా లింగ వ్యత్యాసం కనిపిస్తున్నది. నమోదులో, అక్షరాస్యతలో బాలికలు, మహిళలు వెనకబడే ఉంటున్నారు. విద్యలో బాలికలు, మహిళలు రాణించటానికి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెప్తున్నప్పటికీ.. పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి తేడా కనబడటం లేదని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలికల డ్రాపౌట్లే కాదు.. ఆర్థిక పరిస్థితుల కారణంగా బాలుర డ్రాపౌట్లు కూడా పెరుగుతున్నాయని చెప్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్(డబ్ల్యూఈఎఫ్)-2024 నివేదిక ప్రకారం గ్లోబల్ జెండర్ గ్యాప్ ర్యాంకింగ్స్‌లో 146 ఆర్థిక వ్యవస్థలలో భారత్ 129వ స్థానానికి పడిపోయిన విషయం విదితమే. ఈ పతనం ప్రాథమికంగా విద్యారంగంలో ఎదురుదెబ్బల కారణంగా భారత్ గతేడాది కంటే రెండు స్థానాలు పడిపోయిందని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు.

డబ్ల్యూఈఎఫ్ నివేదిక విద్యా సాధనకు సంబంధించిన కొత్త డేటా భారతదేశ లింగ సమాన స్థాయిలలో క్షీణతకు కారణమైందని సూచిస్తున్నది. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలో మహిళల నమోదు రేట్లు అధికంగా ఉన్నప్పటికీ, పురోగతి మందగించింది. పురుషులు, స్త్రీల మధ్య అక్షరాస్యత అంతరం 17.2 శాతం పాయింట్ల వద్ద గణనీయంగా ఉన్నది. ఫలితంగా.. భారత్ ఈ సూచికలో 124వ స్థానంలో ఉన్నది. విద్యలో 0.964 స్కోర్ సాధించి.. 2023లో సాధించిన 1.000 ఖచ్చితమైన స్కోర్ నుంచి గణనీయమైన క్షీణతను నమోదు చేసింది.

భారతీయ గణాంకాలు ఏమి చూపిస్తున్నాయి?

యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈప్లస్), ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్ఈ) ద్వారా విద్యా మంత్రిత్వ శాఖకు అందిన సమాచారం ప్రకారం.. 2021-22 యూడీఐఎస్ఈప్లస్ నివేదిక ప్రకారం పాఠశాల జనాభాలో బాలురు ఎక్కువ శాతం ఉన్నారు. విద్య వివిధ దశలలో లింగ వ్యత్యాసం మారుతూ ఉంటుంది. ఉదాహరణకు, మొత్తం పాఠశాల జనాభాలో బాలికలు 48 శాతం ఉన్నారు. అయితే ఈ సంఖ్య వివిధ విద్యా స్థాయిలలో హెచ్చుతగ్గులకు గురవుతుంది. ప్రీస్కూల్‌లో, నమోదు చేసుకున్న పిల్లలలో బాలికలు 46.8 శాతం ఉన్నారు, ప్రాథమిక పాఠశాలలో 47.8 శాతానికి, ప్రాథమికోన్నత పాఠశాలలో 48.3 శాతానికి పెరిగింది. అయితే, సెకండరీ పాఠశాలలో గ్యాప్ మళ్లీ పెరుగుతుంది.

బాలికలు 47.9 శాతానికి పడిపోయారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. సెకండరీ విద్యను కొనసాగించే బాలికలు పూర్తి అయ్యేంత వరకు ఉంటారు. హయ్యర్ సెకండరీ స్థాయిలో లింగ వ్యత్యాసం మళ్లీ తగ్గుతోంది.

ఏఐఎస్‌హెచ్ఈ నివేదిక 2021-22 ప్రకారం.. ఉన్నత విద్యలో పురుషుల కంటే స్త్రీలకు స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) స్వల్పంగా ఎక్కువగా ఉన్నది. పురుషుల జీఈఆర్ 28.3తో పోలిస్తే మహిళలు జీఈఆర్ 28.5గా ఉన్నది. ఇది 2014-15 నుంచి స్త్రీల నమోదులో 32 శాతం పెరుగుదలను సూచిస్తుండటం గమనార్హం.

బాలికల విద్యకు పలు సౌకర్యాలు

దేశంలో మరిన్ని పాఠశాలల నిర్మాణం అత్యంత ప్రభావవంతమైన చర్యల్లో ఒకటని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలు పిల్లల ఇంటికి ఒకటి లేదా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటే, తల్లిదండ్రులు తమ పిల్లలను, ముఖ్యంగా బాలికలను చేర్పించే అవకాశమున్నదని చెప్తున్నారు. "90వ దశకం మధ్యకాలం నుంచి ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరగటంతో దేశవ్యాప్తంగా బాలికల నమోదు పెరిగింది" అని అంటున్నారు. మహిళా ఉపాధ్యాయుల ఉనికి, ఉచిత రవాణా, పారిశుధ్య సౌకర్యాలు వంటి ఇతర అంశాలు బాలికల నమోదు పెరగటానికి దోహదం చేస్తున్నాయి. అలాగే, ఉచిత బస్ పాస్‌లు, సైకిల్ పథకాలు హర్యానా, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో నమోదును పెంచాయి. అయితే ఈ చర్యలు రాజస్థాన్‌లో తక్కువ ప్రభావవంతంగా ఉన్నాయి. ముఖ్యంగా యుక్తవయస్సు వచ్చిన తర్వాత బాలికలకు పారిశుధ్యం ఒక క్లిష్టమైన సమస్యగా మిగిలిపోయింది. పాఠశాల వాష్‌రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవటమే తరచుగా 8వ తరగతి తర్వాత డ్రాపౌట్‌లకు దారి తీస్తున్నది.

లింగ వ్యత్యాసంలో తదుపరి సవాలు

అనేక రాష్ట్రాలు ఉన్నత తరగతుల్లో లింగ వ్యత్యాసంలో సానుకూల ఫలితాలను రాబట్టినప్పటికీ..పాఠశాల పూర్తి చేయటానికి ముందే బాలుర డ్రాపౌట్ల గురించి ఆందోళనలు ఉన్నాయి. కొంతమంది అబ్బాయిలు సెకండరీ స్థాయిలో విఫలమైన తర్వాత, తరచుగా ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా డ్రాప్ అవుతున్నారని కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు. కళాశాల స్థాయిలో, పురుష జీఈఆర్ కంటే.. స్త్రీ జీఈఆర్ ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రాంతీయ, క్రమశిక్షణల వారీగా అసమానతలు అలాగే ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) నుంచి పీహెచ్‌డీ స్థాయిల వరకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం సబ్జెక్టులలో 42.5 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ రంగాలలో ఎక్కువ మంది బాలికలను ప్రోత్సహించటానికి చొరవ అవసరమని నిపుణులు చెప్తున్నారు.అలాగే, భారత్‌లో వయోజన అక్షరాస్యత ఆందోళన కలిగిస్తున్నది. 2011 నుంచి ఇటీవలి జనాభా లెక్కల ప్రకారం.. 80.88 శాతం మంది పురుషులతో పోలిస్తే 64.63 శాతం మంది స్త్రీలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. పాఠశాల స్థాయిలో అక్షరాస్యతను మెరుగుపరచటం, గ్రామీణ మహిళలకు విద్యావకాశాలను అందించటం లింగ అంతరాన్ని తొలగించే దిశగా ముఖ్యమైన దశలుగా నిపుణులు సూచిస్తున్నారు.విద్య అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అంశమే అయినా.. ఈ లింగ వ్యత్యాసాన్ని నిర్మూలించటంలో వాటి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు మరిన్ని కేటాయింపులు పెంచి ఇలాంటి లింగ అంతరాలను రూపుమాపాలను సూచిస్తున్నారు. ఇందుకోసం మేధావులు, నిపుణుల సలహాలను, సూచనలను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని అంటున్నారు.

వ్యవసాయ రంగంలో సంస్కరణలు తప్పనిసరి

దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సి వుంది : సీఈఏ అనంత నాగేశ్వరన్



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రంగం దూసుకువెళుతోందని అయితే కొన్ని ఒడిదుడుకులను అధిగమించాల్సిన అవసరం వుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సోమవారం ఆమె పార్లమెంట్ ఉభయ సభల్లో 2023-24 సంవత్సరానికి ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. దీనితో పాటు గణాంకాలతో కూడిన అనుబంధాన్ని కూడా అందచేశారు. రుణాలు అందించడంలో బ్యాంకింగ్ రంగ ఆధిపత్యం తగ్గుతోందని, పెట్టుబడుల మార్కెట్ల పాత్ర పెరుగుతోందని సర్వే పేర్కొంది. మంగళవారం 2024-25 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను మంత్రి ప్రవేశపెట్టనున్నారు. వరుసగా మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ ఇదే. ప్రభుత్వ ఆర్థిక పనితీరుపై అధికారిక నివేదిక వంటిది ఈ ఆర్థిక సర్వే. పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన అనంతరం ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడిపి 6.5 నుండి 7శాతం మధ్య వృద్ధి చెందే అవకాశం వుందని సర్వే చెబుతోందన్నారు.

వ్యవసాయ రంగంలో అత్యవసరంగా సంస్కరణలు తేవాలి

దేశ వ్యవసాయ రంగంలో అత్యవసరంగా సంస్కరణలు తీసుకురావాలని ఆర్థిక సర్వే పిలుపిచ్చింది. ఈ రంగంలోని వ్యవస్థాగత అంశాలు దేశ సర్వతోముఖ ఆర్థికాభివృద్ధి పంథాను దెబ్బతీసే అవకాశం వుందని హెచ్చరించింది.


వ్యవసాయ రంగంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం వుందని ముఖ్య ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ రంగం సంక్షోభంలో లేదని, కానీ వ్యవస్థాగతంగా తీవ్రమైన పరివర్తన జరగాల్సిన అవసరం వుందని అన్నారు. రాబోయే కాలంలో వాతావరణ మార్పులు, నీటి సంక్షోభమనేది చాలా కీలక పాత్ర పోషించనున్నాయని అందువల్ల ఈ రంగంపై సవివరణమైన చర్చలు అవసరమని అన్నారు.

రైతులకు ప్రస్తుత ప్రభుత్వ సబ్సిడీలు, మద్దతు చర్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతమున్న విధానాలను పున:మదింపు చేయాలని కోరారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, పంటల నష్టం కారణంగా గత రెండేళ్ళుగా ఆహార ధరలు పెరిగాయని ఆర్థిక సర్వే పేర్కొంది. మరింత మెరుగవాలి

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తి స్వల్పంగా తగ్గిందని సిఇఎ చెప్పారు. రుతుపవనాల రాక ఆలస్యమవడం ఇందుకు కారణంగా వుందన్నారు. మన ఎంఎస్‌పి విధానాలతో వైవిధ్యభరితమైన పంటలను ప్రోత్సాహించాల్సిన అవసరం వుందన్నారు. ఆర్థికవ్యవస్థ ముందంజలో వుందని సిఇఎ అన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఒక త్రైమాసికం గడిచిపోయిందని, ఈ మార్చి చివరి నాటికి వృద్ధిరేటు 8.4శాతంగా వుందని చెప్పారు. గత మూడేళ్ళలో సగటు వృద్ధి రేటు కూడా దాదాపు 8శాతంగానే వుందన్నారు.

సంపాదకీయం

విభజన చిచ్చు



ప్రత్యక్షంగానే దాడి మొదలైంది. విభజన కూడా బహిరంగంగానే ఆరంభమైంది. నీవేవరో? నీ పేరేమిటో? బోర్డు కట్టి మెడకు తగిలించుకోమంటున్నారు. నాటి హిట్లర్, ముస్సోలినీల అడుగుల్లో అడుగులు వేస్తూ నిరంకుశంగానే యోగి తెగబడుతున్నారు. మనుషులను మతాలుగా విభజించి చిచ్చు పెట్టేందుకు ప్రజాస్వామ్య దేశంలో బాహటంగానే తలపులు తెరుచుకుంటున్నాయి. ఈ దేశం 'మీది కాదు మాది' అంటే భిన్నత్వంలో ఏకత్వంలా కలిసుండే ప్రజలు ఎక్కడివెళ్లాలి? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆంక్షల బోనులో ప్రజల్ని బంధిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సోమవారం నాడు మొదలైన కన్వర్‌యాత్ర ఆగస్టు 4తో ముగుస్తుంది. ఈ యాత్ర సాగే దారి పొడవున ఉన్న తినుబండారాలు అమ్మే దుకాణాలు, టీ కొట్లు, హోటళ్లు, పళ్లబండ్లు మొదలైన వాటి ముందు యజమానుల పేర్లు, వాటిలో పని చేసే వారి పేర్లు, వ్యక్తిగత వివరాలతో బోర్డులు పెట్టాలంటూ తొలుత ముజఫర్ నగర్ పాలనా విభాగం ఆదేశించింది. ఆ తరవాత ఈ ఆదేశాన్ని యోగీ ప్రభుత్వం రాష్ట్ర మంతటికీ వర్తింపచేసింది. ఆ బాటలోనే ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు నడిచాయి. ఆ పేర్లను బట్టి వారి కుల మతాలు తెలుసుకోవాలన్న ఉద్దేశం ఈ ఆదేశాల వెనక దాగి ఉంది. ఈ తీరును ఏమనాలి? ఇది దేనిని సూచిస్తున్నట్టు?

> దేశంలో మైనార్టీ ప్రజలు నిత్యం అభద్రత, ఆందోళన, అసహనంతో బతుకులీడుస్తున్నారు. వారికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలకు కత్తెరేశారు. ముస్లింల వృత్తిలో ప్రధానమైనది మాంసం విక్రయించడం. ఇది ఏండ్లుగా సాగుతున్నా, ఇప్పుడు కొత్తగా ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో, శోభాయాత్రలు నిర్వహించే ప్రదేశాల్లో, హోమాలు జరిగే చోట్ల ముస్లింలపై విధిస్తున్న ఆంక్షలతో వారి జీవనోపాధి ఏం కావాలి?

వారి అసలైన ఉద్దేశం కనిపించకుండా మభ్య పెడుతూ ఇచ్చిన ఆదేశాలు ఇవి. నేమ్‌ప్లేట్స్ ప్రదర్శించనివారికి జరిమానా విధిస్తారు. ఎవరు మనకు వడ్డిస్తున్నారని కాకుండా.. తినాలనుకుంటున్న ఆహారాన్ని బట్టి మనం రెస్టారెంట్‌కు వెళ్తాం. గుర్తింపును బట్టి దూరం పెట్టే ఉద్దేశమే ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అది అక్కడితోనే ఆగలేదు. ఆ దుకాణాల్లో ముస్లిం ఉద్యోగులుంటే వారిని తొలగించాలని ఆదేశించిన ఉదంతాలూ ఉన్నాయి. ఈ యాత్ర వలన ఆ ప్రాంత ముస్లిములు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి.

యోగి ప్రభుత్వచర్యను స్వపక్షం విపక్షం అన్న తేడాలేకుండా అన్ని పక్షాలు తూర్పారబడ్తున్నాయి. అంటే ఇది ఎంతటి ప్రజాకంటక ఆదేశమో అర్థం చేసుకోవచ్చు. అన్య మతస్థుల వ్యాపారాలను దెబ్బతీసే ఉద్దేశం వికృతరీతిలో బయటకువస్తోంది. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీతో కలిసి అధికారం పంచుకుంటున్న నితీశ్ కుమార్ నాయకత్వంలోని జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపి, ఆర్‌ఎల్డీ కూడా ఈ వివక్షా పూరిత ఉత్తర్వును దుయ్యబడు తున్నాయి. గతంలోనూ ఇలానే మాంసాన్ని బహిరంగంగా అమ్మకూడదని నిబంధన యోగి ప్రభుత్వం తీసుకొచ్చింది. అప్పుడు కూడా 'భక్తుల మనోభా వాలు దెబ్బతినకుండా ఉండేందుకే..' అంటూ రాగాలు తీశారు. కానీ, బాధితులకు కూడా మనో భావాలు ఉంటాయి కదా? వాటి సంగతేమిటి?

ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ ప్రజలు మతోన్మాదాన్ని తిప్పికొట్టారు. సాక్షాత్తు రాముడు "కొలువైన" అయోధ్యలోనూ, శంకరుడు "కొలువైన" బద్రీనాథ్‌లోనూ కాషాయపార్టీని జనం విసిరికొట్టారు. అయినా వాటి నుంచి గుణపాఠాలు నేర్వని బీజేపీ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తున్నామనే పేరుతో, గౌరవిస్తున్నామనే సాకుతో ప్రజల్ని ఆంక్షల ఛట్రంలోకిలాగే తంత్రం నడుపుతున్నారు. ఇది భారత సంస్కృతిపై దాడే. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే కన్వర్‌యాత్ర ఉంది. అప్పుడెపుడూ ముస్లింల మీద ఈ రకమైన ఆంక్షలు ఏ ప్రభుత్వం విధించిన పాపాన పోలేదు. ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రానిది ఇప్పుడే ఎందుకు సృష్టించబడుతున్నవి? 'హిందూ, ముస్లిం భాయ్‌భాయ్' అంటూ సోదరుల్లా కలిసుండే వారి మధ్య విభజన చిచ్చును ఎందుకు రగిలిస్తున్నారో ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో మైనార్టీ ప్రజలు నిత్యం అభద్రత, ఆందోళన, అసహనంతో బతుకులీడుస్తున్నారు. వారికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలకు కత్తెరేశారు. ముస్లింల వృత్తిలో ప్రధానమైనది మాంసం విక్రయించడం. ఇది ఏండ్లుగా సాగుతున్నా ఇప్పుడు కొత్తగా ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో, శోభాయాత్రలు నిర్వహించే ప్రదేశాల్లో, హోమాలు జరిగే చోట్ల ముస్లింలపై విధిస్తున్న ఆంక్షలతో వారి జీవనోపాధి ఏం కావాలి? సర్వోన్నత న్యాయస్థానం సోమవారం నాడు ఇచ్చిన తీర్పు కొంత ఆశాజనకంగా ఉంది.

నేడు మన దేశంలో అమలవుతున్న ఆంక్షలు. ఇక్కడ ముస్లింల మీద జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష దాడులు చూస్తుంటే తాలిబన్లు విధిస్తున్న ఆంక్షలను తలపిస్తున్నాయి. ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసుకున్న ఈ విధానం దేశాన్ని నిత్యాగ్నిగుండంగా మార్చే ప్రమాదం ఉంది. విభజించు, పాలించు నినాదంతో మత, విద్వేష పాలన సాగిస్తున్న కేంద్రం విధానాల్ని ఎదుర్కోవడం ప్రస్తుతం దేశ లక్ష్యం. లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న శక్తులకు మద్దతునివ్వడం, వారిబాటలో అడుగులేయడం ప్రజల కర్తవ్యం. చీకట్లోకి నెడుతున్న భారతావనికి వెలుగులు చూపడం అందరి బాధ్యత. ఇక ఆలోచించాల్సింది పౌర సమాజమే...

అమెరికా ఆర్థిక దిగ్బంధనం - క్యూబా ప్రతిఘటన



ఇప్పటికే అరవైయేండ్ల పైబడి, అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, విత్త దిగ్బంధనం మూలంగా క్యూబా ఎన్నో పరిమితులు, ప్రతికూల పరిస్థితులతో నానా బాధలు పడ్డది. అమెరికా విధించినది ఒక అన్యాయమైన దిగ్బంధనం, కాలం చెల్లిన పద్ధతి, ఆర్థికంగా ఊపిరి సలపని పరిస్థితి కల్పించి, క్యూబన్ ప్రజలు సాధించిన విప్లవాన్ని నాశనం చేసి, తిరిగి ఆ దేశాన్ని తన ఆర్థిక వలసదేశంగా మార్చాలనే దుష్ట పన్నాగమిది. అయితే, ఈ విషయంలో క్యూబా చేష్టలుడిగి అచేతనంగా నిలబడలేదు. తన సృజనాత్మక ప్రతిఘటనను పెంచుకుని, ముందుకు సాగి ఒక దేశంగా అభివృద్ధి చెందింది.గత ఐదేండ్లలో క్యూబాపై విధించిన అమెరికా దిగ్బంధనం ఇంకా ఎక్కువైంది. ఈ పరిణామమంతా కోవిడ్-19 కల్పించిన ఆరోగ్య, ఆర్థిక సంక్షోభం నడుమ, అంతర్జాతీయ స్థాయిలో దిగజారుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత, సంఘర్షణల మధ్య సంభవించింది. దీని ప్రభావం ఈనాడు క్యూబా అనుభవిస్తున్న ఆర్థిక పరిస్థితిపై గణనీయంగా ఉంది.

2019 రెండో అర్ధ భాగం దాకా క్యూబా ప్రజల జీవితాన్ని, ఆ తర్వాత ఎట్లా ఉన్నది అనే దాన్ని పోల్చి చూసినట్లయితే బలపడిన అమెరికా దిగ్బంధనం ప్రభావం మనకు స్పష్టమవుతుంది. 2019లో క్యూబా ఎగుమతులు నుంచి ఆదాయాన్ని అందుకుంది; ఇతర దేశాల నుంచి వచ్చే రెమిటన్స్ (ఇతర దేశాలలో ఉన్న క్యూబా ప్రజలు పంపించిన సొమ్ము) గణనీయంగా ఉండేది; టూరిజం నుంచి చెప్పుకోదగిన ఆదాయం వచ్చేది- ఒక ఏడాదిలో 45 లక్షల మంది టూరిస్టులు క్యూబా సందర్శనకు వచ్చేవారు. అలాగే వివిధ విత్త సంస్థల నుంచి, ప్రభుత్వాల నుంచి అందుకునే రుణాలు, అంతర్జాతీయ కార్యక్రమాలు, సంస్థలు నుంచి వచ్చే సొమ్ము ఉండేది. వీటన్నిటి సహాయంతో వివిధ అభివృద్ధి పథకాలను నిర్వహించేవారు. మరోవైపు, స్నేహపూర్వక దేశాలతో పరిహార ఒప్పందాల మూలంగా స్థిరమైన ఇంధన సరఫరా ఉండేది.

ఈ పరిస్థితులలో, ప్రధాన ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడి సరుకు దిగుమతి చేసుకోవడానికి, ప్రభుత్వం ప్రాథమిక ఆహార వస్తువులు సరఫరాకు, అలాగే దేశీయ మార్కెట్లో ఇతర ఆహార పదార్థాలు సరఫరాకు విదేశీ కరెన్సీ ఆదాయం అందుబాటులో ఉండేది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో క్యూబా కరెన్సీ నిలకడగా ఉండటానికి అవసరమైన విదేశీ కరెన్సీ అందుబాటులో ఉండేది. ఆర్థిక ఒప్పందాల పరిష్కారానికి ఆమోదయోగ్యమైన స్థాయిలో చెల్లింపు సామర్థ్యం ఉండేది. ఆర్థికరంగం సజావుగా నడవడానికి అత్యంత ముఖ్యమైన విడిభాగాలు, ఉపకరణాల కొనుగోలు చెల్లింపులకు విదేశీ మారక ద్రవ్యం లభ్యంగా ఉండేది. ద్రవ్యోల్బణ స్థాయి కూడా తక్కువలో ఉండేది.సారాంశంలో, దేశం కోరుకున్న సమృద్ధిని సాధించలేక పోయినప్పటికీ, కొంతమేరకు స్థిరత్వాన్ని కలిగివుంది. దానివలన, 2030 నాటిదాకా వేసుకున్న దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా ఆర్థికంగా, సామాజికంగా మెరుగుపడి, అభివృద్ధి సాధించటం వీలయింది.

2019 సంవత్సరం రెండో సగభాగంలో, క్యూబాకు వ్యతిరేకంగా దిగ్బంధంపై మరింత పట్టుబిగించేందుకు ట్రంప్ పాలన యంత్రాంగం 240కి పైగా చర్యలు తీసుకుంది. ఈ చర్యలతో దేశానికి వచ్చే విదేశీ నగదు ఆదాయానికి హఠాత్తుగా కోతపడింది. క్రూయిజ్ షిప్పులు (నౌకవిహారం)మూతపడటంతో, టూరిజం చాలావరకు పడిపోయింది. అమెరికా అమిత శక్తితో ఆర్థికంగా పీడించడంవల్ల నిధులు అందుకోవటం, ఉత్పత్తి ప్రక్రియకి అవసరమైన ముడి సరుకులు పొందటం, ఇంధనం కొనడం అసాధ్యమైంది. 92 కంటే ఎక్కువ బ్యాంకులు, అంతర్జాతీయ విత్త సంస్థలపై ఆంక్షలు విధించడం, క్యూబాతో వాటికున్న సంబంధాలు నిలిపివేయాలని అమెరికా ఒత్తిడి చేసింది. రెమిటెన్స్‌ల రాకలో కూడా కోత పడ్డది.దీని ప్రభావం జాతీయ విద్యుత్- వ్యవస్థపై భారీగా పడి, ప్రజలకు, పరిశ్రమలకు తీవ్ర ఇబ్బందులు కలగజేసే విద్యుత్ కోతలకు దారితీసింది.

2020వ సంవత్సరం మొదటి నెలలో, వైట్ హౌస్ వదిలి వెళ్లటానికి పది రోజులు ముందు, క్యూబా టెర్రరిజాన్ని ప్రోత్సహించే దేశంగా ఆరోపిస్తూ అటువంటి దేశాల జాబితాలో క్యూబాను చేరుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో అన్ని బ్యాంకింగ్, విత్తసంస్థలు దేశానికి అప్పు ఇవ్వటం ఆకస్మికంగా నిలుపు చేశాయి. దీని మూలంగా ఆర్థిక చెల్లింపుల బాధ్యతలు నెరవేర్చటానికి అవసరమైన విదేశీ కరెన్సీ లభ్యతకు పెద్దదెబ్బ తగిలింది. దీనితో దేశంలోని స్థాపిత సామర్థ్యానికి అనుగు ణంగా, వస్తు సేవల సరఫరాను నిలకడగా నిర్వహించడానికి చేపట్టవల్సిన ఆర్థిక అభివృద్ధి కార్యకలాపాల అడ్డంకి ఏర్పడ్డది. సప్లయ్ డిమాండ్ల మధ్య భారీ అంతరం ఏర్పడ్డది. ఆ ప్రభావంతో అధిక ద్రవ్యోల్బణం వలన ధరలు పెరగడం జరిగింది. విదేశీ కరెన్సీ కొరత కారణంతో దేశం న్యాయబద్ధమైన మారకపు మార్కెట్ ను సమర్థవంతంగా నిర్వహించలేకపోయింది. మారకపు రేటులో మోసం జరగటానికి అవకాశమున్న ఇది ఒక చట్ట విరుద్ధమైన మార్కెట్ సృష్టించబడటానికి కారణమైంది. ధరలు నిర్ణయించడంలో ఇది ఒక అంశంగా మారింది, ద్రవ్యోల్బణం పెరగడానికి సహాయ పడ్డది.

> క్యూబా-అమెరికా ఇరు సంబంధాల మధ్య నెలకొన్న అన్ని సమస్యలను, ఎటువంటి ఆంక్షలు, షరతులు విధించుకోకుండా, సమానస్థాయిలో అమెరికాతో చర్చలు జరుపటానికి సిద్ధంగాఉన్నట్టు క్యూబా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అమెరికాకు తెలిపింది. అయినప్పటికీ, ఇరుగు పొరుగు దేశాల మధ్య గౌరవప్రదమైన సంబంధాలు కలిగి ఉండటా నికి ఆస్కారమున్న చోట, రెండు దేశాల మధ్య ఇప్పుడున్న సైద్ధాంతిక విభేదాలు పక్కనబెట్టి, వ్యాపార-ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక తదితర అన్ని రంగాలలో సహకారం ఉండాల్సిన చోట అమెరికా పాలనా యంత్రాంగం క్యూబా పట్ల తన ధోరణిని మార్చుకోవటానికి మొగ్గు చూపటం లేదు. 60 ఏండ్లకు పైగా విప్లవంలో అభివృద్ధి పరు చుకున్న మానవ ప్రతిభను ఉపయోగించుకుని తన స్వయంకృషితో, సొంత సామర్థ్యంతో ఈ దిగ్బంధనను అదిగమించగలమని క్యూబా విశ్వసించింది.

దిగ్బంధనాన్ని పటిష్టంగా అమలు చేస్తున్న ఆర్థిక పరిస్థితుల్లో కోవిడ్- 19 మహమ్మారి నుంచి క్యూబా కూడా ఇబ్బందులు ఎదుర్కొంది. కోవిడ్ -19 అనుసరిస్తూనే అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదల, బహుముఖాలుగా సాగిన భౌగోళిక సంక్షోభం, పర్యావరణ మార్పుల ప్రభావం, దాని మూలంగా తీవ్రమైన కరువు, విపరీతమైన వర్షాలు, జల-వాతావరణ సంఘటనలు క్యూబా ఆర్థికరంగాన్ని గణనీయంగా దెబ్బతీశాయి.ఈ రెండింటి సమిష్టి ప్రభావం వలన దేశంలో మందులు, ఆహారం, ఇంధనం కొరతపడే వాతావరణం ఏర్పడ్డది. ఆ ఫలితంగా క్యూబా విప్లవ సామాజిక కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం కుంటుపడ్డాయి. దేశ పురోభివృద్ధికి దిగ్బంధన ప్రధాన అడ్డంకిగా మారింది. ఇంతటి తీవ్రమైన దిగ్బంధన నాలుగేళ్ల పాటు కొనసాగిందని గమనించాలి. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదలైన ఈ తీవ్ర దిగ్బంధన, బైడెన్ కాలంలోనూ,చివరికి కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ కొనసాగింది. దేశంలో మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి చేసే కర్మాగారం చెడిపోతే, క్యూబాకు ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీల మీద ఒత్తిడి పెట్టి ఆక్సిజన్ సప్లయ్‌ని అడ్డుకోవడం దీనికి ఉదాహరణ.

క్యూబా - అమెరికా ఇరు సంబంధాల మధ్య నెలకొన్న అన్ని సమస్యలను, ఎటువంటి ఆంక్షలు, షరతులు విధించుకోకుండా, సమాన స్థాయిలో అమెరికాతో చర్చలు జరుపటానికి సిద్ధంగా ఉన్నట్టు క్యూబా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అమెరికాకు తెలిపింది. అయినప్పటికీ, ఇరుగు పొరుగు దేశాల మధ్య గౌరవప్రదమైన సంబంధాలు కలిగి ఉండటానికి ఆస్కారమున్న చోట, రెండు దేశాల మధ్య ఇప్పుడున్న సైద్ధాంతిక విభేదాలు పక్కనబెట్టి, వ్యాపార-ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక తదితర అన్ని రంగాలలో సహకారం ఉండాల్సిన చోట అమెరికా పాలనా యంత్రాంగం క్యూబా పట్ల తన ధోరణిని మార్చుకోవటానికి మొగ్గు చూపటం లేదు. 60 ఏండ్లకు పైగా విప్లవంలో అభివృద్ధి పరుచుకున్న మానవ ప్రతిభను ఉపయోగించుకుని తన స్వయంకృషితో, సొంత సామర్థ్యంతో ఈ దిగ్బంధనాన్ని అధిగమించగలమని క్యూబా విశ్వసిస్తోంది.

పునరుత్పాదక ఇంధన వనరుల వాడకం పెంచడంలో, ముఖ్యంగా ఫోటో వాల్టాయిక్ సోలార్ విద్యుత్ వాడకంలో క్యూబా ఈ అభివృద్ధిని సాధించింది. దీనివలన విద్యుత్ ఉత్పాదనకి పెట్రోలు, సహజ వాయువు, బొగ్గు లాంటి హైడ్రోకార్బన్ల దిగుమతులపై ఆధార పడవలసిన అవసరం తగ్గింది. ప్రస్తుతం దేశం 2000 మెగావాట్ల ఫోటోవాల్టాయిక్ సోలార్ పార్కులను రెండేళ్లలో నిర్మించాలనే లక్ష్యంతో అనేక ఒప్పందాల మీద సంతకాలు చేసింది. దీనివలన ఆర్థిక రంగానికి చెప్పుకోదగిన పరిమాణంలో ఇంధనం లభ్యమవుతుంది. ఇది ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల పెరుగుదలకు ఉపయోగపడుతుంది.

ఎగుమతి కోసం నూతన ఉత్పత్తులు తయారు చేసే పద్ధతిలో దేశంలోనే ముడి చమురుత్పత్తిని పెంచడానికి, ఆ చమురు శుద్ధి చేసే సామర్థ్యాన్ని పెంచడానికి క్యూబా చర్యలు తీసుకుంటున్నది. ఇటువంటి కష్టమైన ఆర్థిక పరిస్థితులో, క్యూబా ఆరోగ్యరంగంలో ముఖ్యమైన మైలురాళ్లని చేరుకుంది. ఆ రంగంలో నూతన విజయాల అంది పుచ్చుకోవడానికి కృషి చేస్తున్నది. కోవిడ్- 19కి వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో క్యూబా విప్లవం మానవతా స్ఫూర్తిని కొనసాగించింది. తమ కృషివల్ల దేశంలోకి వచ్చిన అతికొద్ది ధనం మనుషుల ప్రాణాలు కాపాడటానికే వెచ్చించింది. దేశంలోని సైంటిస్టుల కృషితో, బయో ఫార్మాసుటికల్ పరిశ్రమ సహాయంతో క్యూబా సొంతంగా వ్యాక్సిన్ తయారు చేసుకోగలిగింది. సొంతంగా వ్యాక్సిన్ తయారుచేసిన అతి కొద్ది దేశాలలో క్యూబా ఒకటి. దేశంలోని ప్రజలందరికి వ్యాక్సిన్ వేయగలిగింది. అంతులేని దిగ్బంధన కింద, పరిమితమైన వనరులు కలిగి ఉన్న క్యూబా సాధించిన ఈ విజయం అసాధారణమైనది. మూడు నెలల్లో, మొదటి వ్యాక్సిన్ ఇంజక్షన్ అభివృద్ధి చేయగలిగింది. ఆ తర్వాత ఐదు రకాల వ్యాక్సిన్ ఇంజక్షన్లను తయారు చేసింది. వాటిల్లో మూడు వ్యాక్సిన్ల పనితీరు అద్భుతంగా ఉందని నిరూపించబడింది. ఎన్ని అవరోధాలు ఉన్నప్పటికీ క్యూబాకున్న ఆరోగ్య పరిరక్షణా సామర్థ్యం చెక్కు చెదరలేదని ఆరోజు రుజువు అయింది.అంతేకాక, ఆనాడు కోవిడ్-19 విస్తృతంగా ఉన్న దేశాలతో సహా 46 కంటే ఎక్కువ దేశాలకు వైద్య బృందాలను పంపి క్యూబా తన చారిత్రాత్మక అంతర్జాతీయ వైద్య సహకారాన్ని కొనసాగించింది.

అల్జీమర్స్, పార్కిన్సన్స్, ఇతర కుంగదీసే వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులకు బయోటెక్నాలజికల్ ఔషధాలతో అధునాతన పద్ధతులతో చికిత్సలగురించి అధ్యయనంలో నేడు క్యూబా ముఖ్యమైన పురోగతిని సాధిస్తున్నది. అదే సమయంలో, అన్ని రకాల డెంగ్యూ జ్వరాలకు వ్యతిరేకంగా సమర్థవంతమైన వ్యాక్సిన్ తయారీకోసం పని జరుగుతోంది, ఇది ఇప్పుడు పూర్తయ్యే దశలో ఉంది.అమెరికా దిగ్బంధనకు వ్యతిరేకంగా క్యూబా సాగిస్తున్న పోరాటానికి విస్తృతమైన అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నది. గత మూడు దశాబ్దాలుగా ప్రతి ఏడు, ఈ దిగ్బంధన విధానానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి సర్వసభ సమావేశంలో క్యూబా గొప్ప విజయాలు సాధించింది. ఇజ్రాయిల్ మరికొన్ని దేశాలు మినహాయిస్తే, ఐక్యరాజ్యసమితిలో ఉన్న 180 దేశాలలో క్యూబా తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. అయినా సరే, అమెరికా అంగీకరించట్లేదు. దిగ్బంధనం ఎత్తివేయలేదు. ఇది అమెరికా దురహంకారాన్ని, ప్రపంచ దేశాల అభిప్రాయం పట్ల ధిక్కరణను రుజువు చేస్తున్నది.

ప్రతి ఏడు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలలో అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా మాట్లాడే దేశాధినేతల సంఖ్య పెరుగుతున్నది. గత సమావేశాల్లో, ఈ సమస్య పైన చర్చ జరుగుతున్నప్పుడు 44 మంది ప్రపంచ నాయకులు దిగ్బంధం వ్యతిరేకిస్తూ మాట్లాడారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం దేశాలు, సంస్థలు, ప్రాంతీయ కూటములు, అంతర్జాతీయ సంస్థలు దిగ్బంధనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయటం సాధారణ విషయంగా మారింది. అదే సమయంలో ఈ దిగ్బంధన విధానానికి వ్యతిరేకంగా ప్రపంచమంతటా నిరసన కార్యక్రమాలు జరగటం పెరిగింది. ఒక్క 2023 సంవత్సరంలోనే క్యూబాకు మద్దతుగా రెండు వేలకు పైగా ప్రదర్శనలు జరిగాయి.

(క్యూబా రిపబ్లిక్ అధ్యక్షుడు అయిన మిగ్యుల్ దయాజ్-కానెల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఈ వ్యాసం)

- అనువాదం : కర్లపాలెం

చనిపోయిన అమ్మకడుపున
శిశువుగా జన్మించాను
అనాథగా జీవితాన్ని
ప్రారంభించి
జీవన పోరాటాన్ని
మొదలుపెట్టి
విమానాల మోతల మధ్య
బాంబుల శబ్దాల మధ్య
నా జీవిత భవిష్యత్ చిత్రాన్ని
కండ్లు తెరుస్తూనే చూశాను
మాకంటూ సొంత నేల లేని
మా దేశమనే కాందిశీకుల
రాజ్యంలో ప్రపంచం సాక్షిగా
నేనీలోకంలోకి వచ్చాను
పాలిచ్చి ఎలా పెంచాలని

అమ్మ సాక్షిగా అడుగుతున్నా?



లాలింపులు ఎలా చేయాలని
మనసులో ఏమేమి అనుకుందో
ఎన్ని ఊసులు తనకి తాను
చేసుకుందో చెప్పుకుందో
మురిసిపోయిందో మా అమ్మ
నాకు అవేవీ తెలియదు
ఈ మానవలోకంలో
ఒక అమానవీయ చర్యతో
నా తల్లి నాకు దూరం కాగా
తన కొడుగ్గా పుట్టిన నేను
నా ముందున్న బతుకు
ఎలా ఉండనుందో
ఊహించలేని
రెండు రోజుల బాలుణ్ణి
మా బతుకులు
మా సొంతం కాదు
అవి మూణ్నాళ్ల ముచ్చటలే
అమ్మ సాక్షిగా
అడుగుతున్నా
ఈ ప్రపంచాన్ని
మాకు తోడుంటారా అని....

- జంధ్యాల రఘుబాబు
9849753298

(గాజాపై ఇజ్రాయిల్ బాంబుదాడిలో అమ్మ చనిపోయిన, బిడ్డకు జన్మనిచ్చిన అల్-కుర్ద్‌కు నివాళిగా)

ఆర్థిక ప్రగతి సరే - పేదల మాటేమిటి?

అభివృద్ధికి కొలమానం ఏమిటి? ఆర్థిక అంతరాలు రోజురోజుకి పూడ్చలేని అగాధాలుగా మారుతున్న వేళ మనం కూడా అగ్రరాజ్యాల సరసన చేరుతున్నామన్న 'హెచ్చులకు' అర్థం ఏమన్నా ఉంటుందా? పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం నిర్మూలించనంతవరకు ప్రజాజీవితాలకు వెలుగెక్కడ?


కె. శాంతారావు
9959745723

ఈ మౌలిక సమస్యలకు పరిష్కారం చూడకుండా, చూపకుండా పాలకులు ప్రజల్ని ఎంతకాలం పసలేని మాయమాటలతో మోసగిస్తారు? ఇవి ప్రజాస్వామ్యంలో ప్రజలనుండి ధర్మాగ్రహంతో ఉబికి వస్తున్న ప్రశ్నలు.

మన దేశ జనాభా దాదాపు 145 కోట్లు. 140 కోట్ల జనచైనాను గత ఏడాదే మనం అధిగమించాం. 2011 సం॥ తర్వాత మన దేశంలో జనగణనే జరగలేదు. దేశ జనాభా స్థితిగతులపై స్పష్టమైన అవగాహన కల్పించి జనావళికి దిక్సూచిలా పథనిర్దేశం చేయవలసిన పాలకులు ఉదాశీనత వహించడం క్షంతవ్యం కాదు.

ఇటీవల విడుదలైన ప్రపంచ జనాభా గణదృశ్యమే (డబ్ల్యు.పి.పి) నేడు మనకు దిక్కయింది. వయో, లింగ బేధాల కారణంగా మన దేశ జనాభా భవిష్యత్‌లో ఎలా ఉండబోతున్నది ఈ సంస్థ అంచనా వేసింది. సమీప భవిష్యత్‌లో జన విస్ఫోటనం మన దేశంలోనే అత్యధికంగా ఉంటుంది. 2080 నాటికి ప్రపంచ జనాభా వెయ్యి కోట్లు దాటుతుంది. మన దేశ జనాభా కూడా ఈ క్రమంలో 2060 వరకు గణనీయంగా పెరుగుతూనే పోతుంది.

ప్రస్తుతం మనదేశంలో పనిచేసే వయసుగలిగిన వారు 86 కోట్ల మంది ఉన్నారు. 2049 వరకు ఈ సంఖ్య ఇలానే పెరుగుతూ పోతూ వంద కోట్లకు చేరుకుంటుంది. అయితే వందకోట్ల మందికి పూర్తిస్థాయి ఉపాధి కల్పించి, తగిన నైపుణ్య సామర్థ్యాలను అందించినపుడు మాత్రమే దేశాభివృద్ధికి నిజమైన నిర్వచనం చెప్పగలం. కానీ మన పాలకులు ఇవేమీ పట్టించుకోకుండా 2047కల్లా భారత్ మూడో అగ్రదేశంగా మారుతున్నట్టు తెగ ఊదరకొడుతున్నారు.

ఇటీవల గుజరాత్‌లో కేవలం పది ఉద్యోగాలకు 1800 మంది హాజరుకావడం, ముంబైలో రెండె వేల ఉద్యోగాలకు 22 వేల మంది హాజరై తొక్కిసలాటకు గురికావడం ఏం సూచిస్తున్నది? నిరుద్యోగ తీవ్రత ఊబిలోకి యువత కూరుకుపోవడం కాదా.....? కనిపిస్తున్నది.

రానున్న కాలంలో మనతో పాటు ఆఫ్రికా ఖండంలో (సోమాలియా, కాంగో) జనాభా పెరగనుంది. ఆఫ్రికా ఖండం అంటేనే వజ్రాల సహజవనరుల గని, ఆ నిధి నిక్షేపాలపై కన్నేసిన బహుళ జాతి కార్పోరేట్ కంపెనీలు మరి ఆ దేశ ప్రజానీకాన్ని పేదరికం నుండి విముక్తి చేస్తాయా? విముక్తి చేయరనేది చరిత్ర చెబుతున్న సత్యం. కాగా మన పొరుగు దేశం పాకిస్తాన్ కూడా 39 కోట్లకు చేరుకుంది. అమెరికా జనాభాను దాటి మూడవ అతిపెద్ద జనాభా దేశంగా అవతరించింది. జనాభా పెరుగుతున్న ఈ దేశాల్లో పేదరికం, నిరుద్యోగం సమాంతరంగా పెరుగుతున్నవైనం దోబూచులాడు తున్నది. అంటే కార్పోరేట్ల అమానవీయ దోపిడీని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. ఆత్మహత్యలు అందుకు ఓ సంకేతం.

2022లో మన దేశంలో 1 లక్షా 71 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తెలిపింది. సగటున ప్రతి ఏడాదికి 12-13 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది కూడా ప్రపంచ రికార్డు. వ్యవసాయ రంగంలో 11,290 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. అన్ని వృత్తులకు తల్లి వృత్తి వంటి వ్యవసాయ వృత్తి సంక్షోభ నివారణ దిశగా పాలకులు శాస్త్రీయ చర్యలు చేపట్టని బాధ్యతా రాహిత్యం ఇక్కడ కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నది.

మరి భారతదేశం వ్యవసాయ దేశం. రైతే దేశానికి వెన్నెముక అని చెప్పుకునే మాటలకు ఏమైనా పొంతన ఉన్నదా? అందుకే ఆత్మహత్యలను కేవలం వ్యక్తిగత సమస్యలని కాకుండా, సామాజిక సమస్యలుగా పరిగణించి పరిష్కార చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు సూచించవలసి వచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఓ విధంగ పాలకులకు చెంపపెట్టు.



ఇకపోతే పాలకుల ఆర్థిక గణాంకాలు అభివృద్ధి ప్రచారంలో ఉన్నంత మోజు సమస్యల పరిష్కా రంలో ఉండదన్నది మరో యదార్థం. 29 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థతో అమెరికా ప్రథమ స్థానంలో ఉంటే. నాలుగు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థతో మన భారత్ ఐదో స్థానంలో ఉన్నది. త్వరలో జపాన్, జర్మనీలను అధిగమించి మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతున్నట్టు పాలకులు భారీ స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. చైనా ద్వితీయ స్థానంలో ఉన్నది.

అమెరికా తలసరి ఆదాయం 85 వేల డాలర్లు అయితే చైనా తలసరి ఆదాయం 13వేల డాలర్లు, మరి మన తలసరి ఆదాయం మూడువేల డాలర్ల లోపే. 2400 డాలర్లు. అంటే సుమారు రెండు లక్షల రూ॥లు అన్నమాట.

జీడీపీ(జాతీయ స్థూల ఆదాయం)లో మనం జర్మనీని అధిగమిస్తే అధిగమించ వచ్చుగాక. మరి జీవన ప్రమాణాల్లో మనది జర్మనీలో 20వ వంతంటే ఎంత దిగువన...? అదీ సగటు విషయం. దిగువన ఉన్న పేదరికం వారిని గమనిస్తే మరెంత పాతాళంలోకి పడిపోతామో ఊహించుకోవచ్చు.

శ్రమజీవులు సంపద సృష్టిస్తూ, పెంచుతూ పోతూ ఉంటారు. కానీ అవి సంపన్నుల చెంతకు చేరుతూ గుట్టలు గుట్టలుగా పేరుకు పోతాయి. పెట్టుబడిదారీ దోపిడీ చట్రంలో సంపద సక్రమంగా పంపిణీ జరగదని ఆర్థిక అగాదం ఇలా పేరుకుపోతూనే ఉంటుందని మార్క్స్ చెప్పిన మాటలు మళ్లీ మళ్లీ రుజువు అవుతూనే ఉంటాయి.

దాదాపు 80 కోట్ల మందికి మన దేశంలో పాలకులు ఉచిత బియ్యం అందిస్తున్నారంటేనే మన పేదరికం స్థాయిని పాలకులు చెప్పకనే చెబుతున్నారు.

> ఆకలి ఎక్కువగా ఉన్న దేశాల్లోని (హంగర్ ఇండెక్స్) 125 దేశాలలో 111వ స్థానం మనది. ఒక శాతం అపర కుబేరుల వద్ద 40 శాతం పైగా దేశ సంపద పోగుబడి ఉంది. దిగువనున్న 50 శాతం జనాభా వద్ద కేవలం 15శాతం సంపద మాత్రమే ఉంది. మన దేశంలో 40 శాతం మంది బాలలు పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారు. దేశ భవితను జవసత్వాలతో నింపాల్సిన బాలభారతం విషాదస్థితి ఇది. ఆదాయ అసమానతలు గల దేశాల్లోని 146 దేశాల్లో మన దేశ స్థానం 123. మరి మన దేశం ప్రగతి పథంలో నడుస్తున్నదని గుండెమీద చేయి వేసుకుని ఎలా చెప్పగలం?

80 శాతం జనాభా ప్రభుత్వ రాయితీలపైనో సంక్షేమ పథకాలపైనో ఆధారపడి జీవించక తప్పడం లేదు. అంటే మనది ఎంత లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధో వేరే చెప్పక్కర్లేదు. ఆకలి ఎక్కువగా ఉన్న దేశాల్లోని (హంగర్ ఇండెక్స్) 125 దేశాలలో 111వ స్థానం మనది. ఒక శాతం అపర కుబేరుల వద్ద 40 శాతం పైగా దేశ సంపద పోగుబడి ఉంది. దిగువనున్న 50 శాతం జనాభా వద్ద కేవలం 15శాతం సంపద మాత్రమే ఉంది. మన దేశంలో 40 శాతం మంది బాలలు పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారు. దేశ భవితను జవసత్వాలతో నింపాల్సిన బాలభారతం విషాదస్థితి ఇది. ఆదాయ అసమానతలు గల దేశాల్లోని 146 దేశాల్లో మన దేశ స్థానం 123. మరి మన దేశం ప్రగతి పథంలో నడుస్తున్నదని గుండెమీద చేయి వేసుకుని ఎలా చెప్పగలం?

'కష్ట జీవుల రక్తం కలవారల భుక్తం, కమ్మిందీ సమాజాన్ని కారుమబ్బులా...' అని కవి నార్ల చిరంజీవి ఏనాడో చెప్పిన మాటలు ఈనాటికీ సత్య దూరం కాదు కదా!

విద్యుత్ సంస్థల్లో పదోన్నతుల్ని సమీక్షించాలి

- సీఎమ్డీతో విద్యుత్ ఉద్యోగుల కుల సంఘాలు భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ కులసంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారంనాడిక్కడి విద్యుత్‌సౌధలో ఆయా సంఘాల ప్రతినిధులతో టీజీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ రోనాల్డ్ రోస్, ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫరూఖీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల్లో రెండేండ్లుగా పదోన్నతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆయా సంఘాల నేతలు చెప్పారు. 2014 జూన్ రెండవతేదీ తర్వాత ఇచ్చిన అన్ని పదోన్నతుల్ని సమీక్షించాలని సూచించారు. నష్టపోయిన రిజర్వేషన్, సీనియారిటీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సాధారణ పరిపాలన శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పోలీస్ శాఖల్లో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గతంలోనే పదోన్నతులను సమీక్షించి, నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చారని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జోనల్ ద్వారా సెలెక్ట్ అయిన వారికి వర్తింపచేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల విభజనకు సంబంధించి సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు ఉన్నందువల్ల చేయలేదనీ, 2022 డిసెంబర్‌లో సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు మూసివేసినందున విద్యుత్ సంస్థల్లో వెంటనే పదోన్నతులను సమీక్షించాలని ఓసీ, బీసీ సంఘాల ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలనీ, విద్యుత్ సంస్థల్లోని సర్వీస్ రెగ్యులేషన్లు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, తెలంగాణ స్టేట్ అవార్డునెట్ సర్వీస్ రూల్స్ కూడా మెరిట్ ప్రాధిపతికనే సీనియార్టీని నిర్ధారించాలని సూచిస్తున్నాయని తెలిపారు. కొంతకాలంగా వివిధ క్యాడర్లలో సీనియార్టీలను నిర్ధారించని కారణంగా ఒక్క జూనియర్ లైన్‌మెన్ క్యాడర్‌లోనే దాదాపు 3,600 మందికి పదోన్నతులు రావాల్సి ఉందన్నారు.

కొన్ని అంశాలపై ప్రభుత్వం నుంచి వివరణ రావల్సి ఉందనీ, అవి రాగానే ఎవరికీ అన్యాయం జరక్కుండా పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఓసీ, బీసీ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ కోడెపాక కుమారస్వామి, కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో చైర్మెన్ ఆర్ సుధాకర్‌రెడ్డి కో కన్వీనర్ సీ భానుప్రకాష్, సంపత్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మెన్ డీ శ్యాం మనోహర్, పీ నారాయణ నాయక్, కన్వీనర్ మాతంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉభయ హైకోర్టుల ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ అధ్యక్షులుగా జస్టిస్ కె సురేందర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఏపీ ఉభయ హైకోర్టుల ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ అధ్యక్షులుగా జస్టిస్ కె సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా హరయ్య, కార్యదర్శి హెచ్ ప్రద్యుమ్న కుమార్, జాయింట్ సెక్రెటరీగా అరుణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి ఝాన్సీ లక్ష్మిబాయి, ఎ రజని, సిహెచ్ సరోజిని, సయ్యద్ రియాజ్, ఎండీ హమీద్, మునుస్వామి, వెంకటేశ్, సుదర్శన్ ఎన్నికయ్యారు. తెలంగాణ, ఏపీ ఉభయ హైకోర్టుల ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు.

రేపు లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

- ఆగస్టు 5 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం
- 22, 23 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు
- షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్‌లో లాసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కన్వీనర్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల ఐదు నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల ఏడు నుంచి పదో తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల (సీఏపీ, ఎన్‌సీసీ)కు భౌతికంగా హైదరాబాద్‌లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. వచ్చేనెల 21న అర్హులైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామనీ, ఏమైనా అభ్యంతరాలుంటే ఈమెయిల్ ద్వారా పంపించాలని సూచించారు. అదేనెల 22,23 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అదేనెల 27న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అదేనెల 28 నుంచి 30 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని కోరారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.://lawcetadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను బుధవారం నుంచి సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో లాసెట్‌కు 50,684 మంది దరఖాస్తు చేయగా, 40,268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 29,258 (72.66 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

బీమాతోనే కుటుంబానికి రక్షణ

- పిఎన్‌బి జోనల్ హెడ్ దీపక్ కుమార్
- రూ.95 లక్షల మెట్ సురక్ష బీమా చెక్కు అందజేత



హైదరాబాద్ : ప్రతికూల పరిస్థితుల్లో ఏ కుటుంబానికి అయినా బీమా రక్షణ భద్రత కల్పిస్తుందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవా అన్నారు. వారి పాలసీదారుడు రాజేష్ పండారే అకాల మరణం కారణంగా మెట్ సురక్ష బీమా కింద ఆయన కుటుంబానికి రూ.95,01,186 విలువ చేసే చెక్కును సర్కిల్ హెడ్ సుజిత్ కుమార్ ఝాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దీపక్ కుమార్ మాట్లాడుతూ.. తమ బ్యాంక్ వినియోగదారుల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. తాము ఎల్లప్పుడూ వినియోగదారులకు ఆర్థిక అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాజేష్ పండారే బీమా రక్షణ తీసుకోవడం ద్వారా ఆయన కుటుంబానికి ఆర్థిక బరోసాను కల్పించారని అన్నారు. భర్తను కోల్పోయి ఎంతో దుఖంలో ఉన్న ప్రియాంకకు తమ బ్యాంక్ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎన్‌బి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ సిన్హా పాల్గొన్నారు.

గ్రూమ్ ఇండియా కొత్త సిఇఒగా సంజయ్ ఎనిశెట్టి

హైదరాబాద్ : నేచురల్ సలోన్‌గా గుర్తింపు పొందిన గ్రూమ్ ఇండియా సలోన్ అండ్ స్పా, తమ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిఇఒగా సంజయ్ ఎనిశెట్టిని నియమించుకున్నట్లు వెల్లడించింది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వచ్చిందని ఆ సంస్థ పేర్కొంది. పెట్టుబడులు, స్టార్టప్ రంగంలో ఎనిశెట్టికి 18 సంవత్సరాలకు పైగా విస్తృతమైన పరిజ్ఞానం, అనుభవం ఉందని నేచురల్స్ సెలూన్స్ సహ వ్యవస్థాపకుడు, సిఎండి సి కె కుమారవేల్ పేర్కొన్నారు. ఎనిశెట్టి నాయకత్వంలో వృద్ధి, ఆవిష్కరణ, విజయాల కొత్త అధ్యాయం కోసం తాను ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు.

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల అమలులో కుట్ర

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ - బంజారాహిల్స్

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల అమలులో కుట్ర దాగి ఉందని పలువురు వక్తలు అన్నారు. ఉద్యమ ఆకాంక్ష వేదిక ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఉద్యమ నాయకులు విఠల్, గాదె ఇన్నయ్య అధ్యక్షతన జరిగిన 'కుట్ర-ఆధిపత్యం'పై రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు నేడు విభజన ఒప్పంద చట్టం అమలుపై సమీక్ష చేస్తున్నారని అన్నారు. ఇది దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉన్నదన్నారు. 10 సంవత్సరాల ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తరువాత తెలంగాణపై ఆధిపత్యం కోసం కొత్త నాటకానికి రంగస్థల వేదికగా విభజన చట్టాన్ని సాకుగా ఆంధ్ర దోపిడీదారులు వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. విభజన చట్టం హామీలు 10 సంవత్సరాలు ఎందుకు పూర్తి కాలేదు? దీనికి కారకులు ఎవరు? ఇప్పటి వరకు జరిగిన ప్రయత్నాల గురించి ఎవరూ చెప్పడం లేదన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన పాలకులు ఇప్పుడు తెలంగాణపై ఆధిపత్యం చలాయించడానికి, సంపదను దోచుకోవడానికి, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. 'తెలంగాణ తల్లిని అంగడి సరుకు చేసి అవమానపరచడాన్ని చూస్తూ ఊరుకుందామా? త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో మరోసారి బానిసలై ఉందామా? సకల సంపద కలిగిన తెలంగాణను సర్వనాశనం చేస్తుంటే మన బాధ్యతను నేమరువేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది' అన్నారు. ఆ కర్తవ్య నిర్వహణలో భాగమే ఈ సమావేశమని చెప్పారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- ఎస్టీయూటీఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండున్నరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ)లను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా, ఆర్నెల్లకోసారి ప్రభుత్వం చెల్లించే డీఏ రెండున్నరేండ్లుగా అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. పీఆర్సీ గడువు ముగిసి, ఈనెలతో ఏడాది కాలమైందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంబంధిత కమిటీ మాత్రం నివేదికను ప్రభుత్వానికి నేటికీ సమర్పించడం లేదని తెలిపారు. ప్రతినెలా మొదటి తారీఖున వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీల గురించి మంత్రిమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అన్నదాతలకు ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నో అవాంతరాలను అధిగమించి, బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసిన తరహాలో, ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీస్ నిబంధనలను రూపొందించి, ఖాళీగా ఉన్న ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. 317 జీవో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని సూచించారు.

త్వరలోనే రెండో విడత రుణమాఫీ

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెండో విడత పంట రుణమాఫీని సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రూ.లక్ష లోపు రుణాలకు మొదటి విడతగా 11.50 లక్షల కుటుంబాలకు రూ.6,098. 94 కోట్లు విడుదల చేశా మన్నారు. వీటిలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి అందిన సమాచారం మేరకు 11.32 లక్షల కుటుంబాలకు రూ.6,014 కోట్లు జమ అయ్యా యనీ, కొన్ని సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ. 84.94 కోట్లు రైతుల అకౌంట్లలో జమ కాలేదని వివరించారు.

ఆయా రైతుల ఖాతాల్లో పేర్కొన్న సాంకేతిక సమస్యలను సరిచేసి, ఆర్‌బీఐ నుంచి నిధులు వెనక్కి రాగానే తిరిగి ఆయా ఖాతా లకు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వాణిజ్య బ్యాంకులకు అనుసం ధాన మైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీ సంఘాలు) కు సంబంధించి మిగిలిన కొన్ని రుణ ఖాతాల (15,781) తనిఖీ సోమ వారంతో పూర్తవుతుందని ఆయన తెలిపారు. వెంటనే ఆయా ఖాతాలకు కూడా రుణ మాఫీ నిధులు విడుదల చేస్తామని తుమ్మల ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ ధిక్కారస్వరం దాశరథి : మాజీ సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ తన కవిత్వం ద్వారా తెలంగాణ గరిమను ప్రపంచానికి చాటి, తన సాహిత్యం ద్వారా 'తిమిరంతో సమరం' చేస్తూ నాటి రైతాంగంలో రాచరికానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞా శాలి, ధిక్కార స్వరం దాశరథి' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్య క్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొనియాడారు. దాశరథి కృష్ణ మాచా ర్యుల శతజయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకున్నారు. ఈ మేరకు సోమవారం కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఆత్మగౌ రవాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టే దాశరథి కవిత్వం, సాహిత్యం తెలంగాణ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధులు దాశరథి : కేటీఆర్

పద్యాన్ని ఆయుధంగా మలిచి పీడిత ప్రజలపక్షాన పోరాడిన యోధులు దాశరథి అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) కొనియాడారు. తన రచనలతో తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచి తెలంగాణ బిడ్డల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిన మహాకవి అని స్మరించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శతజయంతి ఉత్సవాల సందర్భంగా దాశరథికి నివాళి అర్పించారు.

మూసీకి పదివేల కోట్లు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నీటి కాల్వల నిర్మాణం, స్థాయి పెంపు, మూసీ సుందరీకరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద దక్కన్ పీఠభూమిలోని నదుల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్రం యోచిస్తున్నందున మూసీలో కలిసే మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గోదావరి జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతో నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని మంత్రి పాటిల్‌ను కోరారు. ఈ రెండు చెరువులను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు తీరడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

రూ.16,100 కోట్లు అవసరం

జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణకు నిధులు విడుదల చేయాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2019 లెక్కల ప్రకారం జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 77.60 శాతం ఇండ్లకు నల్లా నీరందుతోందని, ఇటీవల తాము చేపట్టిన సర్వేలో 7.85 లక్షల ఇండ్లకు నల్లా కనెక్షన్ లేదని తేలిందని వివరించారు. ఆ ఇండ్లతో పాటు పీఎంఏవై (అర్బన్), (రూరల్) కింద చేపట్టే ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు మొత్తంగా రూ.16,100 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మంత్రికి తెలిపారు. 2019లో జల్‌జీవన్ మిషన్ ప్రారంభించినా నేటి వరకు రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, ఈ ఏడాది నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కోరారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరాలో



తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి పూరీని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. తాము ముందుగానే సబ్సిడీ చెల్లిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని గ్యాస్ ఏజెన్సీలను గతంలోనే కోరినా సానుకూలత వ్యక్తం కాలేదన్నారు. ప్రస్తుతం వినియోగదారులు సిలెండర్‌కు పూర్తిగా డబ్బులు చెల్లించిన తర్వాత సబ్సిడీ అందుతుండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్యాస్ సిలిండర్లకు చెందిన సబ్సిడీని ముందుగానే ఓఎంసీలకు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. అలా వీలుకాని పక్షంలో వినియోగదారులకు తమ ప్రభుత్వం చెల్లించే సబ్సిడీని 48 గంటల్లోపు అందేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి



ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నుంచి రావల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని సీఎం సోమవారం కలిశారు. 2014-15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ. 1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని ఆయన కేంద్ర మంత్రికి తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని గుర్తు చేశారు. అందువల్ల బకాయిపడిన ఆ మొత్తాన్ని విడుదల చేయాలని సీఎం కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రి పూరీని సీఎం కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.

అధ్యక్షా...

- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- వాడీవేడిగా కొనసాగనున్న సభ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ విపక్షాస్త్రాలు
- దీటుగా బదులిచ్చేందుకు రేవంత్ సర్కార్ రె'ఢీ'
- తొలి రోజు ఎమ్మెల్యే లాస్య నందితకు సంతాపం, వాయిదాపడనున్న సభ అనంతరం బీఏసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐదు నెలల విరామానంతరం రాష్ట్ర శాసనసభ మంగళవారం కొలువుదీరనుంది. ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం... ప్రస్తుత సమావేశాల్లో పూర్తి స్థాయి పద్దును సభకు సమర్పించనుంది. కొద్ది నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు సంతాపం ప్రకటించిన అనంతరం తొలిరోజు సభ వాయిదా పడనుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సభ కార్యకలాపాలు కేవలం అరగంటపాటే కొనసాగే అవకాశాలున్నాయి. ఆ తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశమై సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించి, నిర్ణయం తీసుకోనుంది.

పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల ఆందోళనలు, ఇతరత్రా ప్రజా సమస్యల నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ వాడివేడిగా కొనసాగనుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆ పార్టీ గరంగరంగా ఉంది. ఇదే విషయమై ఇప్పటికే స్పీకర్‌కు ప్రధాన ప్రతిపక్షం ఫిర్యాదు చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పదేపదే డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై బీఆర్‌ఎస్ న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు గత సమావేశాల వరకూ బీజేపీకి శాసనసభాపక్ష నేతను ఎన్నుకోలేదు. ఇప్పుడు ఆ పార్టీ ఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వరరెడ్డిని నియమించింది. అందువల్ల బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు ధీటుగా బదులిచ్చేందుకు అధికార పక్షం సైతం రెడీ అయ్యింది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటం, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, పింఛన్లలో అక్రమాలు, లోపభూయిష్ట విధానాలు తదితరాంశాలపై ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టేందుకు వీలుగా సీఎం రేవంత్ అస్త్రశస్త్రాలు సిద్ధం చేశారు. ఇటీవల తొలి విడత రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో ఆ అంశాన్ని ఏకరువు పెడుతూ ప్రభుత్వం బీఆర్‌ఎస్, బీజేపీలపై ఎదురుదాడికి దిగనుంది.

రేపటి నుంచి మండలి

శాసనసభ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానుండగా, శాసన మండలి మాత్రం ఒకరోజు ఆలస్యంగా బుధవారం కొలువుదీరనుంది. ఇటీవల మండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఆ ప్రకారం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈసారి ఉభయ సభల సంయుక్త సమావేశం, గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండటం గమనార్హం.

'మూసీ' ప్రాజెక్టును ఆధునీకరించాలి

- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- ప్రాజెక్టు నుంచి పాదయాత్ర ప్రారంభం



నవతెలంగాణ- కేతెపల్లి

లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించి మూసీ ప్రాజెక్టును ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టును ఆధునీకరించాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను జూలకంటి ప్రారంభించారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ ..ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద ప్రాజెక్టుగా ఉన్న మూసీ.. నాలుగు టీఎంసీల నీటి సామర్థ్యంతో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరందిస్తోందన్నారు. కేతెపల్లి, సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ, నల్లగొండకు సాగు, తాగునీరు అందిస్తున్న మూసీ ప్రాజెక్టులో నేడు పూడిక పేరుకు పోయిందని చెప్పారు. కేవలం రెండు టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంటోందని, సగం పారుగుంతకే పరిమితమైందని అన్నారు. మూసీ పూడికను తొలగించి పూర్తిస్థాయిలో నీటి నిలువ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే మూసీకి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మూసీ కుడికాలువ పైభాగంలో ఉన్న గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపాడు, కొండకింది గూడెం, ఇనుపాముల, బండపాలెం గ్రామాలకు లిఫ్ట్ ద్వారా నీటిని అందించి చెరువులు, కుంటలు నింపాలన్నారు. మూసీ గురుకుల పాఠశాలను పీజీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మూసీ డ్యాం వద్ద అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ పాదయాత్ర మూసీ ప్రాజెక్టు నుంచి బొప్పారం, కాసనగోడు, మేడిపల్లి గూడెం, గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపాడు మీదుగా కేతెపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. అనంతరం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పాదయాత్ర బృందాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకన్న, చింతపల్లి లూర్దు మారయ్య, లకపాక రాజు, కుమ్మరి శంకర్, కోట లింగయ్య, సుంకర సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వసతులను వివరించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రభుతాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది నియామకం, డాక్టర్ల పోస్టుల ఖాళీల భర్తీ వంటి పూర్తి వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సర్కారీ దవాఖానాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యలపై హెల్ప్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అఖిల్ శ్రీగురుతేజ వేసిన పిల్‌ను సోమవారం చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. 'మంజూరు అయిన డాక్టర్ పోస్టులు 4,343 ఉంటే, అందులో 67 శాతం ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వాస్పత్రుల్లేవు. ఎనిమిది జిల్లాల్లోనే ఉన్నాయి. జిల్లా ఆస్పత్రుల్లో కూడా మౌలిక వసతులు పూర్తిగా లేవు.' అని పిల్ వేసిన న్యాయవాది వాదించారు. ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్, డీఎంఈ, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. కోఠి మెటర్నటీ ఆస్పత్రిలో పిల్లల వైద్యుల పోస్టులను నెల రోజుల్లోగా భర్తీ చేయాలని మరో కేసులో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సివిల్ సర్జన్, చిన్నపిల్లల డాక్టర్ పోస్టులను నెలలోగా భర్తీ చేయాలని కోరింది. ఆస్పత్రిల్లో మౌలిక వసతులను కల్పించే వ్యవహారంలో వివరాలతో కౌంటర్ వేయాలని సూచించింది. ఈ మేరకు బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

రేపు విచారణలో స్వయంగా చెప్పండి

హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించాలని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఏ మేరకు అమలు జరిగిందీ వివరించేందుకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుకావాలని హెచ్ఎండీఏ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. రామన్నకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అక్రమంగా కట్టడాలకు పాల్పడుతోం దంటూ హ్యూమన్ రైట్స్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెల్ ట్రస్ట్ వేసిన పిల్‌ను సీజే బెంచ్ సోమవారం విచారించింది. విచారణను ఈనెల 24కి వాయిదా వేసింది.

జంతు హింస నివారణ చర్యలు చెప్పండి

జంతువులపై హింస నిరోధానికి జంతు సంరక్షణ మండలి నాలుగేండ్ల క్రితం ఇచ్చిన మార్గదర్శకాలు ఏ మేరకు అమలు చేసిందీ వివరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. జంతు హింసకు పాల్పడే వాళ్లపై కేసులు పెట్టాలంటూ 2020 ఆగస్టు 14న కేంద్ర జంతు సంక్షేమ మండలి ఉత్తర్వులు అమలు జరిగేలా రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలని వేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారించారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేశారు.

లా కోర్సుల అడ్మిషన్లు ఆలస్యమెందుకు..

లా కోర్సుల అడ్మిషన్లు (2023-24 ఏడాదికి) తీవ్ర జాప్యంపై కారణాలు, అందుకు బాధ్యులైన వాళ్లను గుర్తించేందుకు హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాంను ఎమికస్‌క్యూరీగా నియమించింది. లా అడ్మిషన్లు తీవ్ర జాప్యంపై లాయర్ భాస్కర్‌రెడ్డి వేసిన పిల్‌ను సీజే బెంచ్ సోమవారం విచారించింది. లీగల్ ఎడ్యుకేషన్ రూల్స్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయని బార్ కౌన్సిల్ (ఇండియా) న్యాయవాది చెప్పారు. యూజీసీ పర్యవేక్షణ ఉండదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఈ వాదనలతో సంతృప్తి చెందని హైకోర్టు, శ్రీరముఠాంను సహకరించాలని కోరింది. విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

దాశరథి సార్మక కేంద్రం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొన్న ఉద్యమ కవి దాశరథి కృష్ణమాచార్య అని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఆనందాచారి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ప్రారంభ సభ తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ తెలంగాణ మట్టి చైతన్యాన్ని గొంతెత్తి నినదించిన మహాకవి దాశరథి అని తెలిపారు. జమిందార్లు, నిరంకుశ నైజాంను ధిక్కరించి నిర్బంధాలకు వెరువక ప్రజలను చైతన్య పరిచిన ప్రజాకవి దాశరథి అని చెప్పారు. ఈ శత జయంతి సందర్భంగానైనా రాష్ట్ర రాజధానిలో ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ, దాశరథి సార్మక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సభలో పాల్గొన్న నవతెలంగాణ సంపాదకులు ఆర్. సుధా భాస్కర్ మాట్లాడుతూ ప్రజాకవిగా ఉద్యమకాలంలో దాశరథి నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం తెలంగాణ సాహితి నాయకులు ఆర్.రమేష్, కె.శాంతారావులు మాట్లాడుతూ నేటితరం కవులు, రచయితలు దాశరథి అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ సభలో అజయ్, ఎలేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కనీస చెల్లింపులూ కష్టమే

అమరావతి :రాష్ట్ర ఆదాయం తగ్గడం వల్ల అత్యవసరమైన కనీస చెల్లింపులు చేయడం కూడా కష్టంగా మారిందని ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. 16వ ఏపీ అసెంబ్లీ రెండో సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ఆర్థికస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రస్తుతమున్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలి'. అని ఆయన రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పునర్‌నిర్మాణ ప్రక్రియ కూడా చాల్లా కష్టతరమైందని ఆయన చెప్పారు. అదే సమయంలో రాష్ట్రం ఆర్థికంగా కోలుకోవడానికి అత్యవసరమైన ప్రత్యేకహోదా అంశాని, విభజన హామీల అమలును తన ప్రసంగంలో గవర్నర్ ప్రస్తావించలేదు. దీర్ఘ కాలంగా రాష్ట్ర ప్రజానీకం ఆందోళన చేస్తున్న విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితుల పునరావాసం తదితర సమస్యలు కూడా గవర్నర్ ప్రసంగంలో చోటుచేసుకోలేదు. అంతకుముందు గవర్నర్‌కు అసెంబ్లీ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మండలి చైర్మెన్ కొయ్యే మోషేన్‌రాజు, స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ద్వారం నుండి అసెంబ్లీలోకి తీసుకెళ్లారు. అనంతరం ఉభయలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఈ సమయంలో వైసీపీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి తదితరులు లేని వుయ్‌వాంట్ జస్టిస్, రాక్షస రాజ్యం పోవాలంటూ అంటూ నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగ కాపీలను చించి విసిరేసి నినాదాలు చేసుకుంటూ బయటకు వెళ్లిపోయారు. నిరసనలు, అరుపులు, కేకల మధ్యనే గవర్నర్ ప్రసంగాన్ని కొనసాగించారు. సహజ వనరులు, మానవ విలువల వ్యవస్థను భారీగా కోల్పోవడానికి దారితీసిన ఐదేండ్ల పాలన తీవ్ర విధ్వంసం 'నిజంగా పునర్నిర్మాణ ప్రక్రియను కష్టతరం చేస్తోంది' అని గవర్నర్ అన్నారు. పూర్తి నష్టాన్ని అంచనా వేయడం, వనరుల సమీకరణ, అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించడం చాలా క్లిష్టమైన పనని తెలిపారు. గత ఐదేండ్లలో మొత్తం అప్పులు రెట్టింపుకంటే మించిపోయాయని వివరించారు. 2019-24 మధ్య పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలు భయాందోళనలకు గురయ్యారని, జీవించే స్వేచ్ఛనూ కోల్పోయారని, పాలన ప్రతీకార రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సును దెబ్బతీశాయని చెప్పారు. రాష్ట్రంలో రాజ్యాంగపరమైన విచ్ఛిన్నం జరిగిందా అనే అంశంపై విచారణ జరిపించాలని హైకోర్టు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపి బ్రాండ్ దెబ్బతిని చెప్పుకోదగ్గ కంపెనీలు పెట్టుబడులు పెట్టలేదని వివరించారు.

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలి : సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వర్షాలపై సీఎస్ సోమవారం సచివాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆమె వారికి సూచించారు. ముందుగానే, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలనీ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీజీపీ జితేందర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల పలు చెరువులు, కుంటలు నిండాయనీ, అవి తెగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎస్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర సహాయం కావాలన్నా, తమను ఏ సమయంలోనైనా సంప్రదించొచ్చని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, చెరువు కట్టలు తదితర ప్రాంతాల వద్ద జాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. పారే వాగులను ఎవరూ దాటకుండా ఆయా ప్రాంతాల్లో తగు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదనీ, పోలీస్ అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి, భారీ వర్షాలతో పాటు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కురిసే అవకాశముందని తెలిపారు. భద్రాచలం వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశామనీ, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నట్టు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాల్లో దెబ్బతిన్న నివాస గృహాలు, ఇతర నష్టాలపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో అనుకోని సంఘటలెదురైతే, ఎదుర్కోవడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. మండలాల వారీగా అధికారుల బృందాలను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నామని ములుగు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా ఒక సమాచార అధికారిని గుర్తించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో దాదాపు వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ములుగు జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతం ఉందనీ, 77 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ముందస్తు జాగ్రత్తలను చేపట్టామని వివరించారు. జిల్లాల వారీగా వరదలు, వర్షాల ప్రభావంపై సీఎస్, ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీ లతో ఈ సందర్భంగా సమీక్షించారు. క్షేత్రస్థాయి అధికారులంతా తమతమ ప్రాంతాల్లో అందుబాటులో ఉండి పరిస్థితికనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలనీ, వీలైనంత వేగంగా స్పందించాలని కోరారు. ఎవరైనా ఎలాంటి అలసత్వాన్ని దృష్టికొచ్చినా తగు చర్యలుంటాయని హెచ్చరించారు.


25న గ్రూప్-1 స్పోర్ట్స్‌కోటా అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒరిజినల్ ఫారం-1 ధ్రువపత్రంతోపాటు స్పోర్ట్స్‌కు సంబంధించి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని సూచించారు. ఈనెల 27న రిజర్వ్ డేగా ఉంటుందని తెలిపారు. ఈనెల 25న సంబంధించి ధ్రువపత్రాలను తెచ్చుకోని అభ్యర్థులు 27న రిజర్వ్‌డేలో తప్పనిసరిగా పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. ఆ తర్వాత స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఉండబోదని స్పష్టం చేశారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలోనే నిర్వహిస్తున్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను ఈనెల తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

జూరాల 37 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- ఇన్‌ఫ్లో 1,69,000 క్యూసెక్కులు



నవతెలంగాణ- ధరూరు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టు లోకి ఆల్మట్టి, నారాయ ణపూర్ డ్యాముల నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో.. ప్రాజెక్టు 37 గేట్లు ఎత్తేశారు. జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి లక్ష 69వేల క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 37 గేట్ల ద్వారా లక్ష 45 వేల 410 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి వదులు తున్నారు. విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్ల నుంచి 29వేల 307 క్యూ సెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం 318.516 అడు గులకు.. ప్రస్తుతం 317.500 అడుగుల వద్ద ఉన్నది. 7.645 టీఎంసీల వాటర్ నిల్వ ఉంచి.. దిగువ ప్రాంతానికి నెట్టెంపాడుకు 1500 క్యూసెక్కులు, బీమా-1కు 1300 క్యూసెక్కులు వదులుతున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఆరోగ్యశ్రీ చికిత్స ధరలు సవరణ

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యశ్రీ చికిత్సల ధరలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 1,375 చికిత్సలకు సంబంధించిన ధరలను సవరించినట్టు తెలిపారు. మిగిలిన 297 చికిత్సలకు సంబంధించిన ధరల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలోకి కొత్తగా 163 చికిత్సలను చేరుస్తూ మరో జీవోను జారీ చేశారు. ఆయా చికిత్సలకు నిర్ణయించిన ధరలను సవరించాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లోని ఆస్పత్రులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల సేవలను నిలిపివేస్తామని ఆ ఆస్పత్రుల యాజమాన్యాలు హెచ్చరించారు. అయితే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన హామీతో సేవలను తిరిగి కొనసాగించాయి. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రిని కలిసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల యాజమాన్య ప్రతినిధులకు మంత్రిని కలిసి హర్షం వ్యక్తం చేశారు.

రేపు కేటీఆర్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు జన్మదినం సందర్భంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 24న ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటాలనీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లను పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
మంగళవారం | జులై 23, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



• ఎమ్మార్వో రవీందర్ గుప్త

నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట్

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో రవీందర్ గుప్తా హెచ్చరించారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని విజయవాడ రహదారి వెంట ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 244/36లో కొంత ప్రభుత్వ భూమిని అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపార నిమిత్తం ఆక్రమించి కంటైనర్ డబ్బాల తయారీ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు పలుమార్లు హెచ్చరించినా, నోటీసులు ఇచ్చిన పట్టించుకోనట్టు వారు వ్యవహరించారు. దీంతో సోమవారం జేసీబీ యంత్రాలతో వాటిని తొలగించారు. ఇలాంటి ఆక్రమణలు ఎవరు చేసినా సహించేది లేదని ఎమ్మార్వో హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



• పెద్ద అంబర్పేట్ మున్సిపల్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట్

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ అధికారి ఎస్.ఈ.పి కరుణాకర్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని స్మశానవాటిక వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు పాతబడి శిథిలావస్థకు చేరాయని, వాటిని తీసి కొత్త వాటిని పునరుద్ధరిం చాలని కోరారు. వార్డులకు కావలసిన నూతన ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ సమస్యల గురించి చర్చించి వినతి పత్రం అందజేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి, దండెం కష్ణా రెడ్డి ,సిద్దెంకి కష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు నిలయం..పెద్ద అంబర్‌పేట

• ఇంటి నిర్మాణం కోసం అనుమతి..
కట్టింది కమర్షియల్ షెటర్లు
• రాజకీయ నేతల అండ..
అధికారుల ఉదాసీనత





నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

పెద్ద అంబర్ పేట అంటే...అనుమతుల్లేకుండా అక్రమ నిర్మాణాలకు నిలయంగా మారింది. ఇబ్బడి ముబ్బడిగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరుగ్తుతున్నా మున్సిపల్ అధికారులకు చీమ కుట్టినట్టైనా ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ నేతల అండదండలు... అధికారుల ఉదాసీనత వల్ల అక్రమ నిర్మాణాల తంతు జోరుగా సాగ్తుతోందని ప్రచారం జరుగుతోంది. స్థానికులు పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోవట్లేదని.. ప్రజా ప్రతినిధులకు భయపడి వాళ్ల కను సైగ్నల మేరకు తానా అంటే తందానా అన్నట్లుగా తలూపుతున్నారని పలువురు అంటున్నారు.

ఎక్కడో గల్లీలో చిన్నపాటి నిర్మాణం చేస్తే చాలు వెంటనే వాలిపోయి నోటీసివ్వడం... వెనువెంటనే కూల్చేసే అధికారులకు ప్రధాన రోడ్డు వెంట జరుగ్తుతున్న అక్రమ నిర్మాణాల గ్గురించి మాత్రం పట్టకపోవడంలో ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు తామేమీ చేయలేకపోతున్నామని అధికారులు చేతులెత్తేసేలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతి తీసుకుంది ఇంటి నిర్మాణం కోసం... నిర్మాణం చేసింది మాత్రం కమర్షియల్ షటర్లు అని.. కళ్లెదుట కనిపిస్తున్నా కనీసం నోటీసు కూడా ఎందుకు జారీ చేయడంలేదని వస్తున్న ప్రశ్నల నేపథ్యంలో ప్రత్యేక కథనం.

తట్టి అన్నారం అంబేద్కర్ చౌరస్తా పరిధిలో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగ్నుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల అండతో నిర్మాణాలు చేస్తుండడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడట్లేదని విమర్శలు ఉన్నాయి. అలాగే పసుమాముల గ్రామ పరిధిలో ఒక సెల్లార్, రేకులతో మడిగలు నిర్మించారు. రాజీవ్ గృహకల్ప పరిధిలో మొదలయ్యే రెండో వార్డులో ఓ వ్యక్తి తనకున్న స్థలంలో ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ టీపీఎస్ నుంచి అనుమతి పొందారు. ఇంటి నిర్మాణం పేరిట సదరు వ్యక్తి ఏకంగా ఐదు మడిగ్నలకు సంబంధించి షటర్లు వేసి నిర్మాణం చేశారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతులు పొందిన వ్యక్తి కమర్షియల్ షటర్లు వేసి భారీ నిర్మాణం ఎలా చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేకుండా అక్రమంగా కమర్షియల్ నిర్మాణం చేపట్టిన వ్యక్తికి స్థానిక ప్రజా ప్రతినిధి అండదండలు ఉన్నందున్నే అధికారులు అట్టి నిర్మాణం గ్నురించి పట్టించుకోవడంలేదనే చర్చ నడుస్తున్నది. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఎంత స్థలం విస్తీర్ణంలో ఎన్ని చదరపు గ్నజాల్లో ఏ లే అవుట్ ప్రకారం నిర్మాణం చేస్తున్నామనే పత్రాలతో అనుమతి పొందాలి. అలా అనుమతి పొందిన ప్రకారం మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే సదరు వ్యక్తి మాత్రం ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకుని ఏకంగా కమర్షియల్ మడిగ్నల కోసం నిర్మాణం చేపట్టారు. అలాంటి నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతులివ్వలేదు. అయినా నిర్మాణం పూర్తయ్యింది.

అక్రమ నిర్మాణాలు పట్టని అధికారులు

విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగ్నుతున్నా మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారికి పట్టట్లేదనే విమర్శ ఉంది. సదరు అధికారికి ఏదైనా సమస్య గ్నురించి ఫిర్యాదు చేయాలన్నా మోర విన్నవించాలన్నా కార్యాలయానికి ప్రజలు వెళ్లితే ఎప్పుడూ అందుబాటులో ఉండరని తెలుస్తున్నది. అక్రమ నిర్మాణాలను గమనించిన స్థానికులు ఫిర్యాదు చేయాలన్నా అధికారి దొరికే పరిస్థితిలేదంటున్నారు కొందరు. ఒక వేళ పిర్యాదు చేసినా ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి లొంగి ముడుపులు తీసుకోవడం తప్ప అక్రమ నిర్మాణాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకున్నది లేదనే చర్చ ఉంది. ఇప్పటికే పెద్ద అంబర్ పేట ప్రాంతంలో అడ్డగోలుగా జరుగ్నుతున్న అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోకపోతే అక్రమ నిర్మాణాల గ్నురించి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి పిర్యాదు చేస్తామని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు



పెద్ద అంబర్పేట మున్సిపాలిటీలో ఎన్నో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా మున్సిపాలిటీ కమిషనర్ పట్టించుకోవడం లేదు. ఇలాంటి ఒక షెడ్డు విషయంలోనే కోర్టు నోటీసులు సీడీఎంఎస్ ఆఫీసుల నుండి కూల్చివేయాలి అని ఆర్డర్ ఉన్నా కూల్చి కూల్చివేయలేకపోతున్నారు. అసమర్ధత అధికారులు ఉన్నారు కాబట్టి ఇలాంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. గత పది రోజుల నుంచి మున్సిపాలిటీ కమిషనర్ సంబంధిత అధికారులు కనబడుటలేరు.

-సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ

రాక్ టౌన్ కాలనీలో కుక్కల బెడదను అరికట్టాలి

• కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈ.వినోద్ రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీలో రోజురోజుకు పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదను అరికట్టాలని రాక్ టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈ. వినోద్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాలనీలో పెరిగిపోతున్న వీధి కుక్కల వల్ల వేకువ జామున నడకకు వెళ్లే నడకదారులు, స్కూళ్లకు వెళ్లే స్కూలు పిల్లలు, కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కుక్కలు విచ్చలవిడిగా కాలనీలో సంచరిస్తూ నడిచి వెళ్లే వారిపై మొరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. వీధి కుక్కలను అరికట్టి కాలనీ వాసుల ప్రాణాలను కాపాడాలని ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా లాభం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లో పలుచోట్ల కుక్కల దాడులతో ప్రాణాలు కోల్పోయిన వారు కొందరైతే తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలైన వారు కొందరున్నారన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు ,సంబంధిత అధికారులు స్పందించి రాక్ టౌన్‌లో రోజుకు రోజుకు పెరిగిపోయి కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కల బెడదను అరికట్టి కాలనీ ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం



నవతెలంగాణ-సంతోష్ నగర్

యువత బంగారం భవిష్యత్తు, సమాజాభివద్ధి విద్యతోనే సాధ్యమని ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, డైరెక్టర్ సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ డాక్టర్ ఎన్‌సీ పార్థసారథి అన్నారు. సోమవారం హైదరాబాద్ జిల్లా యకుత్ నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని విజయ నగర్ కమ్యూనిటీ హాల్ సంతోష్ నగర్ సక్సెస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హారిజన్ డే వేడుకలు, ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, డాక్టర్ ఎన్. శ్రవణ్ కుమార్, డాక్టర్ జగన్ మోహన్ రావు, చైర్మెన్ డాక్టర్ ఎన్‌సీ పార్థసారథి, చైర్ పర్సన్ నిర్మల, కలిసి సక్సెస్ సిబ్బందికి మెమొంటో అందజేస్తూ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ సమాజం దేశ పురోగతి ఉజ్వల భవిష్యత్తు, అభివద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నేటి సమాజం అభివద్ధిలో విద్యార్థినుల పాత్ర ప్రత్యేకమని, ప్రతిభ నైపుణ్యం ఆత్మస్థైర్యాన్ని పెంపుదించుకోవాలన్నారు. చరిత్ర సంస్కృతి సాంప్రదాయాలను అనుసరించడం ద్వారా మరింత అభివద్ధి సాధించగలుగుతుందన్నారు. కళాశాల ప్రాంగణ నియామకాలల్లో ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు తెలిపారు. ఆవిష్కరణ దిశగా బోధన పద్ధతులు ప్రవేశపెట్టడం ప్రశంసనీయమన్నారు. కాలనుగుణంగా సవాళ్లను ఎదుర్కొంటూ మరింత ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

సామ రంగారెడ్డి నిరసనకు చింతల సురేంద్రనాథ్ సంఘీభావం



నవతెలంగాణ- నాగోల్

సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలోని బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కాశం వెంకటేశ్వర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. గొల్ల కురుమలకు 100 రోజుల్లోనే గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారులను అకౌంట్లో వేస్తామని మోసం చేశారని చెప్పారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి వారం రోజుల్లో చర్యలు ప్రారంభించక పోతే లక్ష మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో గడ్డి అన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి,ఓబీసీ నాయకులు సంజయ్, సిద్ధాలా ఐలయ్య,రాధిక,రావుల శ్రీనివాస్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, శివకుమార్,మల్లేష్, మనోజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



• మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా చేపడుతున్న అభివద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పోరేషన్‌లోని 31వ డివిజన్ శ్రీవిద్యా టౌన్ షిప్ ఫేస్ 3 కాలనీలో సీసీ రోడ్డు, డ్రయినేజీ పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు.ముఖ్యంగా మహిళలను ఆర్థికాభివద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు, వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి,కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏఈఈ బిక్కు నాయక్, కాలనీ కమిటీ సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సమరసింహ రెడ్డి, టివి థామస్, అశోక్ రెడ్డి, వెంకట్ రావు, గోపాల్ నాయక్, సోమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అభిషేకం



నవ తెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ దుర్గాభవాని నగర్ కాలనీ పరిధిలోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆలయ చైర్మెన్ రంగారెడ్డి, ట్రెజరర్ యాదగిరిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ రత్నమాచారి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డి. శంకర్, అనిల్, జంగారెడ్డి, కిష్టయ్య వెంకట కష్ణారావు, పున్న రాజయ్య, తేజ, ప్రధాన అర్చకులు అజయ్ వర్ధన్ చారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూభక్తులందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి సామాజిక సేవ చేయాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు



• మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

విద్యతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు వస్తుందని, అందుకోసం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి విద్యాభివద్ధికి ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందని బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట మున్సిపల్ కార్పోరేషన్ మల్లాపూర్, బాలాపూర్ బడంగ్ పేట్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల వాటి నిర్వహణను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20లక్షలతో బడంగ్ పేట్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో మొత్తం 17 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ. 25 లక్షలతో కౌన్సిల్ తీర్మానం చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్ పిలిచి మరుగు దొడ్ల నిర్వహణ చేపట్టి శుభ్రత పాటించేలా చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాభివద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం అర్జున్, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నేనావత్ బాలు నాయక్, ఎర్ర జైహింద్, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి,మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో ఎమ్మెల్యే సమావేశం

నవతెలంగాణ-మలక్ పేట్

రానున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మలక్ పేట్ ఎమ్మెల్యే బలాల సోమవారం సమావేశమయ్యారు. నియోజక వర్గంలో చేపట్టవలసిన అభివద్ధి పనుల గురించి మంత్రి దష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ప్రజల సమస్యలు పరిష్కరించటానికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

దావత్ - ఇ - ఇష్క్ రెస్టారెంట్ ప్రారంభం



నవతెలంగాణ వనస్థలిపురం

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాం నగర్‌లో నూతనంగా దావత్ - ఇ - ఇష్క్ రెస్టారెంట్‌ను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రెస్టారెంట్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెస్టారెంట్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులను రెస్టారెంట్ యజమాని మంగేష్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం సెక్రటరీ సురేష్ కుమార్, నాయకులు కౌశిక్, సాయి తదితరులు పాల్గొన్నారు.



బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో బోనాల ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షులు విజేందర్(బిట్టు), శ్రీనివాస్ చారి, పవన్, వంశీకష్ణ, నాగరాజ్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. - నవతెలంగాణ-బడంగ్‌పేట్

రోడ్డును తవ్వడంతో వాహనదారుల ఇబ్బందులు



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ రెడ్ ట్యాంక్ వద్ద నుంచి సరిగమపదనిస చౌరస్తా వరకు రోడ్డు జంక్షన్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం పనులలో రోడ్డును తోవ్వారు దీనివలన ఇరువైపుల వాణిజ్య సముదాయలు, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే డ్రయినేజీ పైపు లైన్లు పగిలి ఆ దుర్వాసనకు చిన్న చిన్న వ్యాపారస్తులు రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారస్తులు చాలా అవస్థలు పడుతున్నారు. వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. ఈ విషయాన్ని చిరు వ్యాపారస్తులు, కాలనీవాసులు వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి దష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత తొందరగా రోడ్డు ఇంప్రూవ్మెంట్ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలని డిమాండ్



నవతెలంగాణ-సంతోష్ నగర్

జీహెచ్ఎంసీ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు హైదరాబాద్ సౌత్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఫూల్‌బాగ్ బాబానగర్ ఆఫీస్ ముందు సీఐటీయు హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, మీనా, ఎస్.కిషన్, సత్తార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కార్మికులకు నష్టం వాటిలేవిధంగా కొత్త రూల్స్ తీసుకొని వస్తున్నదన్నారు. దీనివల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, సంవత్సరాల తరబడి పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారాంతపు సెలవులు, వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలని, రాంకి లాంటి ప్రయివేట్ సంస్థకు ఇవ్వద్దు అని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రమాదం లో మరణించిన కార్మికులకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.పర్మినెంట్ కార్మికులకు లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు మూడు ధపలుగా హాజరు పద్ధతిని తొలగించాలని డిమాండ్ చేశారు. వేతనాలలో కోతలు పెట్టె పద్ధతిని వెంటనే మానుకోవాలన్నారు. లేనిపక్షాన కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేస్తామ ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీ.యాదమ్మ, స్వాతి,మంగ, వెంకటయ్య, ఇంద్రమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై నీరు.. పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



నవతెలంగాణ-హాయత్ నగర్

నగరంలో గత రెండు, మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల హయత్ నగర్ డివిజన్ లోని సిద్ధి వినాయక కాలనీలో రోడ్లపై నీరు నిలిచి కాలనీ వాసులకు వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు సమాచారం అందుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీని సందర్శించి వెంటనే రోడ్లపై నిలిచి ఉన్న వర్షపు నీటిని లోతట్టు ప్రాంతాలకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఏఈ చంద్ర శేఖర్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం వల్ల, చాలా కాలనీల్లో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో వర్షాలు పడినప్పుడల్లా రోడ్లన్నీ బురదగా మారి డివిజన్ వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా హయత్ నగర్ డివిజన్ పై ప్రత్యేకమైన దష్టి సారించి దశల వారీగా ప్రతి కాలనీలోనూ సీసీ రోడ్ల సదుపాయం ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వర్షాల వల్ల డివిజన్ వాసులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు.

తాగుడుకు బానిసై ఆత్మహత్య

నవతెలంగాణ-బోడుప్పల్

తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఊరేసుకోని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాచవాణి సింగారాం గ్రామానికి చెందిన సాంబోజు శ్రీకాంత్(37) కారు డ్రైవర్. కాగా ఆదివారం రాత్రి తాగేందుకు తన తల్లిని రూ.100 అడగ్గా తన వద్ద లేవని సమాధానం చెప్పడంతో కోపంతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఊరేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు

నవతెలంగాణ-ఘట్కేసర్

దేవాలయ భూములను క్రయవిక్రయాలు జరపరాదని వెంకటాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈజీఎల్ భాగ్యలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఘట్కేసర్ పట్టణంలో గల వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూముల్లో నిర్మాణాలను చేపట్టవద్దని హెచ్చరించారు. నిర్మాణాలను నిలుపుదల చేయించకుండా కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. డబ్బు వసూళ్లపై సదరు దేవస్థానానికి, తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ప్రజావాణితో అనేక సమస్యలకు పరిష్కారం : మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి 'ప్రజావాణి'తో అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ రామలింగంతో కలిసి స్వీకరించారు. నగరంలోని ప్రధాన మార్గాలకు మరమ్మతులు చేపట్టాలని, బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు కాపాడాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి అవసరమైన చర్యలు ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

వినాయక నగర్‌లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటన



నవతెలంగాణ-మల్కాజిగిరి

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లైన్ నెంబర్ 30లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన రోడ్డు, కమ్యూనిటీహాల్ రిపేర్, రాత్రి సమయంలో గంజాయి బాబుల అల్లరి, స్ట్రీట్ లైట్స్, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్‌కు వివరించారు. అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట సాయి సురేష్, శ్రీకాంత్ యాదవ్, గోపాల్, శివ, మహేష్, కాలనీ వాసులు సాయి కిరణ్, ఉమేష్, నరసమ్మ బాలమణి, జంజీర్ తదితరున్నారు.

డ్రయినేజీ పనులను పరిశీలించిన పన్నాల



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీ, నాగలక్ష్మి నగర్ కాలనీ, మల్లాపూర్ ఐడీఏ ప్రధాన రోడ్డులో నిర్మిస్తున్న భూగర్భ డ్రయినేజీ పనులను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ డ్రయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రూ.42 లక్షలతో పనులను చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ మేనేజర్ వేణుగోపాల్, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, దయాకర్ రెడ్డి, సురేష్ గౌడ్, రఘు తదితరులున్నారు.

ఆస్పత్రిలో టాయిలెట్స్ శుభ్రత శూన్యం



- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న రోగులు

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ (జమ్మిగడ్డ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టాయిలెట్స్ శుభ్రంగా లేక దుర్వాసన వస్తుండటంతో ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్స్‌లో శుభ్రత, నిర్వహణ సరిగా లేకపోవడంతో అందులోకి వెళ్తే మలమూత్రాలతో దుర్వాసన వస్తుందని, వాంతులు వస్తున్నాయని, తల తిరుగుతుందని రోగులు చెబుతున్నారు. టాయిలెట్స్ సమస్యను ఆస్పత్రి సిబ్బందిని అడిగితే నిర్వహణ బాధ్యత జీహెచ్ఎంసీ పరిధిలో ఉందని, వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కాప్రా మున్సిపాలిటీ అధికారులు టాయిలెట్స్‌ను శుభ్రపరిచి దుర్గంధం, దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

రూ. 3 కోట్లతో శ్మశానవాటిక పనులు



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లో రూ.3 కోట్లతో చేపట్టిన హిందూ శ్మశాన వాటిక పనులను కార్పొరేటర్ గీత, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీత మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్, కాంట్రాక్టర్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, మాస శేఖర్, చేర్యాల శ్రీనివాస్, నరసింహ, బొల్లం లక్ష్మణ్, శ్యామ్, బాలు, తదితరులున్నారు.

4న ఉప్పల్ హిల్స్, కురుమ నగర్‌లో బోనాలు



నవతెలంగాణ-ఉప్పల్

ఆషాడమాసం అమ్మవారి బోనాలను ఉప్పల్ హిల్స్, లక్ష్మీ నగర్, కురుమ నగర్‌లో ఆగస్టు 4వ తేదీ ఆదివారం నిర్వహించనున్నారు. సోమవారం ఆయా కాలనీ అధ్యక్షులు, కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు తీర్మానం చేసినట్టు కాలనీ సంఘాల నాయకులు బాజే అబ్బయ్య, మంగ సుధాకర్, నోముల మైసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీ ప్రజలు, బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోలగాని శ్రీనివాస్, బీఆర్ రాజ్ కుమార్, బెల్లంకొండ నరసింహ, కంచర్ల కొమురయ్య, సజ్జన సోమయ్య, శ్రీనివాస్ రెడ్డి, ముత్యం గిరి శివ, అక్కు రవి, దేవరకొండ హరికృష్ణచారి, ఎన్.నరసింహ, ఎం.రాములు గుర్రం రమేష్, బాబురావు, ఊశయ్య, నాగరాజు, రమేష్, రవి, చంద్రం ఉన్నారు.

'గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి'



నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలోని గృహ కార్మికులకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ తెకనేత్ అన్నారు. గృహ కార్మికుల హక్కులు, హింస, వివక్షత నుంచి కాపాడేందుకు చట్టం అవసరమన్నారు. అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్‌లోని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ (ఎంఎస్ఐ)లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాకు చెందిన గృహ కార్మికులు సమావేశమయ్యారు. గృహ కార్మికుల యూనియన్ ట్రేడ్ యూనియన్‌గా రిజిస్టర్ అయిన సందర్భంగా ఐదు డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ తెకనేత్ మాట్లాడుతూ.. చాలా మంది గృహ కార్మికులు కనీస వేతనం కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారని, సెలవు లేకుండా పని చేస్తారని, యజమానుల నుంచి దూషణలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గృహ కార్మికుల కోసం చట్టం చేస్తే దేశంలోనే గృహ కార్మికుల కోసం చట్టం చేసిన రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కో ఆర్డనేటర్ సిస్టర్ లూర్దు మేరి మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం కన్వెన్షన్ 189 గురించి నిర్ణయం తీసుకోవాలన్నారు. సిస్టర్ నిర్మల మాట్లాడుతూ.. గృహ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు, సెక్రటరీ శోభ మాట్లాడుతూ.. గృహ కార్మికులు సాధించిన విజయాలు మహిళా ఉద్యమానికి, కార్మిక ప్రపంచానికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, మాధురి, ఇండియా లేబర్ లైన్ స్వర్ణ, పవన్, గృహ కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ చెప్పిండు..అటువైపు వెళ్లొద్దు

- అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల సమాధానం
- బోడుప్పల్ కార్పొరేషన్‌లో అడ్డు, అదుపు లేకుండా అనుమతి లేని నిర్మాణాలు





నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అనుమతి లేని నిర్మాణాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరా అని నగర ప్రణాళిక విభాగం అధికారులను అడిగితే ఫలాన నిర్మాణం వద్దకు వెళ్లితే ఫలాన కార్పొరేటర్ వెళ్లొద్దని చెప్పిండూ ఇక చర్యలు ఎలా తీసుకోవాలో మీరే చెప్పండి అంటూ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది నుంచి వస్తున్న సమాధానం.

ఆదాయం లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యం

కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే నిధులు కావాలి, నిధుల కావాలంటే కీలకమైంది టౌన్ ప్లానింగ్ విభాగమే. నిర్మాణాల అనుమతుల ద్వారా వచ్చే ఆదాయమే కార్పొరేషన్‌లో అధిక భాగం. అలాంటి కీలక విభాగంలో పర్యవేక్షణ లోపముంటే ఆదాయం ఎలా సమకూరుతుంది. ఎవరికి వారే ఇలా పైరవీలు చేసుకుంటూ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటే కార్పొరేషన్ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రజల నుంచి వస్తున్న ప్రశ్న.

అధికారుల పర్యవేక్షణ కరువై..

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లలో జరుగుతున్న అనుమతులు లేని నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లోపించడమే. ఈ అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా పెరగడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడమం కూడా మరో కారణంగా చెప్పాలి. దానికి తోడు స్థానిక నాయకుల జోక్యం ఎక్కువ ఉండడంతో అనుమతులు లేని నిర్మాణాలకు అంతు లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

నూతన మేయర్ ప్రభావం ఉంటుందా?

బోడుప్పల్ కార్పొరేషన్‌కు ఈ నెల 15 వ తేదిన నూతన మేయర్, డిప్యూటీ మేయర్లు ఎన్నికయ్యారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న వాళ్లు మెజారిటీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు నూతన మేయర్ ఎన్నికయ్యారు. మరి ఇప్పుడైన కార్పొరేషన్ ఆదాయానికి గండి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారా? లేదా గతంలో జరిగిన విధంగానే వదిలేస్తారా అనేది వేచి చూడాలి.

పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం : రామలింగం, బోడుప్పల్ కమిషనర్

కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఖచ్చితంగా చర్యలుంటాయి. ఇప్పటికే అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించడం జరిగింది. త్వరలోనే నోటీసులు అందించేసి చర్యలు తీసుకుంటాం. అదే విధంగా ప్రజలు ఎవరైనా నూతనంగా నిర్మాణాలు చేపట్టాలనుకుంటే టీఎస్ బీ పాస్ ప్రకారం నిర్మాణపు అనుమతులు తీసుకోవాలి.

హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సమస్యలపై కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. హెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న హెచ్‌బీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని డిస్మాండిల్ చేసి నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్లు, ఫేజ్ వన్ రాజీవ్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, బండబావి స్థలంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. పూర్తి వివరాలు తెలుసుకున్న జోనల్ కమిషనర్ త్వరలోనే అభివృద్ధి పనులపై కార్యచరణ చేపడుతామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, వార్డు ఆఫీసర్ షహనావాజ్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు మధు ముదిరాజ్, వెంకటాచారి, ప్రతాప్ రెడ్డి, ఉల్లెం బాలరాజు, నరసింహ గౌడ్, కృష్ణ, వాసు చారి, అంజి, చారి, శేఖర్ గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-బోడుప్పల్

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ కార్పొరేషన్ బుద్ధనగర్‌కు చెందిన ఎస్.అజయ్ కుమార్ (26) కాచవాని సింగారం నుండి ఇంటికి వెళ్తుండగా నిహెహాక్ పాఠశాల మలుపు వద్ద తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వాహనం వెనుక ఉన్న మరో వ్యక్తి నిఖిలేష్ కు చిన్నపాటి గాయాలయ్యాయి.

యువకుడి ఆత్మహత్య

- మేడిపల్లి పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-బోడుప్పల్

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఫ్యాన్‌కు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ గాయత్రి హిల్స్‌లో నివాసం ఉంటున్న బన్నాల ప్రశాంత్ (27) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి వేర్వేరు గదుల్లో నిద్రించారు. తెల్లవారుజామున భార్య లేచి చూడగా గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ' షురూ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ విద్యా విధానం ప్రారంభించి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ' కార్యక్రమం నిర్వహించాల ని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 22-30వ తేదీ వరకు ఏడు రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు తెలిపారు. తొలి సోమవారం ఉపాధ్యాయులు స్థానిక అవసరాల కు అనుగుణంగా అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్ఎం రూపొందించి ప్రదర్శించినట్టు తెలిపారు. 23న నిపుణ్ భారత్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు నిర్వహించాలనీ, 24న క్రీడా, వయోజన వ్యవహారాల శాఖ, ఎన్ఎస్ఎస్‌తో సమన్వయం చేసుకుని ఆటల పోటీలు, 25న విద్యార్థుల్లో ఐకమత్యం, భిన్నత్వం, అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 26న ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థు ల్లో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను, డిజిటలీకరణపై అవగాహన, 27న పర్యావరణం, ఆరోగ్యం, జీవన విధానం, విటమిన్‌లతో కూడిన సమతుల ఆహారం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలో మొక్కలు నాటి నూతనంగా ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలనీ, చివరి రోజు 30వ తేదీన పాఠశాలల అభివృద్ధిలో సమాజం భాగస్వా మ్యం పెంపొందించేలా, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో, ఎంఎన్‌వో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. వారం పాటు జరిగే ఈ కార్యక్రమాలను టీచర్లు తప్పనిసరిగా డాక్యుమెం టేషన్ చేసి భద్రపర్చాలని డీఈవో సూచించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ మల్కాజిగిరి

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక ఎమ్మార్వో, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 70 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రేమ్ కుమార్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మీనా ఉపేందర్ రెడ్డి, రాజ్యలక్ష్మి, సునీత యాదవ్ తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- విద్యుత్, డ్రయినేజీ, రోడ్ల సమస్యలు తీర్చాలి
- ప్రజావాణిలో తుంగతుర్తి రవి విజ్ఞప్తి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో నెలకొన్న డ్రయినేజీ, రోడ్లు, విద్యుత్, దోమల నివారణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధికారులను కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మున్సిపల్ డీఈ, ఏఈల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ..మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పలు డ్రయినేజీలు పొంగడం, పలు కాలనీల్లో విద్యుత్ వోల్టేజ్ సమస్యలు, కాలనీల రోడ్లు గుంతలుపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే రోడ్ల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని చెప్పారు. కార్పొరేషన్ ప్రజలు దోమల బారిన కాకుండా రోజూ ఫాగ్గింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రునాయక్, నాయకులు యాసారం నగేష్, ఎండీ మజర్, అమర్నాథ్, పలు కాలనీల అధ్యక్షులు, ప్రజలు ఉన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడాలి



- ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలి
- ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు

నవతెలంగాణ-ఉప్పల్

ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఎంటమాలజీ విభాగం, శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వలన వచ్చే వ్యాధులు, దోమకాటు నుండి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలలో వర్షపు నీరు, ఇతర మురుగునీరు నిలవకుండా చూడాలన్నారు. టైర్లు, పగిలిన కుండలు, బకెట్లు, కొబ్బరి చిప్పలు లాంటి వాటిలో వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, దోమతెరలు వాడాలని, కిటికీలకు, డోర్లకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దోమలబారిన పడితే మలేరియా, డెంగ్యూ, లాంటి విష జ్వరాల వస్తాయని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనమే కాపాడుకోవాలని సూచించారు. అంతకుముందు ఈ ఫ్లెక్సీలు, సంబంధిత అవగాహన వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అధికారి చందన, ఎస్‌డబ్ల్యూఎం ఎంటమాలజీ విభాగం ఏఈ నరేష్ రెడ్డి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఈఎఫ్ఏ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో గుర్తు తెలియని పుర్రె లభ్యం



నవతెలంగాణ-మేడ్చల్

గుర్తు తెలియని ఓ మహిళ పుర్రె లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి గ్రామంలోని నార్నే ఎస్టేట్‌లోని సర్వే నంబర్లు 148, 149, 151, 152, 716, 717లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సోమవారం మహిళ పుర్రె, వెంట్రుకలు, చీర, బ్లౌజ్, చేతి సంచి ఒక చెప్పును గమనించి మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ అద్దాని సత్యనారాయణ, ఎస్సై మురళీధర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నగరంలోని గాంధీ ఆస్పత్రి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజుతో పాటు ఐదు మంది సిబ్బంది కలిసి ఆధారాలు సేకరించారు. ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజు మాట్లాడుతూ.. గత ఆరు నెలలకు ముందే ఈ హత్య జరిగి ఉండొచ్చని తెలిపినట్టు ఎస్సై మురళీధర్ పేర్కొన్నారు. కాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సొసైటీస్ అసోసియేషన్ (నాసా) 20 కాలనీస్ ఆధ్వర్యంలో కాలనీల్లోని సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పెండింగ్‌లో ఉన్న కనెక్టివిటీ రోడ్లను వేయాలని, పార్కులకు ఫెన్సింగ్, హై టెన్షన్ రోడ్డుకు డివైడ్ ఏర్పాటు చేయాలని, సాయి నగర్ కాలనీకి వెళ్లే రహదారిలోని చెట్లను తొలగించాలని, కుక్కలు, దోమల బెడదన నివారించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంటి కాలనీ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి భూపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి , కిషన్ రాజిరెడ్డి మల్లారెడ్డి శ్రీనివాస్ కృష్ణారెడ్డి ,సమ్మిరెడ్డి, ఫాతిమారెడ్డి ఉన్నారు.

ఎంప్లాయిమెంట్ అధికారిగా రాధిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిగా ఎం.రాధిక బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేయగా.. జిల్లాలో సేవలందించిన నిర్మల సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు.

నవతెలంగాణ 9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | జూలై 23, 2024 | www.navatelangana.com

అదనపు కలెక్టర్‌గా రాధికా గుప్తా బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్)గా రాధికా గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన అదనపు కలెక్టర్ రాధికాగుప్తకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, పలువురు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం కార్యాలయం వద్ద కలిశారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. వివేకానంద నగర్ కాలనికి చెందిన పలువురు ఈ నెల 29న జరిగే నల్ల పోచమ్మ తల్లి తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ముదిరాజ్‌ల డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి



● **ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు చినంగి వెంకటేశం ముదిరాజ్ ఆధ్వర్యంలో.. సోమవారం సంఘ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ని కలిశారు. ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. జీవో ఎం.ఎస్. నెంబర్ 15/2009 ప్రకారం ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ- ఏ లోకి మార్చాలన్నారు. ముదిరాజ్ కో - ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.1000 కోట్ల కేటాయించి, 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చెరువులు, కుంటాలపై, మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న ముదిరాజ్, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులస్తులకు మాత్రమే చెరువులు కుంటలపై హక్కులు కల్పించాలన్నారు. 50 సంవత్సరాల నిండిన ముదిరాజులకు ఆసరా పెన్షన్ అందజేయాలన్నారు. 6 వేలకు పై చిలుకు ఉన్న అన్ని సొసైటీలకు 100శాతం ఉచితంగా చేపల పంపిణీ చేయాలి. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి దానికి చైర్మెన్‌గా ముదిరాజును నియమించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తుల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్, బాచుపల్లి మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ ముదిరాజ్, మేడ్చల్ జిల్లా ముదిరాజ్ సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సభ్యులు చినంగి మల్లేష్ ముదిరాజ్, ఉప్పరి కృష్ణ ముదిరాజ్, పిట్ల సత్యనారాయణ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, హరి ముదిరాజ్ పాల్గొన్నారు.

'ఫోర్స్ నైన్' సెక్యూరిటీ , కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ..

132 - జీడిమెట్ల డివిజన్ విమానపురి కాలనీలో అనిల్ జేమ్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫోర్స్ 9' సెక్యూరిటీ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యాలయాల భద్రత వంటి వాటిలో సెక్యూరిటీ సర్వీసెస్ పాత్ర ఎంతో గొప్పదని మంచి సర్వీసును అందించి ఫోర్స్ నైన్ మంచి పేరును గడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, నాయకులు కుంట వేణు, నార్లకంటి శ్యామ్ సుందర్, బలరాం, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఇండ్లల్లో చొరబాట్లు నివారించాలి

● **అక్రమ చొరబాటు దార్ల ఇండ్ల టాక్స్ రద్దు చేయాలి సీపీఐ(ఎం) నాయకులు**



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలోప్రభుత్వం కేటాయించని ఇండ్లలో అక్రమ చొరబాట్లు అరికట్టాలని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. అక్రమంగా వచ్చిన అట్టి ఇండ్లపై ట్యాక్సీలు వేసి ఆ ఇండ్లకు హక్కులు కల్పించే విధముగా ఉండకుండా నిలిపి, ప్రభుత్వ పరంగా ఆదేశాలు వచ్చే వరకు మునిసిపల్ చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప ఇండ్లు కార్పొరేషన్ హ్యాండ్వర్లో లేవని కమిషనర్ తెలుపుచు.రాజీవ్ గృహకల్ప ఇండ్లు మన కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయని వాటి యొక్క పారిశుద్యం, డ్రయినేజీ రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఇంటి టాక్సు వేస్తూ టాక్స్‌లు వసూలు చేయడం కార్పొరేషన్ పరిధిలోని వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాబట్టి రాజీవ్ గృహకల్పలో ప్రభుత్వం కేటాయించని ఇండ్లకు మున్సిపల్ టాక్స్ ఏ విధంగా నిర్ణయించి వసూలు చేస్తున్నారన్నారు. కేటాయించని ఇండ్ల లిస్టు ప్రకారం సర్వే చేసి హౌస్ టాక్స్‌లు అక్రమంగా పొంది నివాసముంటున్న అక్రమ దారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజా ప్రతినిధులు అధికారులు లేని ప్రజావాణి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించే ప్రజావాణిలో ప్రజా ప్రతినిధులు అధికారులు లేరని ప్రజల సమస్యలు విన్నవించుకునే అవకాశం లేదన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రజల సమస్యల అర్జీలను తీసుకుని ఆన్లైన్ చేస్తున్నారన్నారు. ఈ విధంగా ఇన్ వర్డ్ సర్వీస్ మాదిరిగా ప్రజావాణి నిర్వహించటం ఏమిటని కమిషనర్‌ని ప్రశ్నించగా.. కమిషనర్ కార్పొరేషన్‌లో మేనేజరు ఆర్‌ఓతో సహా 6 మంది అధికారులు బదిలీ అయ్యారని బదులిచ్చారన్నారు. కావున కార్పొరేషన్‌లో అధికారుల నియామకాలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎం.చంద్రశేఖర్, బాల పీరు, స్థానిక నాయకులు, శంకర్ సుధాకర్, సురేష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ పనుల పరిశీలన



● **జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ సర్కిల్, జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెల గడ్డలో నూతనంగా నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీ) పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి ఇతర అవసరాలకు నీటిని వినియోగించుకోవడం... ఆధునిక సాంకేతిక పద్ధతి ద్వారా నీటిని శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్‌టీపీ ప్లాంట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో ఎస్‌టీపీ పనులతో పాటు మిగతా పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు ఆదేశించారు. ఉప కమిషనర్ వి.నరసింహ, ఎస్ ఈ చిన్నా రెడ్డి, ఈఈ లక్ష్మి గణేష్, ఏఎంఓ హెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ, పట్టణ ప్రణాళిక ఏసీపీ సాయిబాబా, డీఈలు పాపమ్మ, రఘుపతి రెడ్డి, జలమండలి అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ అందరిది..!



● **పట్నం సునీత మహేందర్ రెడ్డి**

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అందరిదీ.. అందరికీ అవకాశాలు వస్తాయి అని ఎవరూ నిరుత్సాహ పడవద్దని పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం సునీత అన్నారు. మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మూసాపేటలోని శ్రీనల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మెన్‌గా ఎల్లేష్ యాదవ్, ఇతర కార్యవర్గ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పోరాట పటిమతోనే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పార్టీ మీద ప్రతీ కార్యకర్తకు హక్కు ఉందన్నారు. నియోజకవర్గంలో ఎండోమెంట్ పరిధిలో 25 ఆలయాలు ఉన్నాయని వీటన్నిటికీ త్వరలోనే కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ పండుగ ఇప్పుడే ప్రారంభమైందని ముందు ముందు ఇలాంటి పండగలు ఎన్నో జరుగుతాయన్నారు. ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలని రమేష్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం పుష్ప రెడ్డి. ఏబి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి వేణు కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము, సంనర్సింగరావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవాణి విద్యా నికేతన్‌లో ఇన్వెస్టిచర్ వేడుక



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎస్ఆర్ నాయక్ నగర్ 'సత్యవాణి విద్యానికేతన్' స్కూల్‌లో 'క్రమశిక్షణ మండలి' (ఇన్వెస్టిచర్ సెరేమోని) వేడుక టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి దీప్తి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెంచాలా శ్రీకాంత్ (దీక్ష జూనియర్ కాలేజ్ మేనేజర్) పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులచే ఓటింగ్ సిస్టం ద్వారా ఎన్నుకోబడిన స్కూల్ క్యాబినెట్ హెడ్ బాయ్ శౌర్య తివారి, హెడ్ గర్ల్ అపూర్వి, డిప్యూటీ ఎడ్ బాయ్ ఆల్విన్ టోమస్, డిప్యూటీ హెడ్ గర్ల్ జాహ్నవి నక్రాణి, సీసీఏ బాయ్ శ్యామ్ నక్రాణి, సీసీఏ గర్ల్ హర్షవర్ధిని, స్పోర్ట్స్ కెప్టెన్ బాయ్ అఖిల్, స్పోర్ట్స్ కెప్టెన్ గర్ల్ వైష్ణవిలకు బ్యాడ్జెస్ షోల్డర్ ఫ్లాప్స్, శ్లాసేస్ వేసి అభినందించారు. పాఠశాల క్రమశిక్షణ, కో కర్కిలర్ ఆక్టివిటీస్‌తో పాటు విద్యార్థుల క్రమశిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలలో సబ్జెక్ట్, ప్రాజెక్ట్ బేసిడ్ లెర్న్ వంటి కార్యక్రమాలలో చేయూతనందించి ముఖ్య భూమికగా స్కూల్ క్యాబినెట్‌ని ఎన్నుకోబడింది. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం క్యాబినెట్ విద్యార్థులు, ప్రిఫెక్ట్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు క్యాస్ట్, బర్త్ సర్టిఫికెట్లు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చైల్డ్ కేర్ సంస్థల్లో అనాథలుగా వదిలేసిన చిన్నారులకు కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమ్ క్యాస్ట్, బర్త్ సర్టిఫికెట్స్ అందజేశారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ సంక్షేమంలో భాగంగా 2022-2023 ఆర్థిక సంవత్సరానికి గాను 10 మందికి, ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇచ్చారు. జిల్లాలో అర్హులైన లబ్దిదారులు ఎక్కువమంది ఉండటం వల్ల 21 మందిని ఎంపిక చేశారు. ఇందుకు జిల్లా సంక్షేమ అధికారి కష్ణారెడ్డి చొరవ తీసుకుని జిల్లాకు అదనంగా నిధులు తెప్పించి అర్హులైన మిగతా 11 మందికి ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.5లక్షలా 50వేల చెక్కులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ లోన్లు 100శాతం సబ్సిడీతో లబ్దిదారులకు చేయూతనందించి, ఏదైనా వ్యాపారం చేసుకోవడానికి తోడ్పాటు అవుతుందన్నారు. ఇలా జిల్లాలోని అనేక మందికి ఆర్థిక స్వలాభం చేకూరుతుందన్నారు. 26 మంది ట్రాంజెండర్స్‌కి ఐడీ కార్డులను జారీ చేశారనీ, వీటి ద్వారా వారికి సులువుగా రేషన్ కార్డు, ఇండ్లు మంజూరు చేయడానికి వీలుంటుందని తెలిపారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ సంస్థలోని అనాథ, వదిలేయబడిన చిన్నారుల చదువులకుగాను, జిల్లాలోని 14 మండలాల అధికారులకు తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో పిల్లలకు బర్త్, క్యాష్ సర్టిఫికెట్స్ మంజూరు చేయించి అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ట్రాంజెండర్స్, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ ఇన్‌చార్జి పర్సన్స్, కలెక్టర్‌కు కృష్ణారెడ్డి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, బాల రక్ష భవం కో-ఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండీ ఇంతియాజ్ రహీం, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి



● **జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గౌడ కులస్తుల ఆరాధ్యుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్.వట్టికూటి రామారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో వచ్చేనెల (ఆగస్టు) 11 న రవీంద్రభారతిలో జరిగే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374 వ జయంతి ఉత్సవాల గోడపత్రికను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు శేషగాని నరేష్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాంతి నారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు మునుకుంట్ల శ్రీనివాస్ గౌడ్, జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి టీసు వెంకటేశం గౌడ్ (కుత్బుల్లాపూర్ నియోజకవర్గం)భానుప్రభుగౌడ్, బొమ్మగాని శంకర్ గౌడ్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మహిళలు, జై గౌడ్ ఉద్యమనాయకులు పాల్గొన్నారు.

గురువు మాలే చంద్రయ్యకు సన్మానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ సంఘసేవకులు, గురువు మాలే చంద్రయ్యను గుజరాత్ సోమనాథ్ యాత్రలో భాగంగా గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని హైదరాబాద్ నగరం ఉప్పల్ ప్రాంతానికి చెందిన మా గురువు మాలే చంద్రయ్యను రవితేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు, శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సంఘసేవకులు జింకల వెంకటేష్ ముదిరాజ్ నేతృత్వంలో గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో బెడ్ ద్వారక బ్రిడ్జి పైన శాలువాతో సన్మానిస్తూ ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా రవితేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానన్నారు. గురువు మాలే చంద్రయ్యను ఈ విధంగా ఈ ప్రాంతంలో సన్మానించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని జింకల వెంకటేష్ ముదిరాజ్‌తో పాటు గ్రూప్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన పెద్దిరాజు, రామకృష్ణ, వై.అనిల్ కుమార్, ఏ.రాజేష్, లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, కస్తూరి, రమ, ఎస్.సుధాకర్ రెడ్డి, సరోజ, గోపాల్, వై.లక్ష్మి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత కాలం ఇక్కడ పని చేసిన శంకరయ్య ఇటీవల జరిగిన బదిలలో సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో క్యాట్ నుంచి వచ్చిన సతీష్‌కు శంకరయ్య దుండిగల్ సీఐ బాధ్యతలు అప్పగించారు.

నవతెలంగాణ-దుండిగల్

'ప్రజావాణి' దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



● **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి 75 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకట్ రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ అధ్యక్షులు, హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సారికి వెంకట్ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్ మార్వెల్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన జన్మదిన వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బీరప్ప, మహంకాళి అమ్మవారికి మాజీ కార్పొరేటర్ పూజలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా మూసాపేట్ జనతనగర్‌లో గల బీరప్ప ఆలయంలో కురుమల ఆరాధ్య దైవం అయినటువంటి బీరప్ప, మహంకాళి అమ్మవారికి మాజీ కార్పొరేటర్ బాబురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి బీరప్ప, శ్రీ శివ కన్యక పరమేశ్వర వెంకటేశ్వర సహిత సాయిబాబా దేవాలయల చైర్మెన్ ఐలయ్య, అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, నాయకులు కేబుల్ శ్రీనివాస్, కొడిచేర్ల ఎల్లేష్, గిర్నీ రవి, శ్రీశైలం, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలని వినతి పత్రం అందజేత..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కుకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ని కలిసి వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజదేవి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యల గురించి వివరించి, పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులను సైతం ప్రారంభించాలని, జోనల్ కమిషనర్‌కి మాధవరం రోజా దేవి రంగారావు వినతి పత్రం ఇచ్చారు. వెంటనే సానుకూలంగా స్పందించి కమిషనర్, వర్క్స్ ప్రాధాన్యత ప్రకారం వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | జులై 23, 2024 | www.navatelangana.com

'ఇంట్లో నుంచే సమగ్ర మధుమేహ సంరక్షణ'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

మధుమేహ రోగులు ఆస్పత్రులకు వెళ్లకుండానే ఇంట్లో నుండే సమగ్ర మధుమేహ సంరక్షణను అందించడం కోసం నూతన టెక్నాలజీని సమన్వయ పరచడంతో పాటు డేటా ఆధారిత అల్గోరిథంల పరిశోధనలో ఐడియా క్లినిక్స్ ముందంజలో ఉందని క్లినిక్స్ ఫౌండర్ డాక్టర్ కలవలపల్లి శ్యామ్ అన్నారు. డయాబెటీస్ అండ్ ఎండోక్రైనాలజీపై పరిశోధనపై జాతీయ సదస్సును నగరంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రివెంటివ్ హెల్త్ కేర్ ఆరోగ్య సంరక్షణ టెక్నాలజీతో మార్పు చేసే పాత్రపై ప్రస్తావించారని తెలిపారు. ఈ సదస్సులో ఐఎస్ బీ బిజినెస్ స్కూల్ హైదరాబాద్ అసోసియేట్ డీన్ సారంగ దేవ్, నెఫ్రోప్లస్ వ్యవస్థాపకులు ఉప్పల విక్రమ్, ఎన్ఐఎన్, ఐసీఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, ఆర్ఎస్ఎస్ డీఐ అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఎండోక్రైనాలజీ, మధుమేహ పరిశోధన ప్రొఫెసర్లతో పాటు 500 మందికి పైగా నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. పెరుగుతున్న మధుమేహ భారం, ప్రివెంటివ్ హెల్త్ కేర్, ఆరోగ్య చర్యల ప్రముఖ్యత, ఎల్ వీపీఈఐ బృందం ఐడియా క్లినిక్స్, ఐఎస్ బీతో కలిసి చేస్తున్న రీసెర్చ్ అధ్యయనం మొదటి విడుత ఫలితాలను వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

'టీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గద్దగూటి ఎట్టయ్య'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్జీవో రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా మహేశ్వరం మండలం నివాసి, తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది గద్దగూటి ఎట్టయ్య ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పది ఏండ్లుగా తమ సంస్థ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసా మరస్యం, జాతీయ సమైక్యత, న్యాయ పరమైన శిబిరాలను నిర్వహించిందన్నారు. గద్దగూటి ఎట్లయ్య న్యాయ శాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పీజీ పట్టా పొందారని, ఆయన గతంలో రంగా రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ 104లో న్యాయ సేవలు అందించారని, సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ కంపెనీ వినియోగదారుల ఫోరం లేబర్ కోర్టు బ్యాంకింగ్, ట్రిబ్యునల్, రాష్ట్ర హైకోర్టులో ఎంతో ప్రఖ్యాతి పొందారని కొనియాడారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం

- డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు చర్యలు
- డెంగ్యూ కేసులు రాకుండా చర్యలు చేపట్టాలి
- అసెంబ్లీ సమావేశాల్లోపు సమస్యలపై సీఎంతో నగర ఎమ్మెల్యేల భేటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నగర ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా శాసన సభ బడ్జెట్ సమావేశాల్లోపు నగర అభివృద్ధి పలు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు, బడ్జెట్‌లో నగరానికి కావాల్సిన అవసరాలపై సోమవారం సెక్రటరియేట్‌లోని మంత్రి ఛాంబర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నగర ఎమ్మెల్యేలు శ్రీగణేష్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, ఎంఐఎం ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబిన్, కౌసర్ మోహినుద్దీన్, అబ్దుల్లా బలాల, మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, ప్రభాకర్ రావు, మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్ ఎఫండి, మీర్జా రహమాన్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపు నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసి నగరాభివృద్ధికి కావాల్సిన అవసరాలు , పెండింగ్ బిల్లులు, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతి తదితర అంశాలపై విజ్ఞప్తి చేయాలని సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ నగరంలో డెంగ్యూ కేసులు రాకుండా వైద్యాధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, నీళ్లు నిల్వ ఉండకుండా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ ,హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్ , ఎలక్ట్రిసిటీ పలు సమస్యలు , పెండింగ్ బిల్స్, ప్రస్తుతం వర్క్స్‌కి అవసరమైన నిధులు, నగర అవసరాలు ఇవి అనే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని మెడికల్ షాపులలో డ్రగ్స్ సంబంధిత ఔషధాలు బయటపడుతున్నాయన్న ఎమ్మెల్యేల ఫిర్యాదుతో అలాంటివి ఏం ఉన్న తక్షణమే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌పై తీసుకుంటున్న చర్యలు, లా అండ్ ఆర్డర్‌పై హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నగరంలో గురుకులాలు, ప్రభుత్వ హాస్టల్స్, స్కూళ్లు తదితర వాటిపై ఎమ్మెల్యేలు అధికారులు తనిఖీ చేపట్టాలని, అప్పుడే విద్యార్థులకు ఒక భరోసా ఇవ్వగలమని సూచించారు. నగరంలో స్కూల్‌లలో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అన్నిటినీ క్రోడీకరించి హైదరాబాద్ అభివృద్ధిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గకుండా మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా నగర ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటన్నిటిపై వెంటనే అధికారులతో మాట్లాడి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశించారు. కంటోన్మెంట్‌లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని ఎమ్మెల్యే శ్రీగణేష్ మంత్రి దృష్టికి తీసుకురాగా దానిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇతర అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కారం చేసుకుందామని హామీ ఇచ్చారు. అధికారులు వారి డిపార్టుమెంట్‌లలో తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించారు. జీహెచ్ఎంసీ, హైదరాబాద్ లా అండ్ ఆర్డర్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ తదితర అంశాలపై అధికారులు చర్చించారు. ఈ సమావేశానికి పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఎండీ ముస్తఫా, అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్, అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్ ,సెంట్రల్ జోన్ డీసీపీ అక్షన్ష్ యాదవ్ వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలోని ఓ ఆస్పత్రి వద్ద అక్రమ పార్కింగ్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్థానిక బస్తీలు, కాలనీలలో నెలకొన్న సమస్యల పై ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేయాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలేజా, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, వెటర్నరీ విభాగం డీప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

25న స్టైల్ పితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



మహిళ సాధికారత కోసం గత 8 ఏండ్లుగా క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్టైల్ పితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తూ వస్తున్నట్లు ప్రతినిధులు రమారాణి, వైశాలి ఇనాని, మీనల్ శారద, వినీత బల్దువ అన్నారు. సోమవారం కోఠిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్టైల్ పితార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 8ఏండ్లుగా గృహిణీలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు స్టైల్ పితార ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. గృహణీలు నివాసాలలో పనిచేయడంతో పాటు వారి ప్రతిభతో తయారుచేసిన ఉత్పత్తులను వారే స్వయంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసేలా 100కు పైగాస్టాళ్లను ఈ ఏడాది ఎగ్జిబిషన్‌లో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా క్రియేటివ్ ఆర్ట్స్ చారిటీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈనెల 25, 26 తేదీలలో రెండు రోజులపాటు రామ్ కోఠిలోని కచ్చి భవాన్‌లో స్టైల్ పితార ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సంఘ సేవకురాలు భగవతి మహేష్ బలద్వా, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్వేత అగర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని ఢిల్లీ, ముంబై, కలకత్తా, జైపూర్‌లతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు పాల్గొంటారన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్, పేపర్ స్టాల్స్ ఫుడ్ స్టాల్స్ గేమ్స్, జువెలరీ, హ్యాండ్ క్రాఫ్ట్, ఫుడ్ ఐటమ్స్ ఉత్పత్తులను స్టాళ్లలో ఏర్పాటు చేస్తారని వివరించారు.

రేవంత్ రెడ్డి పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట/హిమాయత్ నగర్

సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ హామీ 6 నెలలో చేస్తానని చెప్పి చేయకుండా బీసీలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో ఓబీసీ మోర్చ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అంబర్ పేట ఎమ్మార్వో హిమాయత్ ఎమ్మార్వో కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గౌతమ్‌రావు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు సి.వినోద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రమేష్, సి.కృష్ణ గౌడ్, కార్పొరేటర్ వై.అమృత,కన్నే రమేష్ యాదవ్, అజయ్ కుమార్,నాగ భూషణ్ చారి, రవీందర్ గౌడ్,చుక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- తెలంగాణ గౌడ కల్లుగీత సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజ్

నవతెలంగాణ-ముషీరాబాద్



గౌడ్స్‌లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజ్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయాలన్నారు. గౌడ కల్లుగీత వృత్తిదారులు వృత్తిలో మరణించిన వారికి రూ.5 లక్షల నుంచి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరుతో జనగామ జిల్లా ఏర్పాటు గెజిట్ విడుదల చేయాలన్నారు. ట్యాంక్ బండ్ పైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం పెట్టి అధికారికంగా జయంతి, వర్ధంతి ఉత్సవాలు ఘనంగా చేస్తామని తెలిపారు. మద్యం షాపులలో వైన్స్ బార్లలో గౌడులకు 20 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. లకిడికాపూల్-ఖైరతాబాద్ మధ్య రైలు పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిని గుర్తు తెలియని రైల్ ఢీకొనడంతో గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతని వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతని ఒంటిపై తెలుగు రంగుతో కూడిన గ్రీన్ కలర్ ఫుల్ షర్ట్ బ్రౌన్ బెల్ట్ బ్లూ కలర్ జీన్స్ ధరించినట్లు తెలిపారు. ఆ శవాన్ని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఆ మృతుడి సంబంధికులు ఉంటే వెంటనే 040 23202238, 8712658580, 871256844 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'మానవ విలువలను మెరుగుపరచాల్సిన బాధ్యత సైకాలజిస్టులది'

- తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



సమాజంలో మసక బారుతున్న మానవ సంబంధాలు, విలువలను మెరుగుపరచాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. సోమవారం అమృత క్యాజిల్ హోటల్‌లో 'మానవ సంబంధాలు, వ్యక్తిత్వ విశ్లేషణ' (ట్రాంజాక్షనల్ అనాలిసిస్) అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతమైన ఆనందమయమైన జీవితానికి మానవ సంబంధాలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుత సమాజంలో అడుగంటుతున్న కుటుంబ అనుబంధాలు ప్రగతి నిరోధకంగా మారిందని, జీవితంలో ప్రతి సన్నివేశంలో సంబంధాలు ఒకరి నుండి మరొకరికి ఉంటాయని, వాటిని ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో పెంపొందించాలని, లేని యెడల భవిష్యత్తు సమాజం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సైకాలజీ రంగం మరింత అభివృద్ధి చెందాలంటే సైకాలజిస్టులు వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు తరం ఓ మంచి సమాజంగా రూపుదిద్దుకోవాలంటే సైకాలజిస్టుల సేవలు తప్పనిసరి అన్నారు. ప్రముఖ శిక్షకులు ఉమా మహేశ్వరరావు మాట్లాడు తూ ట్రాంజాక్షనల్ అనాలిసిస్ ఇది ఒక అద్భుతమైన సాధనమని, ప్రజల తో సంబంధాలు పెంపొదించుకోవడా నికి ఎంతో ఉపయో గపడుతుందని, దీనిలో నైపుణ్యాన్ని సాధించినట్లయితే ఎదుటి వ్యక్తిని పుస్తకంలా చదివేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ రావు, సుధాకర్, వైదేహి, ముర్తుజా, నైనా మోహన్, గజ్జెల సంధ్య, లక్ష్మి సౌజన్య, జెఫ్రా, ఫాతిమా, అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి'



- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పెండింగ్ లో ఉన్న రూ.8214.57 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడలో పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులు నిరసన ప్రదర్శన, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులను చెల్లించడం లేదన్నారు. ఏడాదికి నాలుగు లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరికి ఏడాదికి మూడు వేల కోట్లు అవసరమవుతాయని గుర్తు చేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు పేరుకుపోయిన బకాయిలు 2019-20 వరకు రూ.800 కోట్లు, 2020-21 రూ.2356 కోట్లు, 2021-22 రూ.2100.43 కోట్లు, 2022-24 రూ.2958.14 కోట్లతో కలిపి మొత్తం రూ.8214.57 కోట్లు ఫీజుల రూపంలో బకాయిలు ఉన్నట్టు వారు తెలిపారు. గత ప్రభుత్వాలు వివరించిన తీరు లాగానే నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అలానే అనుసరిస్తుందని, అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు మొత్తాన్ని చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, నాయకులు మహేష్, సతీష్, చింటూ, మురళీ, శ్రీరామ్, మనోహర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

డ్రగ్స్, మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ రాములు, డిప్యూటీ డీఈవో రమణ రాజులు అన్నారు. డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని - మేలుకొలుపుదాం.. అంటూ ప్రజానాట్యమండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో రాంసింగ్‌పుర, కుల్సుపుర హై స్కూల్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాల ప్రమాదాన్ని వివరించే ఫోటో ఎగ్జిబిషన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్నారు. మారుతున్న పాశ్చాత్య సాంస్కృతికి అలవాటు పడుతూ చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. మన ఇంటి పక్కల రోడ్లమీద డ్రగ్స్, గంజాయి వాడుతున్నారని తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.కళ్యాణ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందన్నారు. అవగాహన రావాలనే ఉద్దేశ్యంతో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఆగస్టు నెలలో కళారూపాలతోటి మరో కార్యక్రమం చేపడతామని, డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ మారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర నాయకులు శశికళ, ఏడు మేకల శ్రీశైలం, కృష్ణ, రమేష్, శీను, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు

నవతెలంగాణ-ముషీరాబాద్



వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు డిమాండ్ చేశారు. తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిల మల్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న నలభై లక్షల వడ్డెర ప్రజల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని గత ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి వడ్డెరలను ఎస్టీ జాబితాలు చేరుస్తామని కాంగ్రెస్‌కు అధికారం కట్టపెడితే సీఎం వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని పలు సభల్లో డిక్లరేషన్ చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ వైపు అడుగులు వేయడం లేదన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీనీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎత్తరి గణేష్, వరికుప్పల వెంకటేష్, రాష్ట్ర వైస్ చైర్మన్ కుంచపు దేవరాజ్, కోశాధికారి గండి కోట కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాస్, పల్ల పు దుర్గయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు వెంకటరమణ, చెన్నయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన, అంకితభావాలను అలవర్చుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



విద్యార్థులు సమయ పాలన, అంకితభావలను అలవర్చుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్దార్ని హర్బన్స్ కౌర్, అతిథి అపర్ణ శంకర్, ప్రెసిడెంట్ సిక్కు ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్.ప్రీతమ్ సింగ్‌లు అన్నారు. బహదూర్‌పుర కిషన్ బాగ్ సిక్కు చావనియాట్‌లోని గురునానక్ హైస్కూల్‌లో అత్యంత పవిత్రమైన ఉత్సవ సందర్భం 'పెట్టుబడి వేడుకను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ... కొత్తగా నియమించబడిన పాఠశాల క్యాబినెట్‌కు పాఠశాల ఆశ, విశ్వాసం, బాధ్యతను అప్పగించే ముఖ్యమైన సందర్భాలలో ఇన్వెస్టిచర్ వేడుకలను నిర్వహిస్తారన్నారు. నాయకత్వం అనేది దృష్టిని వాస్తవికతలోకి అనువదించే సామర్థ్యంను పెంపొందించుకోవాలన్నారు. నాయకత్వం అంటే ఒకరి శక్తిని ఆస్వాదించడం కాదని, అది ఇతరులను శక్తివంతం చేసే సాధనమని సరిగ్గా వ్యాఖ్యానించారు. విద్యార్థులు సమయపాలన, అంకితభావం, క్రమశిక్షణ, సంకల్పం వంటి విలువలను అలవర్చుకోవాలన్నారు. రేపటి జాతి నిర్మాతలుగా నిజాయితీగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని, భారతీయుడిగా గర్వపడాలని సూచించారు. తమ తోటి విద్యార్థుల అభివృద్ధి, అభివృద్ధికి మాత్రమే కాకుండా వారి వ్యక్తిగత ఎదుగుదల కోసం కూడా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురునానక్ హైస్కూల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ బహదూర్ సింగ్, సెక్రటరీ, కరెస్పాండెన్స్ జీఎన్‌హెచ్ఎస్ డాక్టర్. ఎస్ సజ్జన్ సింగ్, ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్, సిక్కు ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం కలిగే కొత్త రూల్స్‌ను తీసుకురావద్దు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్మికులకు నష్టం కలిగే కొత్త రూల్స్‌ను తీసుకురావద్దని సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, మీనా, ఎస్.కిషన్, సత్తార్‌లు డిమాండ్ చేశారు. సీఐటీయు సౌత్ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నర్కిపూల్ బాగ్ బాబానగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కార్మికులను నష్టం వాటిలేవిధంగా కొత్త రూల్స్ తీసుకొని వస్తుందన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు పెంచాలన్నారు. రాంకి లాంటి ప్రయివేట్ సంస్థకి కాంట్రాక్ట్ ఇవ్వద్దని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. లేకపోతే కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, జీ.యాదమ్మ, స్వాతి, మంగ, వెంకటయ్య, ఇంద్రమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గోరక్షా చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-అంబర్‌పేట



గోరక్షా చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు 1977 చట్టం ప్రకారం గోవధకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలనే నిబంధనలు ఉన్నా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పరిధుల్లో ఏమాత్రం ఈ నిబంధనలు అమలు చేయడం లేదన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ ఆధ్వర్యంలో సోమవారం భాగ్యనగర్ గోశాలకు గోగ్రాసం, పశుదాన, మినరల్ మిక్చర్, బెల్లం పంపిణి చేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా లయన్స్ క్లబ్ సహకారంతో గోశాలలకు పశుదానను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గోవుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న రక్షణ చర్యలు శూన్యమని అన్నారు. గోరక్షా చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోవుల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జోనల్ చైర్మన్ మహేందర్ గుప్తా, సమర్పన్ అధ్యక్షురాలు నిర్మలా సంఘీ, దీపక్ షాద్, ప్రేమ్చంద్ మునోద్, ప్రతాప్ నారాయణ సంఘీ, ప్రవీణ్ గుప్తా, వినీత కైతాన్, రాజేందర్ కైతాన్, సారిక గుప్తా, నీతా గుప్తా, వందనా సాద్ తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం పాతబస్తీ'

నవతెలంగాణ-ధూల్‌పేట్

సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం పాతబస్తీ అని పురాణపుల్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్ అన్నా రు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చిన్న బజార్ గజ్జల పాపమ్మ దేవాలయం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మెన్‌గా గున్నాల విశాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సున్నం శ్రీకాంత్, బాక్సర్ రాజు, పుప్పాల కపిల్, దిడ్డి సంతోష్, పుప్పాల అశ్విన్లను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి సాంప్రదా యాలకు నిలయమైన పాతబస్తీలో బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఆనవాయితీ ప్రకారం చిన్న బజారులో ఈ నెల 27న శనివారమే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

'ఇచ్చిన హామీలు మరిచి బీజేపీ జిమ్మిక్కులు చేస్తున్నది'

నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయడం మరిచి రాష్ట్రంలో జిమ్మిక్కులు చేస్తుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఈ మేరకు సోమవారం బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పత్రిక ప్రకటన ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి నిరుద్యోగుల పక్షాన దీక్ష చేయడం విడ్డూరమన్నారు. దేశంలో పది సంవత్సరాలుగా ఉద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చి అది మరిచిన మీకు నిరుద్యోగుల పక్షాన మాట్లాడడం ఏమైనా చర్య అన్నారు. దీక్షల పేరుతో నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇని నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇప్పటివరకు 30500 ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | జూలై 23, 2024 | www.navatelangana.com

రోడ్డు ఓపెనింగ్ చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ నాయకులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

పనులు పూర్తయి నెల అయినా రోడ్డు ఓపెనింగ్ చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని, జూబ్లీహిల్స్ జోన్ సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రోడ్డును పరిశీలించి యాదగిరి నగర్ నుండి జానకమ్మ తోట యూసఫ్ గూడ బస్తీకి వచ్చే రోడ్డును సీపీఐ(ఎం) జోన్ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించి ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్ మాట్లాడుతూ, రోడ్డు పనులు పూర్తయిన వారం రోజుల్లోనే రోడ్డును ప్రజలకు అందుబాటులోనికి తీసుకొని రావలసిన అధికారులు చిన్న చిన్న కారణాలతో ప్రారంభించకపోవడం అన్యాయమని, ఇది చట్ట వ్యతిరేకమైన చర్య కాబట్టి ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుకట్ట వేసిన మట్టిని ,రాళ్లను తొలగించి రోడ్డు ఓపెన్ చేసి ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావాల్సిందిగా తెలపడం జరిగింది. రోడ్డు వేసింది 20 మీటర్లు 600 మీటర్ల దూరం నుంచి ఇక్కడికి వచ్చి మళ్లీ రోడ్డు లేదని వెనకవైపు వెళ్లి యూసఫ్ గూడ చెక్పోస్ట్ నుంచి బస్తీకి రావడం జరుగుతుంది. ట్రాఫిక్ జామ్ అయి ఉదయం స్కూళ్లకు వెళ్లే వారు డ్యూటీలకు వెళ్లేవారు చాలామంది ఇబ్బంది పడుతున్నారు . ప్రమాదాలు జరగకముందే ప్రజలందరికీ సౌకర్యవంతమైనటువంటి వెసులుబాటైనటువంటి రోడ్డును వెంటనే ఓపెన్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర రావు, వై యాదగిరి ,పి కృష్ణ పుల్లయ్య రమణ, రమేష్ కుమార్, కిరణ్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల్లో జీహెచ్ఎంసీ..

బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ఎంత ?



- రూ.5000 కోట్లు కేటాయిస్తేనే మనుగడ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఇప్పటికే రూ. 6500 కోట్ల అప్పుల్లో కూరుకు పోయింది. ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో జీహెచ్ఎంసీ తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించడంతో పాటు సిబ్బందికి వేతనాలివ్వడంలో మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు జీహెచ్ఎంసీలో ప్రాజెక్టు నిర్వహణకు సైతం భారీగా నిధిలు అవసరమున్నాయి. ముఖ్యంగా వరద నాలాలు, మురుగునీటి నాలాలు, అంతర్గత రహదారులు, చెరువులు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, మురుగునీటి లైన్లు, శ్మశానవాటికల్లో సౌకర్యాలు, పార్కులు, పచ్చదనం, దవాఖానలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు అవసరముంది. ఇదిలావుండగా గత వారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూపొందించిన అంచనా బడ్జెట్ రూ.7,937/- కోట్లకు కౌన్సిల్ ఆమోదించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా బల్దియాకు దాదాపు 5000వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. అధికారులు కోరినట్టు ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే జీహెచ్ఎంసీ అభివృద్ధిపథంలో ముందుకెళుంది లేదంటే తిరిగి పీకల్లోతు అప్పుల్లోకి వెళ్లాసిందే.

17 లక్షలకు పైగా భవనాలు..

జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను పరిధిలోని భవనాలు రూ. 17 లక్షలకుపైగా ఉన్నాయి. ఏటా దాదాపు 20వేల వరకు కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఆ మేరకు ఆస్తిపన్ను రావడం లేదు. ఏటా రూ. 1900 కోట్ల మేర ఆదాయం కష్టంగా రాబడుతున్నారు. వాస్తవానికి రూ. 2500 కోట్ల మేర రావాల్సి ఉన్నదని అంచనా వేశారు. భవనాలను పూర్తిస్థాయిలో జీహెచ్ ఎంసీ రికార్డులోకి తీసుకొస్తే భారీగా ఆదాయం సమకూరుతుంది.

జీహెచ్ఎంసీ అప్పులు (రూ.కోట్లలో)

ఎస్ఆర్ డీపీ	రూ.3755-00 కోట్లు
బాండ్ల ద్వారా	రూ. 495-00 కోట్లు
సీఆర్ఎంపీ	రూ.1460-00 కోట్లు
ఎస్ఎన్ డీపీ	రూ. 680-00 కోట్లు
హౌడ్కో నుంచి రుణంగా	రూ. 140-00 కోట్లు
మొత్తం అప్పులు	రూ.6530-00 కోట్లు

ఆర్థిక సంవత్సరాల వారీగా చేసిన అప్పులు

2018-19	రూ.586-00 కోట్లు
2019-20	రూ.843-00 కోట్లు
2020-21	రూ.1275-00 కోట్లు
2021-22	రూ.1275-00 కోట్లు
2022-23	రూ.1325-00 కోట్లు
2023-24	రూ. 573-00 కోట్లు

ఏటా రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి చెల్లించాల్సినవి

ప్రొఫెషనల్ ట్యాక్స్	రూ.300-00 కోట్లు
ప్రాపర్టీ ట్యాక్స్	రూ.107-00 కోట్లు
మ్యూటేషన్	రూ.175-00 కోట్లు
స్టాంప్స్. డ్యూటీ	రూ.2950-00 కోట్లు

కదిరే కృష్ణ పై చికోటి ప్రవీణ్ ఫిర్యాదు

నవతెలంగాణ-బంజారాహిల్స్.



శ్రీ వెంకటేశ్వర స్వామి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కదిరే కృష్ణ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త చికోటి ప్రవీణ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా కదిరే కృష్ణ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అనుచిత వ్యాఖ్యలతో పోస్టులూ పెడుతున్నారని సోమవారం ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన రాజకీయ లబ్ధి కోసం ఇతర మతస్థుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కదిరేపై మండిపడ్డారు. పోలీసులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. కదిరే తీరు మార్చుకోకపోతే ధర్మరక్షకుల దాడులకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

వికలాంగ పిల్లల మెరుగైన భవిష్యత్తుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ స్కూల్ ఆలియాలో భవిత కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వికలాంగ పిల్లల సుస్థిరమైన భవిష్యత్తు నిర్మించడానికి కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా తీసుకొని కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం నాంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆలియాలో తెలంగాణ నిర్మాణ సంస్థ, బోష్ ఆధ్వర్యంలో పునరుద్ధరింపబడిన భవిత కేంద్రాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగ పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు, సుస్థిర భవిష్యత్తు చేయడానికి సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు కృషి చేయాలన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సమానత్వం, గౌరవం అందించడం చాలా ముఖ్యమని.. దాని కోసం మనం అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. వికలాంగ పిల్లలకు సహాయ చేయడానికి ముందుకు వస్తున్న నిర్మాన్ సంస్థ, బోష్ వారి కృషికి అభినందనలు తెలియజేశారు. సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్, తెలంగాణ నిర్మాణ్ సంస్థ, బోష్ కృషి ఫలితంగా నగరంలోని 18 భవితా కేంద్రాలు విజయవంతంగా పునరుద్ధరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 450 మంది వికలాంగ పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టులో ఎనిమిది కొత్త టాయిలెట్ గదుల నిర్మాణం, ర్యాంపులు, తదితర వాటిని పునర్ ఆవిష్కరణ చేశారు. మరో మూడు భవితా కేంద్రాలకు విజయవంతగా పెయింటింగ్, మరమ్మతులు చేయించారు. బోష్ కంపెనీ సహాయం ద్వారా అవసరమైన పరికరాలు, పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా డీఈవో ఆర్. రోహిణి, టీఎస్ఐజీ బోష్ సీనియర్ లీడర్స్ అంజాద్ ఖాన్ పటాన్, కార్పొరేటర్ సురేఖ, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐవోఎస్ విశ్వనాథ్ గుప్తా, తాసిల్దార్ ప్రేమ్ కుమార్, సీఎస్ఆర్ కమిటీ సెక్రటరీ శిల్పా దేవధర్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆరు జోన్లలో 81 దరఖాస్తులు

- కూకట్ పల్లి జోన్‌లో అత్యధికంగా 42 దరఖాస్తులు
- సత్వర పరిష్కారం పై దృష్టి సారించాలి
- కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ఆమ్రపాలి గ్రేటర్ నలుమూలల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాప్యం లేకుండా ప్రజావాణిలో వచ్చిన విన్నపాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చిన కొందరు అర్జీదారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరగా, లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించేది జిల్లా కలెక్టర్ మాత్రమేనని ఆమె వచ్చిన అర్జి దారులకు వివరించారు. జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 32 విన్నపాలు రాగా, టెలిఫోన్ ద్వారా మరో 11 విన్నపాలు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో 15 టౌన్ ప్లానింగ్, ట్రాన్స్పోర్ట్ ఒకటి, సివిట/రెవెన్యూ 2, సీఎం అండ్ హెచ్ఓ 2, స్పోర్ట్స్ 2, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ 3, వెటర్నరీ 2, హెచ్ఎండబ్ల్యు ఎస్ఎస్‌బీ 2, ఎస్టేట్స్ ఒకటి, హౌసింగ్ 2 విన్నపాలు వచ్చినట్లు తెలిపారు. టెలిఫోన్ ద్వారా 11 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. ఆరు జోన్లలో మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో అత్యధికంగా 42 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా శేరిలింగంపల్లి 20, చార్మినార్ 8, సికింద్రాబాద్ 7, ఎల్బీనగర్ ఒకటి, ఖైరతాబాద్ 3 విన్నపాలు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శ్రీవాస్తవ, నళిని పద్మావతి, సత్యనారాయణ, చంద్రకాంత్ రెడ్డి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, సీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, ఎస్ఎన్‌డీపీసీ ఈ కోటేశ్వరరావు, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, హౌసింగ్, ఎస్ఈ, ఇంజినీరింగ్ డిప్యూటీ సీఈ, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరరహిత సమాజమే ధ్యేయంగా పనిచేయాలి



- సైకిలింగ్, ఫుట్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలి
- సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలి
- రాచకొండ సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేరరహిత సమాజమే ధ్యేయంగా పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాయంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సీపీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ పరిధిలో జరిగే నేరాలను అరికట్టాలని, నేరస్తులను పట్టుకోవటంలో, నేరపరిశోధనలో, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని ఆదేశించారు. రాచకొండ పరిధిలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లు, భూ కబ్జాదారుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారు తిరిగి నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తమ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని, విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని, ఫుట్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, సైకిల్ ద్వారా కూడా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు తమ పరిధిలో ఉండే స్టేషన్లను క్రమం తప్పకుండా చెక్ చేయాలన్నారు. సమర్థవంతంగా పనిచేసే అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ప్రత్యేక నైపుణ్యం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ఆయా విభాగాల్లో పని చేసేందుకు అవకాశం ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా సివిల్ వివాదాలలో పోలీసులు పాల్గొనకూడదన్నారు. తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని, చట్టపరిధిలోనే పనిచేయాలని, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలన్నారు. త్వరితగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని, నేరస్తులకు గరిష్ఠశిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టాలని, సైబర్ నేరస్తులను కట్టడి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల ద్వారా బాధితులు కోల్పోయిన డబ్బు మొత్తం రికవరీ అయ్యేలా పని చేయాలని సూచించారు. షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీపీ యాదాద్రి రాజేష్ చంద్ర, డీసీపీ ఎల్.బీ నగర్ ప్రవీణ్ కుమార్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ క్రైం అరవింద్ బాబు, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాశరథి కృష్ణమాచారి జయంతి వేడుకలు

నవతెలంగాణ-కాప్రా



దాశరథి కృష్ణమాచారి శత జయంతి ఉత్సవాల ప్రారంభం , ప్రముఖ స్వాతంత్ర పోరాట యోధురాలు , ప్రముఖ సంఘ సంస్కర్త ముత్తు లక్ష్మి రెడ్డి వర్ధంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో సంస్మరణ సభ జరిగింది. సభకు స్ఫూర్తి గ్రూపు బాధ్యులు జంపాల శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. దాశరథి కృష్ణమాచార్యులు చిత్రపటానికి ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు కేకే ప్రసాద్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముత్తు లక్ష్మీ రెడ్డి చిత్రపటానికి శోభ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ ముత్తు లక్ష్మీ రెడ్డి అణగారిన వర్గాల నుండి వచ్చి స్వాతంత్రోద్యమంలో ముందు పీఠిన నిలబడినటువంటి గొప్ప నాయకురాలు. అన్నారు. అంతేకాకుండా స్త్రీ హక్కుల కోసం ముందుండి పోరాడారన్నారు. వారి పోరాట స్ఫూర్తిని మనందరం ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రముఖ విద్యావేత్త జయప్రకాష్ మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచారి తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారని.. ఆ తర్వాత సినీ పరిశ్రమలో అనేక గీతాలు రాసి ఇప్పటికీ చిరస్మరణీయంగా ఉన్నారని చెప్పారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవటం వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లటం మన కర్తవ్యం అని చెప్పారు. గిరీష్, శోభ, గౌస్య, శ్రీనివాసరావు, జి శివరామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంసీసీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎండీ అశోక్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ (ఎంసీసీ)ని ఎండీ అశోక్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారుల నుంచి వస్తున్న కాల్స్, స్పందనను ఆయన పరిశీలించారు. అందుకోసం స్వయంగా కొందరు వినియోగదారులతో మాట్లాడారు. కాల్ రికార్డింగ్స్ విన్నారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, రోడ్డుపై సిల్ట్, మ్యాన్ హోల్స్, నో వాటర్, లో ప్రెజర్ ఫిర్యాదులు వచ్చాయి. వినియోగదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారులకు సమాచారం అందించాలని ఎండీ ఆదేశించారు. మొత్తం 5514 ఫీడ్ బ్యాక్ కాల్స్ తీసుకోగా అందులో 3 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. 14 శాతం మంది సమస్యను పరిష్కరించకుండానే సమస్య పరిష్కారమైనట్టు చెబుతున్నారని ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. అలాంటి వాటి విషయంలో క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు వాటిని నేరుగా సందర్శించి పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. వినియోగదారులకు మంచి సేవలు అందించడంతో పాటు కస్టమర్ కేర్ సేవా కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనం చూపేందుకే తనిఖీ నిర్వహించామన్నారు. జూన్ నెలలో 1,30,899 మంది ట్యాంకర్లు బుక్ చేసుకోగా, 1,86,251 ట్రిప్పులు డెలివరీ చేశామని తెలిపారు. మొత్తం జూన్ నెలలో 75,555 ఫిర్యాదులు రాగా అందులో 75,496 సమస్యల్ని పరిష్కరించామన్నారు.

'కమ్యూనిటీ హాల్‌ను స్థానికులకు కేటాయించాలి'



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

యూసఫ్ గూడాలోని సర్కిల్-19 ఆఫీసులో డిప్యూటీ కమిషనర్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో టి.అంజయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శివ బస్తీ నాయకులతో కలిసి టి.అంజయ్య నగర్ ఫేస్-1 లో గత పదేండ్లుగా నిరుపయోగంగా ఉన్న జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో (ఫస్ట్ ఫ్లోర్‌లో) బస్తీ నివాసులు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు డిప్యూటీ కమిషనర్ అనుమతి కోరుతూ లేఖను అందించారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తానని చెప్పారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లిహిల్స్
మంగళవారం | జులై 23, 2024 | www.navatelangana.com

ప్రజావాణికి 108 దరఖాస్తులు

- అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటచారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతా లకు చెందిన 108 మంది దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరిం చాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో 108 అర్జీలు రాగా.. గృహ నిర్మాణ శాఖవి 73, ఎస్సీ డెవలప్‌మెంట్‌వి 4, జిల్లా ఉపాధి కల్పన 3, వికలాంగుల సంక్షేమ శాఖవి 4, సీపీవో 4, ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కదిరివన్, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మట్టిని పోయించారు...

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ఓయూ

నవతెలంగాణ ఎఫెక్ట్

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏ గ్రౌండ్‌లో ఇటీవలే ఖేలో ఇండియా నిధులతో నిర్మాణం చేసిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ లోకి వాన నీరు రాకుండా ఓయూ బిల్డింగ్ డివిజన్ ఆధ్వర్యంలో ఇటీవలే స్టెప్స్ నిర్మాణం చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే కురిసిన వర్షాలకు మొత్తం స్టెప్స్ కింద, ప్రక్కన పోసిన మట్టి (మొరం) కొట్టుకుపోయింది. సుమారు రూ. 9 లక్షల వ్యయం తో నిర్మాణం చేసిన ఈ స్టెప్స్ కింద ఇలా మట్టి కొట్టుకు పోవడం పై ఈ నెల 20న నవతెలంగాణ దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. దాంతో ఓయూ బిల్డింగ్ డివిజన్ అధికారులు స్పందించి ఆఘమేఘాల మీద స్టెప్స్ క్రింద కొట్టు పోయిన మట్టిని మళ్ళీ

ఓయూ లైబ్రరీలో కనీస సౌకర్యాలు కరువు



- వేధిస్తున్న మంచినీటి సమస్య.. పారిశుధ్య కార్మికులు, కమాటీల కొరత...
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- నిధులు విడుదలైనా పనులు ప్రారంభించని వైనం
- ఇటీవలే బాధ్యతలు స్వీకరించా.. త్వరలోనే పరిష్కారం : లైబ్రేరియన్ డా.ఆచాల మునిగల్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రరీ ఓయూ విద్యార్థుల ఉపాధికి, పోటీ పరీక్షల ప్రిపరేషన్ కు కేరాఫ్. ఈ లైబ్రేరీలో మూడు ఫ్లోర్లు, ఏడు రీడింగ్ హాళు ఉన్నాయి. సుమారు 1000 నుండి 1200 మంది విద్యార్థులు ప్రిపరేషన్ కావడానికి ఇది వేదిక. అలాంటి కనీస సౌకర్యాలు ముఖ్యంగా వాటర్ (డ్రింకింగ్ వాటర్), బాతురూమ్‌లలో నీరు లేక ఇక్కడ ప్రిపేరేషన్ అవుతున్న విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు.

తీవ్రమైన మంచినీటి ఎద్దడి

లైబ్రరీ అవసరాల కోసం మంజీరా నీరు ఉపయోగిస్తారు అందులో కొంత నీరు టాయిలెట్స్ కోసం ఉపయోగిస్తే ,మిగతా నీరు తాగునీటి కోసం వాడుతున్నారు. కనీసం ఇన్ని రోజులు అవుతున్నా ఇంత మంది ఇబ్బందులకు గురవుతున్నా కనీసం తగిన సంఖ్యలో వాటర్ ప్యూరిఫైర్ కూడా అమర్చలేదు. ఆ మంజీరా నీరు తాగలేక చాలా మంది విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆర్‌ఓ ఏర్పాటు చేసి నాణ్యమైన మంచి నీరు అందించాలని ,ఉన్న మంచినీరు మధ్యాహ్నం వరకు సరిపోతుంది ఇక విద్యార్థులు గత్యంతరం లేక రూమ్స్ నుండి వాటర్ తీసుకుని వెళుతున్నారు.

అపరిశుభ్రత, దుర్వాసనతో మరుగుదొడ్లు

మధ్యాహ్నం దాటితే మరుగు దొడ్ల(టాయి లెట్స్)లో, నీరు రాని పరిస్థితి. టాయిలెట్స్‌లో ఫ్లషలు పనిచేయవు, పెద్ద డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచుతున్నారు. మధ్యాహ్నం తర్వాత వాటినే ఉపయోగించాల్సి వస్తున్నది. ఎక్కువగా విద్యార్థులు ఉపయోగిస్తున్న మిడిల్ ఫ్లోర్, మెదటి ఫ్లోర్‌లలో కలిపి కేవలం పురుషులకు 2, స్త్రీలకు 2 టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. వేల మంది ఉంటున్న లైబ్రరీలో తగిన సంఖ్యలో టాయిలెట్స్ లేక పోవడంతో రద్దీ ఎక్కువ ఉంటున్నదని.. వాటిని అధికంగా ఉపయోగించడం వల్ల త్వరగా అపరిశుభ్రత కు గురవుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. ఇక ఇన్ని టాయిలెట్స్ శుభ్రం చేయడానికి పారిశుధ్య కార్మికులు తగిన సంఖ్యలో లేక పోవడంతో ఉన్నవారికి కూడా తలకు మించిన భారంగా మారింది. మధ్యాహ్నం తరువాత ఇక్కడ పరిసరాల్లో దూరస్వన రెట్టింపు సంఖ్యలో వస్తోందని, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఒక విద్యార్థినీ జారీ పడి కాలు విరిగిన సంగతి తెలిసిందే. కమాటీలు కూడా తగిన సంఖ్యలో లేరని, ప్రిపేరేషన్‌కు వెళున్న విద్యార్థులు వాపోతున్నారు

800 అడుగులైనా పడని భూగర్భ జలాలు

నీళ్ల కోసం పలుమార్లు బోర్లు 800 అడుగులు వేసి భూగర్భ జలాలు పడకపోవడంతో మాజీ లైబ్రేరీయన్ డా.ఎ. ఎస్.చక్రవర్తి పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దాంతో పలుమార్లు బోర్లు ద్వారా నీటి కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. 800 అడుగులు బోర్లు వేసిన నీళ్లు పడక బోర్లు ఫెయిలయ్యాయి.

నిధులు మంజూరు చేసినా పనుల్లో జాప్యం ఎలా ?

ఇక్కడ విద్యార్థులు విన్నపం మేరకు ఓయు అధికారులు రూ. 9 లక్షల 41 వేల నిధులు విడుదల చేసినట్టు తెలిసింది. విడుదల చేసిన నిధులతో 20 వేల నీటి సామర్థ్యం గల వాటర్ సంపును ఏర్పాటు చేసి కామర్స్ కళాశాల బోర్ నుంచి నీటిని సరఫరా చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బాయ్స్ మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టటానికి రూ. 3 లక్షల నిధులు మంజూరు చేశారు. గతంలోనే గర్ల్స్ మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఓయూ ఇన్‌చార్జి ఐఏఎస్ ,కమిషన్ దాన కిషోర్ ప్రత్యేక చొరవతో ఒక అధునాతన సౌకర్యాలతో రీడింగ్ హాల్ నిర్మాణం కోసం నిధులు విడుదల చేశారని తెలిసింది.

ఇవి పరిశీలించగలరు...

ఇంకా విద్యార్థులు పీహెచ్డీ విద్యార్థులకు ప్రత్యేకంగా టేబుల్, చైర్ ఇవ్వాలని, లైబ్రరీలో ఖాళీగా ఉన్న రూమ్‌లల్లో నూతనంగా టేబుల్స్ , చైర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతు న్నారు. డ్రింకింగ్ వాటర్ , మరుగుదొడ్లలో నీరు అందు బాటులో ఉంచాలని, సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి శుభ్రంగా ఉంచాలంటున్నారు. రక్షణ దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రస్తుతం 3 షిఫ్ట్ లాలో లైబ్రరి విశేష సేవాలు అందజేస్తున్నది.

లైబ్రరీలో మౌలిక వసతులు కల్పించాలి



ఎందరో గొప్ప వారి విజయాలకు బాటలు వేసిన ఓయూ సెంట్రల్ లైబ్రరీ నేడు సమస్యలకు కేరాఫ్ గా నిలిచింది. వేలాది మంది విద్యార్థులు మౌలిక వసతులకు నోచుకోలేని దుస్థితి ఏర్పడింది. వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు కనీస మౌలిక వసతులు మంచినీరు, పరిశుభ్రమైన టాయిలెట్స్ వంటివి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు.తక్షణమే అధికారులు చొరవ తీసు కుని లైబ్రరీలో మౌలిక వసతులు కల్పించాలి.

- సాయి కుమార్

పరిష్కారానికి కృషి చేస్తాను

ఇటీవలే నేను బాధ్యతలు చేపట్టా. అధికారులను ఇక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరాను. వాటర్ సమస్య ఉంది... పారిశుధ్య కార్మికులు, కమాటిలు తగిన సంఖ్యలో లేరు. పరిష్కరం కోసం కృషి చేస్తాను.

- లైబ్రేరియన్ డా.ఆచల మునిగల్



క్రీడల్లో సత్తా చాటిన గంగోత్రి విద్యార్థులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

చార్మినార్ ఛాలెంజ్ ఖేలో హైదరాబాద్ అథ్లెటిక్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో షేక్‌పేట దర్గాలోని గంగోత్రి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ఈ క్రీడల్లో రన్నింగ్‌లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ కన్నానాయుడు తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సర్వేశ్వర్‌రెడ్డి, పీఈటీ బి. రమేష్‌లు ప్రత్యేకంగా అభినందించారు.నగర వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో అండర్ 10 200 మీటర్స్ రన్‌లో 4వ తరగతికి చెందిన అంకిత్ కుమార్ మూడో స్థానంలో గెలుపొందగా, అండర్ 11 విభాగం 100 మీటర్ల రన్‌లో 6వ తరగతికి చెందిన ఎ. ప్రవీణ్ కుమార్, అండర్-12 కేటగిరిలో 100 మీటర్స్ రిలే రన్‌లో 5వ తరగతి కె. ధరహాస్, 6వ తరగతికి చెందిన డి. భగత్ చంద్ర, వి. సంతోష్, ఎ. ప్రవీణ్ పతకాలు సాదించినట్టు తెలిపారు. పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరు పతకాలు సాధించినట్టు తెలిపారు.



మురికివాడలు లేని నగరంగా హైదరాబాద్‌ను సీఎం తీర్చిదిద్దాలి

- ప్రొ. డాక్టర్ గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ పర్యాటక అభివృద్ధి కోసం మూసీ నది ప్రక్షాళన దిశగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా మురికివాడలో లేని నగరంగా తీర్చిదిదాద్దాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని 775 నోటిఫైడ్ మురికివాడలు, 2000 పైగా అన్ నోటిఫైడ్ మురికివాడల్లో, 30 లక్షలకు పైగా ప్రజలు జీవిస్తున్నారని.. చినుకు పడితే వారి బతుకులు అతలాకుతలం అవుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి పేదల ఓట్లే కారణమని, మురికివాడల్లో నివసిస్తున్నది పేదలని, వారందరికీ డబుల్ బెడ్ రూము ఇండ్లు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వారికి ఇల్లు కట్టించకుండా మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు వేస్తున్నదని, మరి మూసీ నది చుట్టూ ఉన్న ఈ మురికివాడల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సంపన్నులైన కులాలకు ఐదు ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ముఖ్యమంత్రి ప్రకటించారు కానీ పేదల గహ నిర్మాణం కోసం సెంటు భూమి కూడా ఇస్తానని ప్రకటించలేదని విమర్శించారు. తక్షణమే మురికివాడల్లో విద్య వైద్యము ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారికి స్థిర నివాసాలు తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పేదల పక్షాన పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- ఓయూ జేఏసీ కోఆర్డినేటర్,

జాతీయ మాలల ఐక్య వేదిక నేత ఎం. రాహుల్

నవతెలంగాణ-ఓయూ



గొప్ప తెలంగాణ ఉద్యమకారుడు చెన్నూరు శాసనసభ సభ్యులు గడ్డం వివేక్ కి మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని ఓయూ జేఏసీ కోఆర్డినేటర్, జాతీయ మాలల ఐక్య వేదిక నేత ఎం. రాహుల్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెం టులో తెలంగాణ బిల్లు గురించి రెండు రోజులు నిరాహార దీక్షల చేసిన వ్యక్తి.. అందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాడానికి కషి చేసిన వ్యక్తి వివేక్ అన్నారు. అలాగే కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాలా మందికి సహాయ సహకారాలు చేస్తూ, జ్యోతి భాపూలే, అంబేద్కర్ ఆలోచన లను ముందుకు తీసుకుపోతున్న గొప్ప నాయకుడు వివేక్ అని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో గడ్డం వివేక్‌కు మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌతమ్,లక్ష్మణ్,కిరణ్ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ తక్షణమే క్షమాపణ చెప్పాలి



- మాజీ బ్యూరోక్రాట్ బాలలత

నవతెలంగాణ - బంజారా హిల్స్



వికలాంగులను అవమానపరిచేలా ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్ తమ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని మాజీ బ్యూరో క్రాట్, దివ్యాంగురాలు మల్లవరపు బాలలత డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలభారత దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావుతో కలిసి ఆమె మాట్లాడారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంత రకరమన్నారు. యావత్ వికలాంగ సమాజాన్ని కించపరి చేలా ఎలా మాట్లాడుతారని మండిపడ్డారు. స్మితా వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే చర్యలకు ఉపక్రమిం చాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించాలని కోరారు. స్మితా 24 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు. పిడబ్ల్యుఓ సంధ్య మాట్లాడుతూ శరీర భాగాలపై వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, మానవత్వంతో ఆలోచించే స్థాయిలో ఉన్న వ్యక్తి సమాజానికి మెసేజ్‌లు ఏ రకంగా అందిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆమె వ్యాఖ్యలు వెనుకకు తీసుకోకపోతే నిరసనలో తాము భాగస్వాములమవుతావని తెలిపారు. కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్మితా సబర్వాల్ అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ సైతం కొరతామని అన్నారు.ఈ కార్యక్రమంలో వికలాంగురాలు వసుంధర, శ్రీనివాస్, భూమిక మాసపత్రిక నిర్వాహకురాలు సత్యవతి, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్ష ఫీజులను తగ్గించాలి

- ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్యలు



నవతెలంగాణ-ఓయూ

అధికంగా పెంచిన ఎల్.ఎల్.బి సెమిస్టర్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్యలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం ఓయూ ఓఎస్డి ప్రో. రెడ్యానాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రూ. 1230/- సెమిస్టర్ పరీక్ష ఫీజు ను ప్రస్తుతం రూ. 1550/- కు పెంచారని, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును రూ. 350/- నుండి రూ. 950/- వరకు పెంచారని ఇలా పెంచడం వల్ల లా విద్యను అభ్యసించే పేద గ్రామీణ వర్గాల విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. యూనివర్సిటీలో చదువుకునేది అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద వర్గాలేనని.. అలాంటిది యూనివర్సిటీలలో అడ్డగోలుగా ఫీజులు పెంచడం అంటే వారిని యూనివర్సిటీలకు, ఉన్నత చదువులకు దూరం చేయడమే అన్నారు. ప్రతి సెమిస్టర్‌కూ ఫీజులను పెంచుతూ విద్యార్థులపై భారం మోపకుండా తక్షణమే పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని తద్వారా విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లా కాలేజ్ విద్యార్థులు బసవరాజు, దామోదర్, రవి,యశ్వన్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జిల నియామకం

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఏర్పడిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జిలను సోమవారం సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ప్రకటిం చారు. 1) మహబూబ్‌నగర్-విష్ణువర్ధన్ గౌడ్,2) ఖమ్మం- రడం సురేష్, 3) వరంగల్-గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి,4) నల్గొండ-దేవి రెడ్డి విజయ్,5) మెదక్-కుమార్ సాగర్,6) నిజామాబాద్ -శ్రీనివాస్ గౌడ్,7) ఆదిలాబాద్-శ్రవణ్ నాయక్,8) హైదరాబాద్-శివ గౌడ్,9) రంగారెడ్డి -సంజయ్ గౌడ్,10) కరీంనగర్-పాలెపు దిలీప్, కోఆర్డినేటర్లు ఈ. ఉపేందర్, ఎస్ కె రహీం నియమితులయ్యారు.

మహంకాళి ఆలయంలో ఘనంగా రంగం





నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో రంగం కార్యక్రమం సోమవారం ఘనంగా ఈ కార్యక్రమంలో అమ్మవారి ఎదురుగా పచ్చి కుండపై నిలుచుని స్వర్ణలత మాట్లాడారు. "ఈ ఏడాది పూజలు సంతోషంగా ఆనందంగా అందుకున్నాను. ఎవరికి ఏ ఆటంకం లేకుండా చూసుకున్నాను. ఏ బోనం అయినా, ఎవరు ఎత్తుకొచ్చినా పర్వాలేదు. సంతోషంగా అందుకునేది నేనే. వాళ్ళు వీళ్ళే తేవాలని సందేహం పెట్టుకోకండి. ఎవరు తెచ్చినా సంతోషంగా అందుకునే బాధ్యత నాది కోరినంత వర్షాలు ఉంటాయి. మంచిగా చూసుకుంటాను. నా దర్శనం చేసుకోవాలంటే ఆ మాత్రం కష్టపడాలి. లేదంటే సోమరి పోతులు అవుతారు. నా రూపం పెట్టాలి అనుకుంటున్నారు కదా .. పెట్టండి. ఎవరు ఏం చేసినా, ఎవరెంత అడ్డుపడిన నా రూపం నేను శాశ్వతంగా పెట్టించుకుంటాను. తప్పని సరిగా నా రూపాన్ని నేను నిలబెట్టుకుంటా. నా గ్రామ ప్రజలు అందరికీ నేను సంతోషంగా ఉండటానికి సాక పెడుతున్నారు. ఈ సారి కూడా 5 వారాలు పప్పు బెల్లలతో సాక పెట్టండి..పాడి పంటలు ఇదివరకు లాగా పండించడం లేదు. మందులు ఎక్కువ వాడుతున్నారు. అందుకే అనారోగ్యం. వాటిని తగ్గించుకుంటే మీకు వ్యాధులు తగ్గుతాయి. బలి ఇవ్వడం లేదు మీకు నచ్చింది ఇస్తున్నారు. కానీ దానితోనే సంతోష పడుతున్నాను. సంతోషంగా ఘనంగా పూజలు అందుకున్నాను' అని వివరించారు.



అధికార యంత్రాంగం సహకారానికి కృతజ్ఞతలు



- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-బేగంపేట

బోనాల జాతర విజయవంతం పై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ధన్యవాదాలు తెలియ జేశారు. బోనాల విజయవంతంలో దేవాదాయ శాఖ, పోలీస్, ఫైర్ ,ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర శాఖల అధికారుల సహకారం తో విజయవంతమైందని వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నా రు. అధికారుల సహకారంతోపాటు ప్రజల సహకారం కూడా తోడవడంతో జాతర విజయవంతమైందన్నారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో సోమవారం జరిగిన రంగం భవిష్యవాణి కార్యక్రమంలో అమ్మవారు రాష్ట్రంలో పాడిపంటలు పుష్కలంగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆశీర్వదించారని వ్యవసాయంలో మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని చేసినట్టయితే రాష్ట్రంలో రోగాలు లేకుండా ఉంటాయని తెలియజేశారని తెలిపారు. జూలై 28న లాల్ దర్వాజా బోనాలు జరుగుతాయి అన్నారు. ఆషాఢమాస బోనాలు అంగరంగ వైభవంగా ప్రారంభమై ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. గోల్కొండ బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి బోనాలు ,రంగం,అంబారీ పై అమ్మా వారి ఊరేగింపు కార్యక్రమాలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని, సహకరించిన ప్రజలకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కోట నీలిమ ,పవన్ ఖేరా ఆలయ అధికారులు వున్నారు.

బోనాల జాతరలో దొంగల చేతి వాటం...

బోనాల ఉత్సవాల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బోనాల జాతర విధులకు వచ్చిన ఓ ఎస్ఐ బైక్‌తో సహా మరో ద్విచక్రవాహనం, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు చోరీ చేశారు. మహంకాళి, మోండా మార్కెట్ పోలీసు స్టేషన్ల పరిధి లోని బోనాల క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో భక్తుల నుంచి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు, నగదు, సుమారు 25 సెల్‌ఫోన్లు ,రెండు ద్వి చక్రవాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆదివారం అమ్మవారి దర్శన కోసం క్యూలైన్ లో ఉన్న ఓ మహిళ చేతి గాజు నుంచి ఒకటిన్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. అలాగే ఓ రిపోర్టర్ తన భార్యతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బయటకు రాగా అతని భార్య సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. మరో రిపోర్టర్ ఆలయంలోకి వెళ్లి భక్తుల రద్దీని పరిశీలిస్తుండగా అతని జేబులో ఉన్న రూ.4వేలు తస్కరించార ు.కాగా సోమవారం అంబారీ ఊరేగింపు, పలహార బండ్ల ఊరేగింపులో కూడా దొంగలు చేతివాటం ప్రదర్శించారు. 25 సెల్‌ఫోన్లు తస్కరించారు. రెండు రోజుల వ్యవధిలో ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు , 25 సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లు చోరీకి గురయినట్టు బాధితులు మహంకాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





ఎక్వేరియంపై రేతి కుమారికి చిన్నప్పటి నుంచి అమితమైన అభిరుచి ఉండేది. ఆ అభిరుచే ఆమెను ఎక్వేరియం చేపల వ్యాపార వేత్తగా మార్చింది. విజయం దిశగా ప్రయాణించేలా చేసింది. ఆ వ్యాపారం ద్వారా ఇంటి నుంచే ఇప్పుడు ఆమె నెలకు రూ.50వేల వరకూ సంపాదిస్తున్నది. ఈ రంగానికి ఆమె చేసిన విశేషమైన సహకారానికి గాను.. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), సహా పలు సంస్థల నుంచి గుర్తింపు పొందింది. టీచర్ నుంచి వ్యాపారవేత్తగా మారిన ఆమె ప్రయాణం నేటి మానవిలో...

చిన్ననాటి కలను నిజం చేసుకుంటూ..

కేరళలోని అలప్పుజ జిల్లాలోని ఒనాట్టుకరకు చెందిన రేతి కుమారి.. కెమిస్ట్రీ టీచర్. 15 ఏండ్లపాటు అధ్యాపక వృత్తిని కొనసాగించింది. కుటుంబ బాధ్యతల కారణంగా 2017లో ఉద్యోగాన్ని వదలాల్సి వచ్చింది. ఇంట్లో ఖాళీగా ఉండటం నచ్చక తన చిన్ననాటి కలను నిజం చేసుకోవాలనుకుంది. తన చిరకాల అభిరుచి ఎక్వేరియంపై దృష్టి పెట్టింది.

పెద్ద మార్పు

చిన్న గాజు బౌల్‌లో.. గప్పీ చేపలతో మొదలైన ఆమె ప్రయాణం.. 2019 నాటికి పూర్తి స్థాయి వృత్తిగా మార్చుకుంది. చిన్న ఫ్రిజ్ బాక్స్‌ల నుంచి ప్రత్యేక చేపల ట్యాంక్‌కు మారింది. చేపల పెంపకం విస్తరించడంతో, ఇరుగుపొరుగువారు ఆమె వద్ద చేపలను కొనుక్కోవటం ప్రారంభించారు. ఆమెకు వృత్తిగా మారటానికి ఇదే పునాది. 'తొలుత.. నేను రెండు జాతుల చేపలతో మాత్రమే అక్వేరియం ప్రారంభించాను. ఇప్పుడు నా దగ్గర ఐదు జాతులు... గుప్పీ ఫిష్, ఏంజెల్‌ఫిష్, సిచ్లిడ్, సియామీస్ ఫైటింగ్ ఫిష్, కోయికార్ప్ ఫిష్ ఉన్నాయి. మొదట్లో వీటి పెంపకం సవాలుగానే ఉండేది. శిక్షణ తీసుకోవటం, పట్టువదలకుండా ప్రయత్నం చేయటంవల్లే ఇది సాధ్యమైంది' అని రేతి గుర్తుచేసుకున్నారు.

శిక్షణ ఇలా..

2022లో, కేరళ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (కేఐఈడీ)లో 10 రోజుల శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. అదే సంవత్సరం.. ఆక్వాకల్చర్, ఫిషరీస్ సెక్టార్‌లో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్ఎఫ్‌డీబీ–హైదరాబాద్) స్పాన్సర్ చేసిన శిక్షణా కార్యక్రమానికీ ఆమె హాజరయ్యారు. పది రోజులపాటు శిక్షణ పొందారు. అక్కడ చేపల పెంపకంలో పద్ధతులు, మార్కెటింగ్ గురించి మరింత తెలుసుకునే అవకాశం లభించింది. అంతేకాదు ఎక్వేరియం నిర్వహణలో మరింత నాలెడ్జ్ సంపాదించారు. దాంతో ఆమెకు విశ్వాసం, ఆసక్తి మరింత పెరిగింది.

ప్రభుత్వ మద్దతు... ప్రాజెక్ట్ విస్తరణ

2022, 2023 మధ్య, కేరళ ప్రభుత్వం చేపట్టిన మీడియం స్కేల్ ఆర్నమెంటల్ ఫిష్ పెంపకం యూనిట్ (మెరైన్ అండ్ ఫ్రెష్ వాటర్ ఫిష్) అనే ప్రాజెక్ట్‌ను రేతి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ కోసం రేతి రూ.8 లక్షలు రుణం తీసుకున్నారు. తరువాత.. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద తన ప్రాజెక్ట్ కోసం 60 శాతం సబ్సిడీని పొందారు.

మత్స్య పారిశ్రామికవేత్తగా..

2024లో సీఎంఎఫ్ఆర్ఐ ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రేతి అత్యుత్తమ మత్స్య పారిశ్రామికవేత్తగా సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని అందుకున్నారు. అదే ఏడాదిలో ఉత్తమ ఎక్వేరియం చేపల పారిశ్రామికవేత్తగా ముత్తుకులం బ్లాక్ పంచాయతీ ఆమెను సత్కరించింది. ప్రస్తుతం, ఆమె 50,000 లీటర్ల ట్యాంక్‌ను నిర్వహిస్తున్నారు. ఇది ఆమె ఎదుగుదల, అంకితభావానికి నిదర్శనం. స్థానిక పరిశోధనల ఆధారంగా తాను చేపల జాతులను ఎంపిక చేసుకోవటంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. వ్యాధుల బారినపడని, వాతావరణ ఒత్తిడికి తట్టుకోగల వాటిని ఎంపిక చేసుకుంటున్నానని చెప్పారు.

అధునాతన సాంకేతికత, మార్కెట్ వ్యూహం

తన మొదటి జాతి చేపలకు 'డియర్ గప్పీ' అని పేరు పెట్టారు. నీటి రీసైక్లింగ్ కోసం ఆధునిక సాంకేతికతగల బయోఫిల్టర్‌లను వాడుతున్నారు. రిటైల్ కంటే టోకు అమ్మకాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఆమె ఒకేసారి 5,000 నుంచి 10,000 చేపల వరకూ విక్రయించే స్థాయికి ఎదిగారు. కొరియర్ సేవలనూ అందిస్తున్నారు. ఒక్క కేరళలోనే కాదు.. కర్నాటక వరకూ చేపల డెలివరీని చేస్తున్నారు. ఈ ఎక్వేరియం చేపల అమ్మకం ద్వారా ఏడాదికి రూ.ఆరు లక్షల వరకూ ఆర్జిస్తున్నారు.

ఔత్సాహికులకు సలహా

సాంకేతికత వినియోగంపై సరైన శిక్షణ పొందడం, నీటి నాణ్యతను పర్యవేక్షించడం, ఎక్వేరియంను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలనీ, వ్యాధుల బారినపడిన చేపలను వెంటనే తొలగించాలనీ, ఎక్వేరియం నిర్వహణకు ఈ పద్ధతులు అవసరమని ఆమె సలహా ఇస్తున్నారు.



కెమిస్ట్రీ టీచర్‌గా మొదలై... ఇప్పుడు ఎక్వేరియం చేపల పెంపకందారుగా రేతి కుమారి ప్రయాణం విజయవంతంగా సాగుతున్నది. అభిరుచిని వ్యాపారంగా మార్చుకుని విజయ పరంపర కొనసాగిస్తున్న ఆమె ప్రయాణం ఆదర్శనీయం. కలలను సాకారం చేసుకోవటానికి... అనుకున్న పనిలో ఎన్ని సవాళ్లు ఎదురైనా.. సంకల్పంతో కొనసాగిస్తే విజయం వరిస్తుందనటానికి ఆమె ప్రయాణం ప్రేరణగా నిలుస్తున్నది.

కె. లలిత



వెన్నునొప్పికి ఇలా చెక్...

పురుషులతో పోల్చితే మహిళల శరీరం కాస్త సున్నితంగా ఉంటుంది. అందుకే మహిళలు త్వరగా అనారోగ్యానికి గురవుతుంటారు. రుతక్రమం మొదలు శరీరంలో తలెత్తే హార్మోన్ల మార్పుల కారణంగా కూడా అనారోగ్య సమస్యలు వెంటాడుతుంటాయి. ఇక స్త్రీల్లో సర్వసాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యల్లో వెన్నునొప్పి ఒకటి. ఇందుకు గల కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- మహిళలు వంగి కూర్చొని పనులు ఎక్కువగా చేస్తుంటారు. ఈ కారణంగానే శరీరపు వెనుక కండరాలు నొప్పిని కలిగిస్తాయి.
- పీరియడ్స్ సమయంలోనూ నడుము నొప్పి అధికంగా ఉంటుంది. అలాగే పొత్తి కడుపులో నొప్పి, మానసిక ఆందోళన సమస్యలు వంటివి వెంటాడుతుంటాయి. ఇలాంటి స్థితిని ప్రీమెన్‌స్ట్రల్ సిండ్రోమ్‌గా చెబుతుంటారు.
- కొందరు మహిళల్లో కిడ్నీ సమస్యల కారణంగా కూడా వెన్ను నొప్పి



వస్తుంది. దీనిని పైలోనెఫ్రిటిస్ అని పిలుస్తారు. ఈ సమస్య ఉన్న మహిళల్లో పొత్తికడుపు నొప్పి, వెన్నునొప్పి వేధిస్తుంది. దీంతో తరచూ మూత్రం రావడం, జ్వరం వంటి సమస్యలు సైతం వస్తాయి.
- మహిళల్లో నడుము నొప్పి రావడానికి మరో ప్రధాన కారణంలో ఎండోమెట్రియోసిస్ ఒకటి. ఇది స్త్రీ జననేంద్రియాలకు సంబంధించిన సమస్య. ఈ సమస్యతో దీర్ఘకాలిక వెన్నునొప్పి తలెత్తుతుంది. మరీ ముఖ్యంగా ఇది పీరియడ్స్ సమయంలో ఎక్కువవుతుంది.

నివారణ చర్యలు..

- మహిళల్లో వచ్చే వెన్నునొప్పి సమస్యకు చెక్ పెట్టడంలో వేడి నీరు ఉపయోగపడుతుంది. స్నానానికి వేడి నీటిని ఉపయోగించాలి. ఇలా చేయడంవల్ల కండరాలు రిలాక్స్ అయ్యి నొప్పి తగ్గుతుంది.
- 30 ఏండ్లు దాటిన తర్వాత మహిళలు ఒక్కసారిగా బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి బరువు విషయంలో స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో బరువు పెరగకుండా చూసుకోవాలి. ఇది కూడా వెన్నునొప్పికి ఒక కారణంగా చెబుతున్నారు.
- సీటింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలని ని చెబుతున్నారు. ఎక్కువసేపు కూర్చొని పనిచేసే సమయంలో సీటింగ్ పొజిషన్ సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.
- ఒకవేళ నొప్పి తట్టుకోలేని స్థాయిలో ఉంటే ఐస్ ప్యాక్‌తో మసాజ్ చేసుకోవాలని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కండరాలు రిలాక్స్ అయ్యి నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

అంగవైకల్యం శరీరానికే..

ప్రతిభకు కాదు

నవతెలంగాణ - ముషీరాబాద్

"అంగవైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదు.. వికలాంగుల రిజర్వేషన్లు రద్దు చేయాలన్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.. వికలాంగులకు ఆమె క్షమాపణ చెప్పాలి.." అని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. వికలాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలనే హక్కు స్మితా సబర్వాల్‌కు ఎక్కడిదని, వికలాంగులను కించపరిచేలా ట్విట్టర్లో పోస్ట్ పెట్టిన ఆమెపై చర్య తీసుకోవాలని అన్నారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ.. సీనియర్ ఐఏఎస్ అధికారినిగా ఉన్న సబర్వాల్.. కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లలో వికలాంగులకు రిజర్వేషన్స్ అవసరం లేదనడం ఆమె అహంకారానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగుల రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు తీర్పులు ఉన్నాయనే విషయం తెలియకుండా ఐఏఎస్ ఎలా అయ్యారని ప్రశ్నించారు. వికలాంగుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన స్మితా సబర్వాల్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. ప్రతిభ ఎవ్వరి సొత్తూ కాదని.. అంగవైకల్యం కలిగిన అనేక మంది సమాజంలో అద్భుతాలు సృష్టిస్తున్న విషయం గుర్తించుకోవాలని అన్నారు. వికలాంగుల హక్కుల చట్టం మార్గదర్శక సూత్రాలైన సమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా స్మితా సబర్వాల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారన్నారు. ముంబయికి చెందిన అంకాలజిస్ట్ డాక్టర్ సురేష్ అద్వానీ వికలాంగుడైనా వృత్తిలో విజయం సాధించిన విషయం గుర్తించాలన్నారు. లూయిస్ బ్రేయిలీ, స్టీఫెన్ హకింగ్, హెలెన్ కెల్లర్ వికలాంగులైనప్పటికీ సమాజం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. హిరసింఘాల్ అంగవైకల్యం ఉన్నా ఐఏఎస్ టాపర్‌గా నిలిచారన్నారు. వికలాంగుల ప్రతిభ గురించి ఏసీ రూములో కూర్చునే స్మితా సబర్వాల్‌కు ఏమి తెలుసన్నారు. వికలాంగులు ఐఏఎస్ అయితే ఫీల్డ్ వర్క్ చేయలేరనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఆమెపై 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం, సీఎస్ వెంటనే స్పందించి ఆమెపై చర్య తీసుకోవాలని, పోలీస్ ఉన్నతాధికారులు సుమోటగా కేసు నమోదు చేయాలని కోరారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి భిన్నంగా స్మితా సబర్వాల్ వ్యాఖ్యలున్నాయని అన్నారు. వికలాంగులు ఒంటరి కాదని, వారి జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత మాట్లాడుతూ.. వికలాంగులను అవమానించిన స్మితా సబర్వాల్ ఐఏఎస్‌గా కొనసాగడం దురదృష్టకరమన్నారు. వికలాంగులకు సామర్థ్యం తక్కువగా ఉంటుందని చెప్పడం ఆమె అవివేకానికి నిదర్శనం అని అన్నారు. స్మితా సబర్వాల్ మానసిక పరిస్థితిపై అనుమానం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఎన్‌పీఆర్‌డీ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు జగదీశ్, నాయకులు గంగమ్మ, రాజు, పవన్, నర్సింగ్, శంకర్ గౌడ్, శ్రీను, జాన్, యాకయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

నీట్ లీకేజీపై దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. పరీక్షా విధానంలో తప్పులు జరిగాయని అన్నారు. విద్యాశాఖ మంత్రి సమస్యను అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పనితీరు సమీక్షించుకోవడం మాని విమర్శిస్తే నిందిస్తున్నారని అన్నారు. దేశంలోని విద్యార్థులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మన పరీక్షల వ్యవస్థ లోపభూయిష్టంగా తయారైందనే ఆందోళన దేశవ్యాప్తంగా నెలకొందని అన్నారు. విద్యా వ్యవస్థ అంతా మోసపూరితమని లక్షలాది విద్యార్థులు భావిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులు డబ్బు చెల్లించి దేశ పరీక్షల వ్యవస్థను కొనుగోలు చేయవచ్చని విద్యార్థులు నమ్ముతున్నారని చెప్పారు. విద్యార్థుల్లో నెలకొన్న భావనే విపక్షం కూడా కలిగి ఉందని రాహుల్ వివరించారు. ఈ వ్యవహారంపై రోజంతా చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ఈ అంశంపై తమకు పూర్తి అవగాహన ఉందని, అనవసరంగా లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, తనకు సభలో రాహుల్ సర్టిఫికెట్ అవసరం లేదని, ప్రజలు తమపై విశ్వాసంతో అధికారం అప్పగించారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రకటన దురదృష్టకరమని తెలిపారు. రిమోట్‌గా ప్రభుత్వాన్ని నడిపే వారు ప్రకటనలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. వ్యవస్థను మెరుగుపరచడానికి సూచనలు ఇస్తే బాగుంటుందన్నారు. తన పర్యవేక్షణలో ఎక్కడా ప్రశ్నాపత్రాలు లీక్ కాలేదని తెలిపారు. గత ఏడేండ్ల కాలంలో పేపర్ లీక్ జరిగిన దాఖలాలు లేవని, ఎ న్టీఏ ఇప్పటి వరకు 240 పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందని అన్నారు. ప్రస్తుతం నీట్ లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీల విషయంలో ఈ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కొన్ని సెంటర్లలో 2 వేల మందికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ విద్యా శాఖ మంత్రిగా ఉన్నంతకాలం విద్యార్థులకు న్యాయం దక్కదన్నారు. కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ మాట్లాడుతూ ఏడేండ్లలో 70 సార్లు పేపర్ లీకైందని, నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు.

పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ "విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి ఉండాల్సింది. ఆయన సుప్రీంకోర్టు, ప్రధాని మోడీ గురించి మాట్లాడారు. అయితే దీనిపై ఏం చేస్తున్నారో చెప్పలేకపోయారు. నీట్ చాలా గొప్పది. యువతకు సంబంధించిన ముఖ్యమైన సమస్యపై మేము ఎప్పటినుంచో పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతున్నాం. ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉంటాం" అని అన్నారు.

ఉగ్ర గోదావరి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాద్రి వద్ద గోదారి ఉగ్రరూపాన్ని దాల్చి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులూ వంకలూ పొంగిపొర్లడంతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గంట గంటకు పెరుగుతున్న గోదావరిని చూసి లోతట్టు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండ్రోజులపాటు గోదావరి మరింత పెరిగే అవకాశాలున్నా యని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ క్షణం ఏ ఉప్పెనను ఎదురుకోవాల్సి వస్తుందోనని కంటిమీద కునుకు లేకుండా ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

నాలుగు రోజుల నుంచి క్రమక్రమంగా పెరుగుతున్న గోదావరి ఆదివారం సాయంత్రానికి 43 అడుగులను చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 48 అడుగులకు చేరుకుంది. దాంతో జల వనరుల శాఖ అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను అధికారికంగా జారీచేసి గోదావరి పరిసర ప్రాంతాన్ని హై అలర్ట్‌గా ప్రకటించారు. ఇదే తీరులో రాత్రి 7 గంటలకు 50 అడుగులకు చేరుకోగా ఏజెన్సీలోని అనేక ఆదివాసీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పట్టణంలో లోతట్టు ప్రాంత ప్రజలను తరలించేందుకు రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. పట్టణంలోని నన్నపనేని మోహన్ హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఆర్డీవో, ఐటీడీఏ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి హెల్ప్ డెస్క్‌ని ప్రజలకు అందుబాటులో ఉంచారు. మరోపక్క గోదావరి ప్రవాహాన్ని తిలకించేందుకు వస్తున్న సందర్శకులను కరకట్ట పరిసర ప్రాంతానికి రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అనుమతి లేకుండా వీడియోలు గాని, సెల్ఫీ ఫొటోలు గాని తీసినా, గోదావరి ప్రవాహం వద్ద దిగే ప్రయత్నం చేసినా.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

విలీన మండలాలకు నిలిచిన రాకపోకలు

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పూర్వపు భద్రాచలం డివిజన్‌లోని కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాలకు భద్రాచలం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. రాయనపేట, వెంకరెడ్డి పేట, నెల్లిపాక, మురుమూరు వద్ద జాతీయ రహదారిపై గోదారి నీరు చేరడంతో భద్రాచలం, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రయివేట్ వాహనాలను అధికారులు నిలిపివేశారు. ఇప్పటికే వీఆర్‌పురంలో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కూనవరం, చింతూరు మండలాల్లో సైతం ఆదివారం అర్ధరాత్రి వరద పెరిగిన నేపథ్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష అధికారులను అప్రమత్తం చేసి అర్ధరాత్రి ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించారు. కూనవరం మండలంలో అనేక ఏజెన్సీ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ముంపు బాధితులను నాటు పడవల్లో పునరావాస కేంద్రాలకు తరలించారు. చింతూరు మండలంలో సైతం ఇటు శబరి, పోటు గోదావరి ఉగ్రరూపానికి అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పోలవరం బ్యాక్ వాటర్‌తో విలీనం మండలాలకు ముంపు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమై స్థానికులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

చర్లలోని తాలి పేరు మధ్యతరహా ప్రాజెక్టు ఆదివారం వరకు ప్రమాదకర స్థాయిలో ప్రవహించగా.. సోమవారం క్రమేపీ తగ్గుతున్నది. అయినా ముందస్తు జాగ్రత్త కోసం అధికారులు ప్రాజెక్టు 25 గేట్లు పూర్తిగా ఎత్తి 45,362 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పాల్వంచ కిన్నెరసాని జలాశయం నిండుకుండను తలపిస్తోంది. డ్యామ్ సామర్థ్యం 407 అడుగులు కాగా.. సోమవారం సాయంత్రానికి 403 అడుగులకు చేరింది. మూడు గేట్లు ఎత్తిన డ్యామ్ అధికారులు దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేశారు. ఇన్ ఫ్లో 10 వేల క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 11 వేల క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు.

ఇక ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వోద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

1980 అక్టోబర్ 28 తేదీల్లో ఇచ్చిన ఆదేశాల్లో ఉన్న ఆర్ఎస్ఎస్ ప్రస్తావనను తొలగించాలని నిర్ణయించామని ప్రభుత్వం ఓ ఉత్తర్వులో తెలియజేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయం రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. ప్రభుత్వ, ప్రతిపక్ష నేతలు పరస్పరం విమర్శలు సంధించుకుంటున్నారు. 58 సంవత్సరాల క్రితం ఇందిరాగాంధీ ప్రభుత్వం జారీ చేసిన రాజ్యాంగవిరుద్ధ ఆదేశాలను మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకున్నదని బీజేపీ నేత అమిత్ మాల్వియా ధృవీకరించారు. '1966 నవంబర్ 7న పార్లమెంట్ వద్ద గోవధకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రదర్శన జరిగింది. దానికి ఆర్ఎస్ఎస్, అప్పటి జనసంఘ్ మద్దతు ఇచ్చాయి. ప్రజలను సమీకరించాయి. ఆ సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది చనిపోయారు. ఆర్ఎస్ఎస్-జనసంఘ్ పలుకుబడి పెరుగుతుండడంతో ఇందిరాగాంధీ కలవరపడ్డారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుతోద్యోగులు పాల్గొనరాదంటూ నిషేధం విధించారు' అని మాల్వియా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చెప్పుకొచ్చారు. కాగా ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ దీనిపై వివరణ ఇస్తూ 'గాంధీజీ హత్యానంతరం 1948 ఫిబ్రవరిలో సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. సత్ప్రవర్తనతో మెలగుతానని ఆర్ఎస్ఎస్ హామీ ఇవ్వడంతో ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. ఆ తర్వాత కూడా ఆర్ఎస్ఎస్ నాగపూర్‌లో ఎన్నడూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించలేదు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వోద్యోగులు పాల్గొనడంపై 1966లో నిషేధం విధించడం సరైన చర్యే. వాజ్‌పేయి హయాంలో కూడా నిషేధం కొనసాగింది. ఇప్పుడు దానిని ఎత్తివేశారు' అని ఎక్స్‌లో తెలిపారు. 'ఆర్ఎస్ఎస్‌పై విధించిన నిషేధాన్ని షరతులకు లోబడి ఎత్తివేసేందుకు సర్దార్ పటేల్ అంగీకరించారు. అప్పటికి, ఇప్పటికి ఏం మార్పు జరిగింది? ఆర్ఎస్ఎస్‌కు రాజకీయాలతో సంబంధం తగ్గిపోయిం దా?' అని కాంగ్రెస్‌కే చెందిన మరో సీనియర్ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు.

ప్రతిపక్షాలకు ప్రధాని సుద్దులు

(మొదటిపేజీ తరువాయి)

తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా" అని అన్నారు. " కానీ ప్రతిపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేకపోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 ఏండ్ల తర్వాత వరుసగా మూడోసారి ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం" అని మోడీ వ్యాఖ్యానించారు. "సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే ఐదేండ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేండ్లలో దేశం 8శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్టు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్" అని మోడీ పేర్కొన్నారు.

పాత జిల్లా సర్వీస్ మేరకే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాత జిల్లాల్లో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని 317 జీవో పరిధిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 317 జీవో క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఉద్యోగుల సర్వీస్, పదోన్నతి సమస్యలను పరిష్కారం కానున్నాయి. సబ్ కమిటీ చైర్మెన్, మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగింది. వివిధ శాఖలకు చెందిన పూర్తి సమాచారాన్ని వెంటనే సబ్ కమిటీకి సమర్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తొమ్మిది ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కమిటీ సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే గత రెండు అసెంబ్లీ సెషన్స్‌కు అనారోగ్యం, ఇతర కారణాల రీత్యా గైర్హాజరైన మాజీ సీఎం, ఇప్పుడు తొలిసారిగా సభలో అడుగు పెట్టినట్టవుతుంది. మరోవైపు అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు వీలుగా కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మంగళవారం ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

అందరి చూపు కేసీఆర్ వైపే..

ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ మీటింగుకు ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు కూడా హాజరు కావాలంటూ కేసీఆర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలు, ఆరు గ్యారెంటీలఅమలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, శాంతి భద్రతలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, రైతు రుణమాఫీపై ఆంక్షలు, రైతు భరోసా చెల్లింపులో జాప్యం, రైతులకు సంబంధించిన ఇతర సమస్యలు, పంచాయతీలు, పురపాలక సంఘాలకు నిధుల విడుదలలో ఆలస్యం, కుంటుపడిన ప్రజారోగ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తదితర ప్రజా సమస్యలను అసెంబ్లీలో ఏకరువు పెడతామంటూ బీఆర్ఎస్ ప్రకటించింది. దీంతోపాటు నియోజకవర్గాల్లో తమ పార్టీ ఎమ్మెల్యేల విషయంలో ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వాన్ని నిలేస్తామంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలివ్వాలి

పరీక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- హామీలు అమలు చేయాలంటూ కలెక్టరేట్ల ఎదుట ఆశాల ధర్నాలు
- 30న చలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరిక



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

"ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.. రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వాలి.. ఆశాలకు పరీక్ష పెట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి" అని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశాలు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలు, ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు.

మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ఆశాల ధర్నాలో జయలక్ష్మి మాట్లాడారు. గతంలో ఆశాలు 15రోజులపాటు సమ్మె చేసినప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే ఈ నెల 30న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్లి మున్సిపల్ పార్క్ దగ్గర ఆశాలు ధర్నా చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మహబూబాబాద్, హనుమకొండ, ములుగు జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, సంగారెడ్డిలో ఆశాలు ధర్నాలు చేశారు.

ఆదిలాబాద్‌లో ఆశాలు సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్‌లో ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రతినిధి బృందం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చింది. అనంతరం ఆశా వర్కర్ల వద్దకు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత వచ్చి మాట్లాడుతూ.. తమ పరిధిలో గల ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద ఆశా కార్యకర్తల ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇచ్చారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండల కేంద్రంలో మండల వైద్యాధికారికి వినతిపత్రం ఇచ్చారు. భువనగిరి యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ వెన్‌శాలోంకు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు పరిశీలిస్తాం

- పర్యాటక సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు
- జూకంటి జగన్నాథానికి దాశరథి పురస్కారం ప్రదానం
- రవీంద్రభారతిలో కృష్ణమాచార్య జయంతి



నవతెలంగాణ-కల్చరల్

దాశరథి కృష్ణమాచార్య పేరు మహబూబాబాద్ జిల్లాకు పెట్టే విషయమై సీఎంతో చర్చించి పరిశీలిస్తామని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ అస్తిత్వం.. స్వేచ్ఛ వాయువుల కోసం నైజాంకు వ్యతిరేకంగా కలంతోనే కాకుండా కార్యక్షేత్రంలోనూ ఎదురొడ్డి నిలిచి పోరాడిన గొప్ప వ్యక్తి దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికపై రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి తెలంగాణ రత్నమన్నారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలిసిందని.. వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కవులు, కళాకారులు మాత్రమే సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురాగలరని, తెలంగాణ తొలి మలి పోరాటాల్లో వారి పాత్ర మరువలేనిదని అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని తమ సాహిత్యంలో నింపిన జూకంటి జగన్నాథానికి దాశరథి పురస్కారం ప్రదానం చేయడం సముచితంగా ఉందన్నారు. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నిజాం రాజును తన కలంతో దులిపిన దాశరథిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం దాశరథి స్మారక పురస్కారాన్ని ప్రఖ్యాత సాహితీవేత్త జూకంటి జగన్నాథంకు మంత్రులు బహూకరించారు. రూ.లక్షా 1116, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. శాసన మండలి ఉప సభాపతి బండ ప్రకాష్, డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్న సభకు సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీప్రసాద్ స్వాగతం పలికారు.

భద్రాద్రి రామయ్యకు భారీగా ఆదాయం

- 40 రోజుల్లో కోటికిపైగా నగదు, బంగారం, వెండి అదనం
- హుండీలో విదేశీ డాలర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి 40 రోజుల్లో హుండీ ఆదాయం భారీగా చేకూరింది. గత నెల 12న రామయ్య హుండీని లెక్కించగా 40 రోజులనంతరం సోమవారం దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టారు. 40 రోజులకు గాను రూ.1,21,44,579 భక్తులు సమర్పించారు. బంగారం 104 గ్రాములు, వెండి 805 గ్రాములు ముడుపుల రూపంలో చెల్లించారు. అంతేకాకుండా విదేశీ నగదు సైతం రామయ్యకు భారీగా చేరింది. యూఎస్ డాలర్లు 183, మైమార్క్ కటాస్ 1000, కెనడా డాలర్స్ 50, నేపాల్ రుపీస్ 10, అరబ్ డాలర్స్ 20 హుండీలో వచ్చాయి. వచ్చిన నగదును మొత్తం భద్రాచలం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆలయ ఈవో రమాదేవి జమ చేశారు. లెక్కింపులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించామని ఆమె తెలిపారు.

మా బంధం వ్యక్తిగతం!

టీ20 కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యను కాదని సూర్యకుమార్ ఎంపిక. వన్డే జట్టులో సూర్యకుమార్, రవీంద్ర జడేజాకు చోటు లేకపోవటం. శ్రీలంక పర్యటనకు భారత జట్ల ఎంపికపై అభిమానులను విస్తుగొలిపేలా చేసిన నిర్ణయాలు ఇవి. సెలక్షన్ కమిటీ చైర్మెన్ అజిత్ అగార్కర్ ఎంపిక వెనుక కారణాలను తొలిసారి మీడియాకు వెల్లడించగా.. విరాట్ కోహ్లితో తన బంధం వ్యక్తిగతమని చీఫ్ కోచ్ గౌతం గంభీర్ వ్యాఖ్యానించాడు. శ్రీలంకతో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టు కొలంబో బయల్దేరింది.

- విరాట్ కోహ్లితో బంధంపై గౌతం గంభీర్
- అందుబాటులో ఉంటాడనే సూర్యకు కెప్టెన్సీ

చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టత

నవతెలంగాణ-ముంబయి

భారత క్రికెట్‌లో ఢిల్లీ బాయ్స్ విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ మైదానంలో భావోద్వేగాలను ఏమాత్రం నియంత్రణలో ఉంచుకోలేరు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కోహ్లి, గంభీర్ నడుమ జరిగిన కొన్ని సంఘటనలు సోషల్ మీడియాను ఊపేశాయి. భారత క్రికెట్ డ్రెస్సింగ్‌రూమ్‌లో విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ మరోసారి కలిసి పని చేసేందుకు రంగం సిద్ధమైంది. గౌతం గంభీర్ చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. విరాట్ కోహ్లితో తన బంధంపై మీడియాకు స్పష్టత ఇచ్చాడు. 'కోహ్లితో నా బంధం టీఆర్‌పీలు పెంచటం కోసం కాదు. గ్రౌండ్‌లో ప్రతి ఒక్కరు తమ జట్టు కోసం, విజయం కోసం పోరాడతారు. ఇప్పుడు కోహ్లి, నేను భారత జట్టు, 140 కోట్ల మంది అభిమానుల కోసం టీమ్ ఇండియాకు ప్రాతినిథ్యం వహిస్తున్నాం. ఇద్దరం మరింత కష్టపడి భారత్ గర్వపడే విజయాలు సాధిస్తామని భావిస్తున్నాను. కోహ్లితో వ్యక్తిగతంతో ఎన్నోసార్లు చాట్ చేశాను. ఆ విషయాలు బహిరంగం చేయాల్సిన అవసరం నాకు లేదు. మైదానం బయట కోహ్లితో గతంలో ఉన్నట్టే ఇప్పుడూ కొనసాగుతుంది' అని గౌతం గంభీర్ అన్నాడు. చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ సహాయక సిబ్బందిని ఎంచుకునే స్వేచ్ఛను బీసీసీఐ ఇచ్చినట్టు కనిపిస్తుంది. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు పని చేసిన అభిషేక్ నాయర్, రియాన్ టెన్‌లు అసిస్టెంట్ కోచ్‌లుగా నియమితులు కాగా.. ఫీల్డింగ్ కోచ్‌గా టి. దిలీప్ కొనసాగనున్నారు.



సూర్యకు ఆ అర్హత ఉంది : ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు హార్దిక్ పాండ్య వైస్ కెప్టెన్. రోహిత్ శర్మ గైర్హాజరీలో భారత ద్వైపాక్షిక సిరీస్‌లకు నాయకత్వం వహించిన అనుభవం సొంతం. అయినా, రోహిత్ శర్మ వారసుడిగా టీ20 ఫార్మాట్ పగ్గాలు హార్దిక్‌కు కాకుండా సూర్యకుమార్ యాదవ్‌కు దక్కాయి. 'టీ20 కెప్టెన్సీ నిర్ణయం తీసుకునేముందు హార్దిక్ పాండ్యతో మాట్లాడాను. అతడు జట్టుకు విలువైన ఆటగాడు. ఈ నిర్ణయంతో హార్దిక్ పని ఒత్తిడిని సైతం చూసుకున్నట్టు అవుతుంది. సూర్యకుమార్ యాదవ్‌కు మంచి క్రికెట్ జ్ఞానం ఉంది. ఏడాదికి పైగా జట్టుతో కొనసాగుతున్నాడు. డ్రెస్సింగ్‌రూమ్ అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుని సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్‌గా ఎంపిక చేశాం. నాయకుడు అందుబాటులో ఉండి అన్ని మ్యాచుల్లో ఆడేలా ఉండాలని భావించాం.

అందుకే సూర్యకుమార్ యాదవ్ వైపు మొగ్గుచూపాం. టీ20 సారథ్య పగ్గాలు అందుకునే అర్హతలు ఉన్నవారిలో సూర్యకుమార్ యాదవ్ సైతం ఉన్నారు. నాయకత్వ బాధ్యతల్లో సూర్యకుమార్ యాదవ్ ఏ విధంగా రాణిస్తాడనే విషయం చూడాలి. రవీంద్ర జడేజాకు పక్కనపెట్టాలి. టెస్టు జట్టుకు అతడు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలనే ఆలోచనతో సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మహ్మద్ షమి టెస్టు సీజన్ సమయానికి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఆశిస్తున్నాం. సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు సమయానికి మహ్మద్ షమి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఎన్‌సీఏ అంచనా వేసింది' అని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అన్నారు.

జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ షురూ

టాస్ వేసి ప్రారంభించిన సివి ఆనంద్, భరత్ రెడ్డి



హైదరాబాద్: కేఎస్‌జీ జర్నలిస్టు టీ20 ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. విజయానంద్ గ్రౌండ్‌లో జరిగిన ఆరంభ మ్యాచ్‌ను త్రుక్ష ఫుడ్స్ ఎండీ చల్లా భరత్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఉరుకులు పరుగులు తీసే జర్నలిస్టులకు ఈ లీగ్‌తో ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని, ఇలాంటి లీగ్‌లు భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని నిర్వాహకులను కోరారు. క్రీడాకారులకంటే ఉత్సాహంగా, ఫిట్‌గా స్పోర్ట్స్ జర్నలిస్టులు కనిపిస్తున్నారని అన్నారు. ఆరంభ మ్యాచ్‌లో థండర్స్ విజయం సాధించగా, రెండో మ్యాచ్‌లో ఎన్ రైజర్స్ గెలుపొందింది. తొలి మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రానిక్ మీడియా జట్టుపై థండర్స్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. వర్షంతో 15 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ఎలక్ట్రానిక్ మీడియా జట్టు 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. ఛేదనలో థండర్స్ కెప్టెన్ సాయికిశోర్ హాఫ్ సెంచరీ (69)తో రాణించడంతో ఆ జట్టు 14.2 ఓవర్లలో 118/2 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌ను ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సివి ఆనంద్ టాస్ వేసి ప్రారంభించారు. కాసేపు బ్యాటింగ్ చేసి పాత్రికేయులను ఉత్సాహపరిచాడు. ఈ మ్యాచ్‌లో ఎన్ రైజర్స్ 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

పారిస్‌తో గుడ్‌బై!

వెటరన్ హాకీ గోల్‌కీపర్ శ్రీజేష్



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ పారిస్ ఒలింపిక్స్‌తో కెరీర్‌కు గుడ్‌బై పలుకనున్నాడు. పారిస్ ఒలింపిక్స్ జులై 26 నుంచి ఆరంభం కానుండగా.. విశ్వ క్రీడల అనంతరం వీడ్కోలు ప్రకటిస్తానని శ్రీజేశ్ తెలిపాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో శ్రీజేశ్ కీలక సభ్యుడు. మూడు సార్లు ఒలింపిక్స్‌లో పోటీపడిన శ్రీజేష్.. కామన్‌వెల్త్ క్రీడలు, ప్రపంచకప్‌లు సహా ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. పారిస్ ఒలింపిక్స్ శ్రీజేశ్ కెరీర్‌లో నాల్గో ఒలింపిక్స్ కానున్నాయి. ' 2024 ఒలింపిక్స్‌లో చివరిసారిగా బరిలోకి దిగుతున్నాను. ఇన్నేండ్ల ప్రయాణంలో కుటుంబం, సహచరులు, అభిమానులు, హాకీ ఇండియా అమోఘమైన ప్రేమాభిమానాలు చూపించాయి. నాపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు. పారిస్‌లో పతకం రంగు మార్చటమే మా ముందున్న లక్ష్యం' అని పీఆర్ శ్రీజేష్ అన్నాడు.

నవచిత్రం

ఆలోచనలకు తెర రూపమే ఆపరేషన్ రావణ్



వెంకట సత్య

రక్షిత్ అట్లూరి హీరోగా, రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వెంకట సత్య సోమవారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. 'మన ఆలోచనలే మన శత్రువులు అనేది పురాణాల్లోనే ఉంది. మన ఆలోచన గురించి మనం తెలుసుకోవడమే మోక్షమని చెబుతుంటారు. సాధారణంగా సినిమాల్లో విలన్లు కబ్జా, డ్రగ్స్ అమ్మకం వంటి తప్పుడు పనులు, దౌర్జన్యం చేస్తుంటారు. ఇవన్నీ ఆ విలన్ల యాక్టివిటీస్. కానీ మేము ఆ పనులకు కారణమైన ఆలోచనలను విజువల్‌గా చూపిస్తున్నాం. ఒక మనిషి తప్పు చేసినా, ఒప్పు చేసినా దానికి ఆ ఆలోచనే కారణం. మనం ఏ పనిచేసినా ఆ పనికి ముందు ఆలోచనల్లో చేద్దామా వద్దా అనే సంఘర్షణ జరుగుతుంది. అలాంటి ఆలోచనలకు తెర రూపమివ్వాలనే ప్రయత్నంలో భాగంగా ఈ సినిమా రూపొందించాను. ఈ సినిమాకి రామాయణం స్ఫూర్తి. అలాగే ఒక మనిషి సైకోగా ఎందుకు మారతాడు అనేది మా మూవీలో చూపిస్తున్నాం. మా అబ్బాయి రక్షిత్‌ను డైరెక్ట్ చేస్తున్నాననే విషయం నన్ను పెద్దగా ప్రభావితం చేయలేదు. అయితే ఫైట్స్ సీన్స్ చేస్తున్నప్పుడు కొంచెం టెన్షన్ పడ్డాను. మా చిత్రంలో రాధిక కీలక పాత్ర పోషించారు. ఆమె చాలా అద్భుతంగానటించారు. మా సినిమా ప్రారంభమైన గంటలోపు సైకో ఎవరన్నది కనిపెడితే ఆ ప్రేక్షకుడికి సిల్వర్ కాయిన్ ఇస్తామని ప్రకటించాం. అలా వెయ్యి మందికి సిల్వర్ కాయిన్ ఇవ్వబోతున్నాం'.


బంధాలు.. భావోద్వేగాలు



అలీ రజా, సీతా నారాయణన్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రామ్ ఎన్ఆర్ఐ'. 'పవర్ ఆఫ్ రిలేషన్ షిప్' అనేది ఉపశీర్షిక. ఎన్.లక్ష్మీ నందా దర్శకుడు. మువ్వా క్రియేషన్స్ పతాకంపై ఎస్ఎంకే ఫిల్మ్ సింగులూరి మోహన్‌కృష్ణ సమర్పణలో మువ్వా సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఈనెల 26న విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఘనంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ ఈవెంట్‌కు నిర్మాతలు ప్రసన్నకుమార్, లయన్ సాయి వెంకట్, రామకృష్ణ గౌడ్, రామసత్య నారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు ఎన్.లక్ష్మీ నందా మాట్లాడుతూ, 'పుట్టిన ఊరికి ఏదైన చేయాలని కోరుకున్న వారంతా ముందుకు వచ్చి నా ఈవెంట్‌ను సక్సెస్ చేశారు. సినిమా చాలా బాగా వచ్చింది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు. 'ఈ చిత్రాన్ని రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన వారందరికీ థ్యాంక్స్. నా మీద నమ్మకంతో నాకు ఈ చిత్రాన్ని ఇచ్చారు. ఇందులో 'ఉయ్యాల జంపాల, శతమానంభవతి' ఫ్లేవర్ నాకు కనిపించింది. మా ఎస్ఎంకే ఫిల్మ్ బ్యానర్ మీద ఏడాదికి ఆరు చిత్రాలైనా రిలీజ్ చేయాలని అనుకుంటున్నాను. ముఖ్యంగా ప్రతీ చిన్న చిత్రాన్ని రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నా. లక్ష్మీ నందాతో ఓ సోలో చిత్రాన్ని చేస్తున్నాను' అని సింగులూరి మోహన్‌కృష్ణ చెప్పారు.

నిర్మాత మువ్వా సత్యనారాయణ మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. చిత్రాన్ని చాలా ఎంజాయ్ చేస్తూ నిర్మించాం. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని భావిస్తున్నాం' అని తెలిపారు.


రామ్

5 భాషల హక్కులు

ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సొంతం

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రూపొందిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రానికి సంబంధించి 5 భాషల వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్‌ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఆగస్ట్ 15న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ మూవీకి గురువారం (స్వాతంత్ర్య దినోత్సవం), సోమవారం (రక్షా బంధన్) హాలీడేస్‌తో 5 రోజుల వీకెండ్ అడ్వాంటేజ్ ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు.

రామ్, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీగా 'డబుల్ ఇస్మార్ట్' చుట్టూ బజ్ చాలా స్ట్రాంగ్‌గా ఉంది. పోస్టర్‌లు, టీజర్, పాటలకు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇది మ్యాసీవ్ బ్లాక్‌బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్. మేకర్స్ ప్రోమోలో ప్రామిస్ చేసినట్లు ఈ మూవీలో మాస్, యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్మెంట్ డబుల్ డోస్ ఉంటుంది.

ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ ఐదు భాషలు వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్‌ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య రెడ్డి సొంతం చేసుకున్నారు. పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్'ని అందించిన డిస్ట్రిబ్యూషన్ హౌస్ చాలా గ్రాండ్‌గా ఐదు భాషల్లో ఈ సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తోంది.

పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమాలో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్ర పోషించగా, రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించింది. అలీ, గెటప్ శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, సీఈఓ: విషు రెడ్డి, సంగీతం: మణి శర్మ, సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, స్టంట్ డైరెక్టర్: కేచ, రియల్ సతీష్.

తెలుగులోనూ విజయం ఖాయం



ధనుష్ నటించిన తన 50వ చిత్రం 'రాయన్'. దీనికి ఆయనే దర్శకత్వం వహించడం విశేషం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ గోపీచంద్ మలినేని, ప్రొడ్యూసర్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో ధనుష్ మాట్లాడుతూ,'నేను చాలా లక్కీ. నా కెరీర్‌లో చాలా మంచి ఫిలిం మేకర్స్‌తో కలిసి పని చేసే అవకాశం దొరికింది. సెల్వ రాఘవన్, సుబ్రహ్మణ్యం శివ, భూపతి పాండియన్, వెట్రిమారన్.. ఇలా నాతో సినిమాలు చేసిన దర్శకులందరికీ ధన్యవాదాలు. వాళ్ళందరి దగ్గర నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నా కెరీర్‌లో నేను నా తప్పుల నుంచే ఎక్కువ నేర్చుకున్నా. అందుకే మనం చేసే మిస్టేక్స్‌కి థ్యాంక్ ఫుల్‌గా ఉండాలి. డైరెక్షన్ చాలా భాద్యతతో కూడుకున్నది. నాకు నటనపైన ఎంత ఇష్టం ఉందో దర్శకత్వంపైనా అంతే ఇష్టం ఉంది. నేను డైరెక్షన్ చేసిన ఈ సినిమా ఈనెల 26న వస్తోంది. ఇదొక బ్లెసింగ్‌గా భావిస్తున్నాను. నిర్మాత కళానిధి మారన్, ఎఆర్ రెహ్మాన్, ప్రకాష్ రాజ్, ఎస్జే సూర్య, సందీప్, అపర్ణ, నా టెక్నికల్ టీం అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో అభిమానించే తెలుగు ఆడియన్స్‌కి ధన్యవాదాలు. నా నుంచి కోరుకునే మంచి డైలాగ్స్, యాక్షన్, సాంగ్స్ అన్నీ ఇందులో ఉన్నాయి. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నాను. ఈ సినిమా తమిళంతోపాటు తెలుగులోనూ మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా' అని అన్నారు.

పోలీసుల పవరేంటో తెలిపే సినిమా


దేవ్ గిల్

'మగధీర'తో సహా పలు దక్షిణ భారతీయ చిత్రాలలో విభిన్న పాత్రలు, విలక్షణ నటనతో అందర్నీ అలరించిన దేవ్‌గిల్ హీరోగా దేవ్ గిల్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రం 'అహో! విక్రమార్క'.

పేట త్రికోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్ట 30న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇస్తూ మేకర్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్‌ను గమనిస్తే హీరో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారని అర్థం అవుతోంది. సినిమా రిలీజ్ సందర్భంగా హీరో దేవ్ గిల్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో పోలీసుల ధైర్యం, అంకిత భావాన్ని గొప్పగా చూపించబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఆగస్ట 30 పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేస్తున్నాం. ఇప్పటి వరకు నాలోని నటుడిని ఓ కోణంలో చూసిన ప్రేక్షకులు ఈ సినిమాతో మరో కోణాన్ని వెండితెరపై చూస్తారు' అని తెలిపారు.

'ఈ సినిమా పోలీసుల పవర్‌ను తెలియజేస్తుంది. సినిమాని అనుకున్న ప్లానింగ్ ప్రకారం రూపొందించాం. ఫస్ట్‌లుక్, టీజర్‌లకు చాలా మంచి స్పందన వచ్చింది. దేవ్‌గిల్‌ను సరికొత్తగా చూస్తారు' అని దర్శకుడు పేట త్రికోటి చెప్పారు.

షాయాజీ షిండే, ప్రవీణ్ తార్డే, తేజస్విని పండిట్, చిత్ర శుక్లా, ప్రభాకర్, విక్రమ్ శర్మ, బిత్తిరి సత్తి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : ఆర్తి దేవిందర్ గిల్, మీహిర్ కుల్కర్ని, అశ్విని కుమార్ మిశ్రా, కథ : పెన్మెత్స ప్రసాద్ వర్మ, సంగీతం : రవి బస్రూర్, ఆర్కో ప్రవో ముఖర్జీ, కెమెరామెన్ : కరమ్ చావ్లా, గురుప్రసాద్.ఎన్, ఎడిటర్ : తమ్మిరాజు, ప్రొడక్షన్ డిజైనర్: కార్తీక్ విధతే, స్టంట్స్: రియల్ సతీష్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

తెలంగాణలో త్వరలో ఉప ఎన్నికలు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై అవుతారు : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద



నవతెలంగాణ-సిటీబ్యూరో/కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై అవుతారని, త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేసిన రుణమాఫీని రైతులందరికీ వర్తించేలా చూడాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాంకేతిక లోపం పేరుతో కొందరికే రుణమాఫీ వర్తింపజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రుణమాఫీ జరుగుతుందనుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయన్నారు. రైతుబంధు డబ్బులను రుణమాఫీకి మళ్లించినట్టు ఆరోపించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు రూ.39 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా.. రూ.11 కోట్లు మాత్రమే చెల్లించి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేవని, ఓట్లతో పని లేకపోవడంతో రైతుబంధును పోస్ట్‌పోన్ చేసిందని విమర్శించారు. ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విషయాలన్నింటినీ నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, వైస్ చైర్మెన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ మధు, నాయకులు చింతల దేవేందర్ యాదవ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థికి ప్రధాని ప్రశంసలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్-2024లో ప్రతిభ కనబర్చిన శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి ఎంవి ఆదిత్య ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసలు అందుకున్నారు. ఆ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగంలో అగ్రగామిగా నిలుస్తూ ఎందరో విద్యార్థులను విశ్వవిజేతలుగా తీర్చిదిద్దుతూ మరో మైలురాయిని అధిగమించామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో వేల మంది ప్రతిభ గల విద్యార్థులు పోటీపడిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో భారత జట్టు అద్భుతమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శించి నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆరుగురు సభ్యుల విద్యార్థి బృందంలో తమ స్కూల్ విద్యార్థి బావదాస్ పూణేకు చెందిన ఎంవి ఆదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. చారిత్రక విజయాన్ని సాధించిన ఆదిత్యను ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ అభినందించారని పేర్కొన్నారు. ఈ అసాధారణమైన విజయం దేశానికి గర్వకారణమని తెలిపారు.

కావడి(కన్వర్)యాత్ర పేరుతో ప్రజల మధ్య బీజేపీ చిచ్చుపెట్టే కుట్ర

- ఆ యాత్రను సుప్రీం కోర్టు నిలిపివేయడం అభినందనీయం : ఆవాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కావడి (కన్వర్) యాత్ర సందర్భంగా నిబంధనలు పేరుతో బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన కుల, మత వివక్ష, విద్వేష, విష బీజాలు నాటే ఆదేశాలను సుప్రీంకోర్టు నిలిపివేయడాన్ని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య రాజకీయ ప్రయోజనాల కోసం విభజన చిచ్చు పెట్టే బీజేపీ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

దశాబ్దాలుగా గంగా నది తీరంలో కావడి(కన్వర్) యాత్ర జరుగుతోందని గుర్తు చేశారు. ఆ యాత్రను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నదని పేర్కొన్నారు. తినుబండారాలు అమ్మే అన్ని దుకాణాల ముందు యజమానులు, పనిచేసే వారి పేర్లతో బోర్డులు పెట్టాలనే ఆదేశాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేశాయని తెలిపారు.దీని వల్ల కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను మతాల పేరుతో, కులాల పేరుతో విడదీసే కుట్రకు పాల్పడిందని విమర్శించారు. దశాబ్దాల నుంచి అన్ని మతాలకు చెందిన ప్రజలు యాత్రలో పాల్గొంటున్న వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కానీ.. ఈ సారి మత, కుల వైషమ్యాలను పెంచి రాజకీయ లబ్ధిపొందేందుకు చేస్తున్న కుట్రను సుప్రీం కోర్టు అడ్డుకోవటం హర్షనీయమని తెలిపారు.దేశంలో మతోన్మాద రాజకీయాలని ప్రజలు తిరస్కరిస్తున్నప్పటికీ బీజేపీ పదేపదే అదే ప్రయత్నాలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీ వర్షాలు...రైల్వే లైన్లు జాగ్రత్త

- 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డుల కార్యక్రమంలో ద.మ.రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారీ వర్షాలు కురుస్తున్నందున రైల్వే లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్ రైలు నిలయంలోని సోమవారం జరిగిన 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8 మంది ఉద్యోగులకు అవార్డులు అందచేశారు. అవార్డులు ఉద్యోగుల్లో గుర్తింపును, విధుల్లో అంకితభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. రైల్వే ట్రాక్‌లపై నిరంతర గస్తీ నిర్వహించాలనీ, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, నీటికుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జోన్ మొత్తంగా నెలరోజులపాటు ప్రత్యేక సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. రైళ్ల సమయపాలనను కచ్చితంగా పాటించాలనీ, దానికోసం సాధ్యమైన మేరకు వేగ పరిమితులను ఎత్తివేయాలని చెప్పారు. రైల్వేస్టేషన్లలో వినియోగంలో లేని పాత నీటి ట్యాంకులను మార్చాలనీ, పాదచారుల వంతెల మరమ్మతులు వేగవంతం చేయాలని అన్నారు.

ఓటుకు నోటు కేసు మరో రాష్ట్రానికి బదిలీ చేయాలనే

- పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు వేరొక రాష్ట్రానికి బదిలీ చేయాలనే పిటిషన్ విచారణ సుప్రీంకోర్టులో మరోసారి వాయిదా పడింది. ఈ కేసులో నిందితునిగా ఉన్న ఏ. రేవంత్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో ఈ కేసు ట్రయల్స్‌ను తెలంగాణ నుంచి వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథ్‌తో కూడి ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. గతంలో రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ దాఖలు చేశారు. ఆ కౌంటర్ అఫిడవిట్లను సోమవారం పరిశీలించిన ధర్మాసనం రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది. దీంతో కేసు విచారణను ధర్మాసనం రెండు వారాల పాటు వాయిదా వేసింది. ఓటుకు నోటు కేసు ట్రయల్స్‌ని హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్, భూపాల్‌కు మార్చాలని పిటిషన్‌లో జగదీశ్‌రెడ్డి కోరారు.

కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర పోతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రజలకు సంబంధించి తీవ్ర సమస్యలున్నా...తాము తట్టిలేపితే కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లేవడం లేదంటూ ఎద్దేవా చేశారు. పంచాయతీల్లో పారిశుధ్య సమస్యను తమ పార్టీ లేవనెత్తాకే కార్మికులకు జీతాలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి జీతాలకు సంబంధించి ప్రభుత్వంలో కొంత చలనం వచ్చిందని గుర్తుచేశారు. ఆసరా పింఛన్లపై నిలదీశాకే రెండు నెలలకుగానూ ఒక నెల పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. మార్చి కంటే ముందే కేంద్రం పంచాయతీలకు రూ.500 కోట్లు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని తెలిపారు. వాటికి ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన రూ.750 కోట్లు ఆగిపోయాయని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం రూ.850 కోట్లు ఇచ్చినా రాష్ట్రం రూ.350 కోట్లు విడుదల చేయలేదని గుర్తుచేశారు. మరో 15 రోజుల్లో వాటిని ఖర్చు చేయకపోతే కేంద్రం వడ్డీ వసూలు చేస్తుందని హెచ్చరించారు. రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకపోవడంతో అనేక పథకాలపై ప్రభావం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లకూ రెండు నెలలుగా జీతాలు రాలేదనీ, సొంత డబ్బులు ఖర్చు చేసి పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తే వారికి ఎవరు డబ్బులిస్తారని ప్రశ్నించారు.

స్కూళ్లకు కరెంటు బిల్లులు కట్టకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారని హరీశ్ విమర్శించారు. పోలీసులకు పెట్రోల్, డీజిల్‌కు నిధులు, హోంగార్డుల జీతాలకు సరిగ్గా నిధులివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించి లక్ష చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హులైన 30 నుంచి 40 శాతం మందికి రుణమాఫీ అమలు కాలేదని తెలిపారు. పీఎం కిసాన్ పథకంలోని నిబంధనలను తొలగించాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు అత్యవసర పనుల కోసం నెలకు ఇచ్చే రూ.40 లక్షల నిధులను ఏడు నెలలుగా ఇవ్వడం లేదనీ, దీంతో డివిజన్లు చెత్తకుప్పలుగా మారాయని చెప్పారు.

సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు పీహెచ్‌సీల్లో ఏం చేస్తారు?

వైద్యారోగ్యశాఖలో డాక్టర్ల బదిలీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. బదిలీల్లో పారదర్శకత లేకపోవడంతో అన్ని వర్గాలు రోడ్డెక్కాయని చెప్పారు. 2 వేల పడకల ఆస్పత్రులకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్లను వంద పడకల ఆస్పత్రులకు బదిలీ చేశారని తప్పుపట్టారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏం చేస్తారని ప్రశ్నించారు. మరోవైపు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, పాఠశాలలకు ఉచిత కరెంటు అమలు చేయలేదని వాపోయారు. నాయీ బ్రాహ్మణులకు, రజకులకు ఉచిత విద్యుత్ సరఫరాను ఆపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అర్హులెంతో మంది ఉండగా పంజాబ్‌కు చెందిన వ్యక్తిని డీజీపీగా ఎందుకు నియమించారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారో అన్నింటిని బయటపెడతామని హెచ్చరించారు.

ఓపీఎస్ పునరుద్ధరణకు ఎలాంటి ప్రతిపాదన లేదు

- కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి
- 92,365 కేంద్రీయ విద్యాలయాలు, నవోదయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఒక ప్రశ్నగా ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో 92,365 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 మార్చి 31 నాటికి కేంద్రీయ విద్యాలయాల్లో 6,653, నవోదయ విద్యాలయల్లో 4,675 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 2024 మార్చి 31 నాటికి కేంద్రీయ విద్యాలయాల్లో 56,783, నవోదయ విద్యాలయల్లో 24,254 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

సెంట్రల్ యూనివర్శిటీల్లో 2,648 టీచింగ్, 4,340 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీ

సెంట్రల్ యూనివర్శిటీల్లో 2,648 టీచింగ్, 4,340 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 ఏప్రిల్ 1 నాటికి ఎస్సీ 736, ఎస్టి 466, ఓబీసీ 1,446 మొత్తం 2,648 రిజర్వ్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అలాగే 2024 ఏప్రిల్ 1 నాటికి ఎస్సీ 1,466, ఎస్టి 914, ఓబీసీ 1,960 మొత్తం 4,340 రిజర్వ్ నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించాలనే వినతిపై నిర్ణయం తీసుకోని కౌన్సిల్

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రేటు తగ్గించాలనే వినతిపై జీఎస్టీ కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రైతులు ఉపయోగించే ట్రాక్టర్లు, యంత్రాలు, ఇతర పరికరాలపై జీఎస్టీ రేటు తగ్గించాలని వినతి అందందని లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అయితే జీఎస్టీ కౌన్సిల్ ప్రతిపాదనల మేరకే జీఎస్టీ రేటు మినహాయింపు ఉంటుందని తెలిపారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా కుదరదు

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని కేంద్ర ప్రభుత్వ తేల్చిచెప్పింది. సోమవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రణాళిక సహాయం కోసం ప్రత్యేక హోదా గతంలో నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌డీసీ)తో కొన్ని రాష్ట్రాలకు మంజూరు చేశారని తెలిపారు. కొండలు, కష్టతరమైన భూభాగం, తక్కువ జనాభా సాంద్రత, గిరిజన జనాభాలో గణనీయమైన వాటా, పొరుగు దేశాలతో సరిహద్దు రాష్ట్రాలు, ఆర్థిక, అవస్థాపన వెనుకబాటుతనం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్షీణత వంటి ఐదు అంశాలు ఆధారంగా ప్రత్యేక హోదా ఇస్తారని తెలిపారు. రాష్ట్రాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి ఈ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రత్యేక హోదా కోసం బీహార్ అభ్యర్థనను ఇంటర్-మినిస్టీరియల్ గ్రూప్ (ఐఎజీ) పరిగణించిందని, ఇది 2012 మార్చి 30న తన నివేదికను సమర్పించిందని తెలిపారు. బీహార్‌కు ప్రత్యేక హోదా అంశమే లేదని అన్నారు.

తెలంగాణ అప్పు రూ.3,89,672 కోట్లు ఏపీ అప్పు రూ.4,85,490 కోట్లు...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అప్పు రూ.3,89,672.50 కోట్లు అని, ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.4,85,490.80 కోట్లు అని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

2024లో బడ్జెట్ అంచ నాలకు ఈ రెండు రాష్ట్రాల అప్పులు పై విధంగా ఉన్నాయన్నారు. ఏపీలో 2022లో రూ.3,80,548.50 కోట్లు, 2023లో రూ.4,28,715.70 కోట్ల అప్పు ఉండగా, తెలంగాణలో ఇదే సంవత్సరంలో రూ. 3,14,852.90 కోట్లు, 2023లో రూ. 3,52,061 కోట్ల అప్పులుండేవని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కంటే ముందు తమిళనాడు అప్పు రూ. 8,34,543.50 కోట్లు, ఉత్తరప్రదేశ్ అప్పు రూ. 7,69,245.30 కోట్లు, మహారాష్ట్ర అప్పు రూ.7,22,887.30 కోట్లు, పశ్చిమ బెంగాల్ అప్పు రూ. 6,58,426.20 కోట్లు, కర్నాటక అప్పు రూ.5,97,618.40 కోట్లు, రాజస్థాన్ అప్పు రూ. 5,62,494.90 కోట్లుగా ఉన్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల అప్పు 2022లో రూ. 67,79,970.80 కోట్లు, 2023లో రూ. 73,96,354.90 కోట్లు, 2024లో రూ. 82,22,065.30 కోట్లు ఉందని తెలిపారు.

తెలంగాణలో 1,637. 25, ఏపిలో 1,593.97 హెక్టార్ల అటవీ భూమి బదిలీ

తెలంగాణలో 1,637.25, ఆంధ్రప్రదేశ్‌లో 1,593.97 హెక్టార్ల అటవీ భూమిని బదిలీ, ఇతరావసరాలకు బదిలీ చేసినట్టు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 47 ప్రతిపాదనలకు గాను 1,593.97 హెక్టర్ల అటవీ భూమిని, తెలంగాణలో 116 ప్రతి పాదనలకు గాను 1,637.25 హెక్టర్ల అటవీ భూమి బదిలీ చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 8,731 ప్రతిపాదనలకు గాను, 95,724.99 హెక్టర్ల అటవీ భూమిని బదిలీ చేసినట్టు మంత్రి తెలిపారు.

ఏపీ స్థానిక సంస్థలకు రూ.7,800 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్

ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు రూ.7,800 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థలకు రూ.18,063 కోట్లు 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు చేసిందని, అందులో 2024 జులై15 నాటికి రూ.10,263 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అలాగే డిజార్టస్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.6,183 కోట్లు సిఫార్సు చేయగా, రూ.3,398 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.

అంటే ఈ నిధుల్లో ఇంకా రూ.2,785 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు రూ.45,743 కోట్లు సిఫార్సు చేస్తే, రూ.44,158 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అంటే రూ.10,585 కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

తెలంగాణకు రూ.5,885 కోట్లు పెండింగ్

తెలంగాణ స్థానిక సంస్థలకు రూ.13,111 కోట్లను 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు చేసిందని, అందులో 2024 జులై15 నాటికి రూ.7,226 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర మంత్రి తెలిపారు. అంటే రూ.5,885 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే డిజార్టస్ మేనేజ్‌మెంట్ నిధులు రూ. 2,483 కోట్లు సిఫారసు చేయగా, రూ.1,176 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అంటే ఈ నిధుల్లో ఇంకా రూ.1,307 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు రూ.15,594 కోట్లు సిఫార్సు చేస్తే, రూ.8,402 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. అంటే రూ.7,192 కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

పోలవరానికి రూ.12,157 వేల కోట్లివ్వండి

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు చెల్లించండి
- నవంబర్ నుంచి పనులు ప్రారంభం
- పోలవరం సందర్శనకు రండి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రాష్ట్ర మంత్రి రామానాయుడు వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరానికి రావాల్సిన రూ.12,157 వేల కోట్లు ఇవ్వాలని, అలాగే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు చెల్లించాలని రాష్ట్ర జలనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, టీడీపీ ఎంపీలతో కలిసి రాష్ట్ర మంత్రి రామానాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కేంద్ర మంత్రిని పోలవరం సందర్శనకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

2019-24 మధ్య 2 శాతం మాత్రమే పోలవరం పనులు జరిగాయని, 20-30 శాతం పనులు వెనక్కి వెళ్లాయని విమర్శించారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, కొత్త టెండర్లు, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చించినట్టు తెలిపారు. నవంబర్ నుంచి పనులు ప్రారంభిస్తామని, డిజైన్లు పూర్తి, ప్రాజెక్టు పనులు పూర్తిపై దృష్టి సారించాలని కోరినట్లు చెప్పారు.

త్వరితగతిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులివ్వాలని, కేంద్ర సహకారం అందించాలని కోరగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు చంద్రబాబు హయాంలోనే పూర్తయ్యేందుకు సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి తెలిపినట్టు చెప్పారు. ప్రధాని మోడీ సహకారంతో పోలవరం సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు వెళ్తామని, పోలవరానికి రావాల్సిన రూ.12,157 వేల కోట్లు త్వరగా ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఇందులో రూ. 8 వేల కోట్లు పునరావాసానికి ఖర్చు చేయాల్సి ఉందని అన్నారు.

పోలవరం పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించాం : కె.రామ్మోహన్ నాయుడు

పోలవరం పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తయ్యాయని, జగన్ వచ్చిన తరువాత 20 శాతం పనులు వెనక్కి వెళ్లాయని తెలిపారు. మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ జగన్ అభివృద్ధి నిరోధకుడని, ఆయన గురించి మాట్లాడకుండా ఉండడమే మేలని అన్నారు. 2028 నాటికి పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు.

త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణ పనుల వేగం పెంచాలి

- కేంద్ర కార్యదర్శి అనురాగ్ జైన్‌కు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరరో

ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో ఆయన భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వినతిపత్రం అందజేశారు. నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టేందుకు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్ఆఫ్‌సీ) సమావేశం ఏర్పాటు చేసి త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. రాష్ట్రంలో 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో రహదారుల నిర్మాణాలపై కార్యదర్శితో మంత్రి కూలంకుషంగా చర్చించారు. నల్లగొండ బైపాస్ నిర్మాణంపై వారంలో ఎస్ఎఫ్‌సీ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అనురాగ్ జైన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు.



317 జీవో సమస్యలను పరిష్కరించాలి

- మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకు పీఆర్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను శాశ్వత ప్రాతిపదికన కేటాయింపులు చేసేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన 317 జీవో అమలు వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని కోరారు. స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు బదిలీ చేయాలనీ, సీనియార్టీకి రక్షణ కల్పిస్తూ పరస్పర బదిలీలను అమలు చేయాలని సూచించారు. వివిధ జిల్లాల్లో ఏర్పడిన అసమానతలను తొలగిస్తూ క్యాడర్ స్ట్రెంథ్‌ను సరిచేయాలని తెలిపారు. మెడికల్, వితంతు ప్రాధాన్యతను గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కేటాయింపులు జరిపేందుకు అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు స్పందిస్తూ త్వరలోనే ఈ అంశాలను కచ్చితంగా ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి సమర్పించి తగు ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఏసీబీకి చిక్కిన దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఒక వ్యక్తి నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్ రాజమల్లయ్య ఏసీబీ వలకు చిక్కాడు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ సి.వి ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక వ్యక్తికి ఆయన భూమికి సంబంధించిన వివరాలను సానుకూలంగా ఉన్నతాధికారులకు పంపించటానికి గానూ రూ.50 వేలను రాజమల్లయ్య డిమాండ్ చేశాడు. ఇందులో రూ.20 వేలను అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. మిగతా సొమ్ము రూ.30 వేలను తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రాజమల్లయ్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్ము స్వాధీనపర్చుకొని అరెస్ట్ చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌ను హైదరాబాద్ ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

వరదల్లో చిక్కుకున్న 35 మంది గ్రేహౌండ్స్ కమాండర్లను

- రక్షించిన ఉన్నతాధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భారీ వర్షాల్లో తడుస్తూ, వరదల్లో చిక్కుకున్న 35 మంది గ్రేహౌండ్స్ కమాండోలను పోలీసు ఉన్నతాధికారులు రక్షించిన సంఘటన రాష్ట్ర సరిహద్దులో చోటు చేసుకున్నది. ఇటీవలన రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న రాష్ట్ర గ్రేహౌండ్స్ బృందం తిరుగు ప్రయాణమైంది. రాష్ట్ర సరిహద్దులు దాటి నడుచుకుంటూ వస్తున్న 35 మందితో కూడిన గ్రేహౌండ్స్ కమాండో బృందం సరిహద్దుల్లో హెలీప్యాడ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో చిక్కుకుంది. అప్పటికే ఐదు రోజులుగా వర్షంలో తడుస్తూ కాలి పాదాలకు తీవ్రమైన బొబ్బలు రావటంతో అతి కష్టం మీద వాగు దాటటానికి ప్రయత్నిస్తున్న కమాండోలకు వరద ఉధృతి కారణంగా అందులో కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై సమాచారమందుకున్న గ్రేహౌండ్స్ ఉన్నతాధికారులు వెంటనే హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ టీమ్‌ను ఆ వాగు వద్దకు పంపించారు. ఆ వాగులో చిక్కుకున్న ఒక్కొక్కరిని జాగ్రత్తగా హెలికాప్టర్‌లోకి రెస్క్యూ టీమ్ చేర్చింది. అప్పటికే తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్న గ్రేహౌండ్స్ బృందాన్ని ఏటూరునాగారంలోని ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధికారులు తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నదని అధికారులు తెలిపారు.

మరోసారి కవితతో కేటీఆర్ ములాఖాత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై తీహార్ జైల్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ ములాఖత్ అయ్యారు. దాదాపు 15 నిమిషాలు ఆమెతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కవిత ఆరోగ్య విషయాలను అడిగి తెలుసు కున్నారు. అలాగే న్యాయపరంగా అందించాల్సిన సహాయంపై చర్చించారు. అయితే కేటీఆర్ కవితను తీహార్ జైల్‌లో కలవడం ఇది రెండోసారి. ఆయనతో పాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ నేతలు కలిసి కవితకు ధైర్యం చెప్పారు.

కవితపై దాఖలైన అడిషన్ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి

కవితపై సీబీఐ దాఖలు చేసిన అడిషనల్ చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితతోపాటు మరో నలుగురి ప్రమేయం ఉందని సీబీఐ అడిషనల్ చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ అడిషనల్ చార్జిషీట్ సరిగాలేదని ఆరోపిస్తూ బెయిల్ ఇవ్వాలని కవిత మరోసారి ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై సోమవారం విచారణ జరిపిన స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ఆగస్టు 5న తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం లిక్కర్ స్కాంలో సీబీఐ దాఖలు చేసిన అడిషనల్ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా వెల్లడించారు. ఈ నెల 26న చార్జిషీట్‌పై తదుపరి విచారణ చేపడతామని తెలిపారు.

పదేండ్లైనా ఎదురుచూపులే..

ఈ బడ్జెట్‌లోనైనా విభజన హామీలు నెరవేరేనా

- రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై ఆశలు ఫలించేనా..



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ఏర్పడిన ఈ పదేండ్ల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా దాటవేస్తూ వచ్చింది. మళ్లీ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఈ బడ్జెట్‌లోనైనా ఆ హామీల అమలుకు కేటాయింపులు చేస్తుందా అన్న చర్చ నడుస్తోంది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, మామునూరు ఎయిర్‌పోర్టు.. తదితర హామీలు అమలు కాకపోవడం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అంతేకాదు, ములుగు జిల్లాలో గిరిజన విద్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చినా అవసరం మేరకు బడ్జెట్‌ను కేటాయించక లేదు.

ఇంకా బయ్యారం ఉక్కు కర్మాగారం, నిజామాబాద్‌లో పసుపు బోర్డు, అసెంబ్లీ స్థానాల పెంపు.. ఇలా ఎన్నో విభజన హామీలు ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టగా, పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. అయితే, మధ్యంతర బడ్జెట్‌లో ఎరువులు, ఆహార సబ్సిడీలను కేంద్రం గణనీయంగా తగ్గిస్తూ అంచనాలను రూపొందించిన విషయం విదితమే. ఎరువులపైనే 13.2 శాతం సబ్సిడీలను తగ్గించి రైతులకు షాక్ ఇచ్చింది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఏముంటుందోనని అన్నీ వర్గాల ప్రజల్లో చర్చ నడుస్తోంది.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై ఆశలు

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కొన్ని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటులో చేసిన విభజన చట్టంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు నాడు బిల్లులో ఆమోదముద్ర పడింది. అయినా పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో పట్టించుకోలేదు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని సాక్షాత్తు నాడు కేంద్ర రైల్వే మంత్రి ప్రకటించినా కేంద్రం వేరే రాష్ట్రాల్లోని మూడు ప్రాంతాల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసింది. దాంతో రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవడంతో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు పీఓహెచ్ షెడ్‌ను కేంద్రం మంజూరు చేసింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో పీఓహెచ్ షెడ్ స్థానంలో వ్యాగన్ పరిశ్రమను ప్రకటించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తమవడంతో కేంద్ర ప్రభుత్వం రైల్వే తయారీ పరిశ్రమను ప్రకటించి పనులు ప్రారంభించింది. ఈ పరిశ్రమకు మధ్యంతర బడ్జెట్‌లో రూ.150 కోట్లను కేటాయించింది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసినా స్థానికులు రైల్వే కోచ్ ఫ్యాక్టరీనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుంటే దక్షిణమధ్య రైల్వేలో సికింద్రాబాద్ డివిజన్‌లో అత్యధిక లాభాలను తీసుకువచ్చే కాజీపేట సబ్ డివిజన్‌ను డివిజన్ చేయాలన్న డిమాండ్ సైతం ఉంది. దీనిపై కేంద్రం నుంచే స్పష్టత లేదు.

మూడో రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట-విజయవాడ, కాజీపేట-బల్లార్షాల మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. కాజీపేట-విజయవాడ మూడో రైల్వే లైన్ నిర్మాణానికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.310 కోట్లు కేటాయించారు. 220 కిలోమీటర్ల ఈ రైల్వే లైన్ నిర్మాణంలో 65 కిలోమీటర్ల మేరకు పనులు ముగిశాయి. విజయవాడ-ఎర్రుపాలెం మధ్య 33 కిలోమీటర్లు, కాజీపేట-నెక్కొండ మధ్య 32 కిలోమీటర్ల మేరకు, కాజీపేట-బల్లార్షాల మధ్య 201 కిలోమీటర్ల మేరకు మూడో రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయి. 132 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. హసన్‌పర్తి-రాఘవాపూర్ మధ్య 71 కిలోమీటర్లు, సిర్పూర్ కాగజ్‌నగర్-మాణిక్‌గర్ మధ్య 61 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. కాజీపేట బైపాస్‌లైన్ పనులకు నిధులను కేటాయించారు.

కొత్త రైల్వే లైన్లపై దృష్టి ఏది?

భూపాలపల్లి జిల్లాలో సింగరేణి బొగ్గు గనులున్నాయి. బొగ్గు రవాణాకు రైల్వే మార్గం ఉంటే చౌకగా రవాణా చేసే అవకాశముంటుంది. ఈ ప్రాంతంలో చెల్పూరు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమీపంలోనే ఉంది. అంతేకాకుండా ఇతర ప్రాంతాలకు, ఇతర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును రవాణా చేయాలన్నా ఎక్కువ వ్యయమవుతున్న పరిస్థితి ఉంది. ఈ విషయంలో కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టి భూపాలపల్లికి రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల కొత్త రైల్వేలైన్ల ఏర్పాటుకు డిమాండ్లున్నాయి. ఇప్పటికే వినతిపత్రాలు సైతం అందజేశారు.

మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు పీఎం మిత్ర నిధులేవి?

వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్.. కేంద్ర పీఎం మిత్ర పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయిస్తుందని భావించినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఈ పూర్తిస్థాయి బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తే పార్క్‌లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే గణేష్ ఎకో టెక్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని 20 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఉత్పత్తిని సైతం ఇక్కడ ప్రారంభించారు. దక్షిణ కొరియా దేశానికి చెందిన 'యంగ్‌వన్' కంపెనీ నిర్మాణ దశలో ఉంది. అదేవిధంగా కేరళకు చెందిన కైటెక్స్' కంపెనీ నిర్మాణంలో ఉంది. త్వరలోనే ఈ రెండు కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ పార్క్ అభివృద్ధికి నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వైపు చూస్తోంది. ఈ క్రమంలో ఈ పూర్తిస్థాయి బడ్జెట్‌లోనైనా పీఎం మిత్ర కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు నిధులు కేటాయిస్తే త్వరితగతిన ఈ పార్క్ అభివృద్ధి చెందే అవకాశముంది.

యూరో ఎక్సిమ్ బ్యాంకుది వేల కోట్ల కుంభకోణం

- అందులో పొంగులేటి కంపెనీ భాగస్వామ్యం
- వందల కోట్ల రూపాయలకు ఎస్‌బీఐ గ్యారెంటీ ఎలా ?
- మంత్రిగా కొనసాగే అర్హత ఆయనకు లేదు : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'దేశ చట్టాలకు సంబంధం లేని యూరో ఎక్సిమ్ బ్యాంకు సెయింట్ లూసియా అనే చిన్న దీవిలో ఉంది. అది ఒక ఫైనాన్స్ కంపెనీ. బ్యాంకు గ్యారెంటీ రూ.8 కోట్లే. వందల కంపె నీలకు ఎలా గ్యారెంటీ ఇస్తుంది? బ్యాంకు గ్యారంటీల విషయంలో వేల కోట్ల కుంభకోణం జరిగింది. ఇది దేశంలోనే భారీ కుంభకోణం. 400కుపైగా బడా వ్యాపారుల పాత్ర ఉంది. అందులో మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు కూడా భాగస్వామ్యం ఉంది' అని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంలో పెద్దపెద్ద తలకాయల పాత్ర ఉందనీ, త్వరలో వారందరి పేర్లను చెబుతానని ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలోని మీడియా హాల్‌లో ఆయన మాట్లాడారు. యూరో ఎక్సిమ్ బ్యాంక్ ఒక ఫైనాన్స్ కంపెనీ అనీ, ఆ బ్యాంకు గ్యారెంటీ మన దేశంలో చెల్లదని చెప్పారు. అయినా, దాన్ని ఏజెన్సీలు ఎలా అంగీక రించాయి? అని ప్రశ్నించారు. ఆర్‌బీఐ గైడ్ లైన్స్‌లో లేని ఆ ఫైనాన్స్ కంపెనీ ఒక్క లెటర్ రాస్తే స్టేట్ బ్యాంక్ ఇండియా గ్యారెంటీ ఎలా ఇచ్చిందని నిలదీ శారు. ఎస్‌బీఐ పేరుతో ఉన్న గ్యారెంటీ లెటర్‌ను చూపుతూ ఆ లెటర్ నిజమైనదా? కాదా? తేల్చాల్సిన బాధ్యత ప్రభు త్వంపై ఉందన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఎస్‌బీఐ వందల కోట్ల రూపాయలకు ఏ విధంగా గ్యారంటీ ఇచ్చిందని ప్రశ్నించారు. దాని గ్యారెంటీతో కాంట్రాక్టులు దక్కించుకున్న గుత్తేదారులు పనులను సగంలో వదిలేసి వెళ్తే ఎవరు బాధ్యులని నిలదీశారు. యూరో ఎక్సిమ్ బ్యాంకు కుం భకో ణంలో పాత్ర ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి క్యాబినెట్‌లో ఉండే అర్హత లేదన్నారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

45 రోజుల బడ్జెట్ సమావేశాలను కుదించడం సరిగాదు

- ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నేడు నిరసన : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడ్జెట్ సమావేశాలను 45 రోజుల నుంచి 10 రోజులకు కుదించడం సరిగాదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. దీనిని నిరసిస్తూ మంగళవారం ఉదయం 9:30 గంటలకు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతామన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 8:30 నిమిషాలకు న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బీజేపీ శాసనసభా పక్ష సభ్యులంతా బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో కలుసుకుంటామని తెలిపారు.

మగ్గంతోనే నేతన్నల బతుకులు

- వస్త్ర సంక్షోభాన్ని నివారించి ఉపాధి కల్పించాలి : పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్
- ప్రభుత్వం స్పందించే వరకు పోరాడుతాం
- వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

మగ్గంతోనే నేతన్న బతుకులు ముడిపడి ఉన్నాయని, అలాంటి వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద సిరిసిల్ల పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి, ఉపాధి లేక ఇప్పటికే 10 మంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంచెల బంద్‌తో వేలాది మంది కార్మికులు, ఆ సాములు రోడ్డున పడ్డారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 20రోజుల కింద నేతన్న పోరు యాత్రకు పిలుపునిస్తే సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పడంతో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందనా లేదని, నేత కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై సమీక్ష నిర్వహిస్తామనిసీఎం రేవంత్ రెడ్డి వాయిదాలు వేస్తూ వస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నేత కార్మికుల జీవితాలతో ఆటలాడు కోవద్దన్నారు. నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రిలే నిరాహార దీక్ష చేపట్టినట్టు చెప్పారు. వస్త్ర పరిశ్రమకు బీజేపీ చేసిందేమీ లేదని, పైగా జీఎస్టీ పెంచి భారం మోపిందని విమర్శిం చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వస్త్ర పరిశ్రమను రక్షించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ, వర్కర్స్ టు ఓనర్, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, యారన్ సబ్సిడీ అందించి.. జనతా వస్త్ర పథకం తదితర పథకాలను అమలు చేయాలన్నారు. సిరిసిల్ల గతంలో మాదిరిగా ఉరిసిల్ల కాక ముందే అసెంబ్లీ సమావేశాల్లో నేతన్నల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టే కొల లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరి కుంట కిషన్, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్కా మధు, డయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, అన్నల దాస్ శ్రీనివాస్, బొడ్డు శ్రీధర్, శ్రీగాద విష్ణు, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం, సీఐటీయూ నాయకులు మూశం రమేష్, కోడం రమణ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్‌పై గురి

- ఆదాయం పెంపే లక్ష్యంగా హెచ్ఎమ్‌డీఏ కసరత్తు
- విస్తృతంగా వెంచర్లకు ప్రణాళికలు
- 11 వేల ఎకరాల్లో లేఔట్లు వేసేందుకు యత్నం
- ఔటర్ కేంద్రంగా భూ సేకరణకు సిద్ధం
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ఫోకస్



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రియల్ ఎస్టేట్ రంగంలో విస్తృతంగా దూసుకుపోయేందుకు హెచ్ఎమ్‌డీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆదాయం పెంపునకు రియల్ ఎస్టేట్ రంగాన్నే లక్ష్యంగా చేసుకుంది. 11 వేల ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ కింద వెంచర్లు వేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకు ఔటర్ రింగ్ రోడ్ జంక్షన్లను కేంద్రంగా చేసుకుని ఎక్కువ మొత్తంలో లే అవుట్లు చేసేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైనట్టు సమాచారం. ఈ లే అవుట్లలో కార్పొరేట్ స్థాయి నుంచి సామాన్యుడి వరకు అందుబాటు ధరలో ప్లాట్లు ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో వచ్చే ఆదాయంతో ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని హెచ్ఎమ్‌డీఏ అధికారులు అంచనాలు వేస్తున్నారు. దీని కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై హెచ్ఎండీఏ ఫోకస్ పెట్టింది. రాష్ట్ర రాజధాని శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని హెచ్ఎమ్‌డీఏ లే-అవుట్లను అభివృద్ధి చేయనుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని దండు మల్కాపూర్, ప్రతాప సింగారం, కొర్రెముల, లేమూరు, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే దాదాపు 900ఎకరాలకు పైగా భూమిని డెవలప్‌మెంట్ కోసం అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఇలా హైదరాబాద్ చుట్టూ దాదాపు 11 వేల ఎకరాల భూమిని హెచ్ఎండీఏ సేకరించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో దాదాపు 10 వేల ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంతో పాటు ప్రధానమైన జంక్షన్ల వద్ద ఉండేలా హెచ్ఎండీఏ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో భూములిచ్చే వారికి ఆర్థికపరమైన ఇబ్బందులు రాకుండా అన్ని రకాల అనుమతులను హెచ్ఎండీఏ పర్యవేక్షిస్తోంది. సాధారణంగా వ్యవసాయ భూములను లే-అవుట్లుగా మార్చాలంటే నాలా చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. కానీ హెచ్ఎండీఏకు భూములు అప్పజెప్పితే వాటికి నాలా చార్జీలతో పాటు ల్యాండ్ యూజ్ కన్వర్షన్ చార్జీలనూ హెచ్ఎండీఏనే భరిస్తుంది. అంతే కాక రిజిస్ట్రేషన్ ఖర్చులు సైతం హెచ్ఎండీఏ చెల్లించాలని నిర్ణయించడంతో రైతులపై భారం మరింత తగ్గనుంది. ఇక టీఎస్ఐఐసీకి చెందిన భూములను ఇటీవల హెచ్ఎండీఏ ఆన్‌లైన్ వేలంలో విక్రయించింది.

దాంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరింది. కొన్ని ప్రాంతాల్లో ఎకరానికి రూ.100 కోట్లు కూడా పలికింది. గత ప్రభుత్వ హయాంలో కోకాపేట్, బుద్వేల్, మోకిలా, షాబాద్ తదితర ప్రాంతాల్లో వేసిన లే-అవుట్లలో ప్లాట్లను విక్రయించి రూ.వేలాది కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్జించింది. ప్రస్తుతం ఓఆర్ఆర్ సమీపంలోని భూములకు భారీ డిమాండ్ ఉండటంతో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఎక్కువ లే-అవుట్లు వేసేందుకు సమాయత్తమవుతోంది. వీటిని డెవలప్ చేస్తే వేలంలో భారీ ధర పలుకుతుందని హెచ్ఎండీఏ యోచిస్తోంది. దాంతో అందరికీ అందుబాటులో ఉండేలా లే-అవుట్ల రూపకల్పనపై అధికారులు ఫోకస్ చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో మహిళల ఆత్మహత్యాయత్నం

- తమ భూమి ఇతరులు కబ్జా చేశారంటూ ఆవేదన
- అధికారులు న్యాయం చేయడం లేదని పెట్రోల్ పోసుకునే యత్నం
- భూసమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులు
- తన భూమి ఆక్రమించారంటూ మరో రైతూ ఆందోళన



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

తమ భూమిని ఇతరులు కబ్జా చేశారని.. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదంటూ ముగ్గురు మహిళలు, ఓ రైతు వేర్వేరుగా సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన తమ భూమిని ఇతరులు కబ్జా చేశారని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నడిగూడెం మండలం, రామాపురం గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ అరుణ తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి ముందే తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని ముగ్గురు మహిళలు పోసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడున్న పోలీసులు, సిబ్బంది గమనించి వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమ తాతల పేరున మొత్తం పదెకరాల భూమి ఉందన్నారు. అందులో రెండెకరాల 50 సెంట్ల భూమికి సర్వేనంబర్ 190/24లో పహాణీ ఉండగా.. తమ పక్కనే ఉన్న భూతరాజు రామారావు, భూతరాజు రాజీ తమ భూమిని కబ్జాచేశారని తెలిపారు. నడిగూడెం ఎంఆర్‌వో నరసింహారావు వారికి దొంగ పట్టా చేసి పాస్‌బుక్కు ఇచ్చారని ఆరోపించారు. తాము పొట్టకూటి కోసం ఊరు వదిలి వెళ్లామని, వచ్చేసరికే భూమిని కాజేశారని కన్నీరు మున్నీరయ్యారు. ఇదిలా ఉండగా, సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన రైతు అవుట నాగయ్య భూసమస్యపై కలెక్టరేట్‌కు వచ్చాడు. తన భూమిని ఓ వ్యక్తి బలవంతంగా లాక్కున్నారని, సర్వే నంబర్ 836లోని 2 ఎకరాల 11 గంటల భూమిలో బోర్డు పెట్టి తననే రానివ్వడం లేదంటూ.. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను తీయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. కబ్జాదారుడు వాహనానికి పోలీస్ స్టిక్కర్ వేసుకొని కొంతమందితో తన భూమి దగ్గరకు వచ్చి కౌలు చేసే వ్యక్తిని తరచూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తమ భూమి తమకు ఇప్పించాలని అధికారులను వేడుకున్నాడు.

ఎమ్మెల్సీ మల్లన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- సిద్దిపేటలోని నాలుగు మండలాలు జనగామలో కలపుతామనడం సరికాదు
- ఆయన వ్యాఖ్యలపై సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత ద్రోహి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇచ్చిన సలహా మేరకు ఎమ్మెల్సీ మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల ప్రజలు ఎనిమిదేండ్లుగా సిద్దిపేట జిల్లాలోనే కొనసాగుతున్నారని, తిరిగి ఈ మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామనడం ఇక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేర్యాలను రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించి, నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరించాలని చేర్యాల ప్రాంత ప్రజలు పోరాడుతుంటే కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ప్రజల మనోభావాలకు భిన్నంగా వ్యవహరిస్తే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు మండలాల కార్యదర్శులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట మావో, అలేటి యాదగిరి, దూల్మిట్ట మండల బాధ్యులు చొప్పరి రవికుమార్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, ఇప్పకాయల శోభ, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, దర్శనం రమేష్, తేలు ఇస్తారి, ఆముదాల రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలి

- ఆర్‌డీవో కార్యాలయం ఎదుట పోడు రైతుల ఆందోళన :పోడు భూముల సాధన కమిటీ డిమాండ్



నవతెలంగాణ-బోధన్

పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలని పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయం ఎదుట పోడు రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. చందూర్ మండలంలోని గ్రామాల్లో గిరిజనేతర నిరుపేద రైతులు 30 సంవత్సరాలుగా పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. అర్హులైన ఈ నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు పట్టాలిచ్చి, గిరిజనేతరులకు మొండి చేయి చూపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పోడు రైతుల సమస్యలపై గళమెత్తాలని కోరారు. ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు ఇవ్వకపోతే పోడు రైతుల పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు సాయిబాబా, వెంకన్న, హన్మండ్లు, సాయిలు, శ్రీను, సాయి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

'పెద్దవాగు' నిర్వాసితులను ఆదుకుంటాం

- ప్రాజెక్ట్ మరమ్మతులకు.. తక్షణ సాయం రూ.8 కోట్ల కేటాయింపు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా వారికి తక్షణ ఆర్థిక సాయం
- గోదావరి ఉధృతి పరిశీలన



నవతెలంగాణ-అశ్వారావుపేట/బూర్గంపాడు

పెద్దవాగు ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకుంటామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ నెల 18న వరద ఉప్పొంగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి గ్రామం వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడి కట్ట తెగిన ప్రాంతాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సోమవారం పొంగులేటి పరిశీలించారు. ధ్వంసమైన ప్రాజెక్ట్ ప్రదేశంలో కలియ తిరుగుతూ.. స్థానిక అధికారులనడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కోయ రంగాపురం, గుమ్మడిపల్లి, కొత్తూరుల్లో 51 మంది వరద ముంపు నిర్వాసితుల ఇండ్లకు మంత్రి స్వయంగా వెళ్లి పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కొత్తూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన చాపర్ల మురళీ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వాసితులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కోయ రంగాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌కు ఇంతటి గండిపడటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పరిధిలో నష్టం జరిగిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని అన్నారు. 400 ఎకరాల్లో ఇసుక మేట వేసి మొత్తం పూడుకుపోయినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఈ ఇసుక తొలగింపు కోసం ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. పత్తి, వరి పంటలు నష్టపోయిన రైతులకు విత్తనాలు ఉచితంగా అందజేస్తామన్నారు. వరదలో కొట్టుకుపోయిన ఒక్కో గొర్రె యజమానికి రూ.3 వేలు, ఆవులు, గేదెల యజమానికి రూ. 20 వేలు ప్రభుత్వం ఇవ్వనున్నదని తెలిపారు. వరద వల్ల నీట మునిగి ఇండ్లను కోల్పోయిన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించారు.

ప్రాజెక్టు తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్లు

ప్రాజెక్టుకు గండిపడిన చోట తక్షణ మరమ్మతుల కోసం సోమవారం ఉదయం సీఎంతో మాట్లాడి రూ.8 కోట్లు మంజూరు చేయించినట్టు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు మూడు గేట్లతో 40 వేల క్యూసెక్కుల వరదనీరు విడుదల అవుతుందని, 70 వేల క్యూసెక్కుల నీరు వచ్చినప్పుడు అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్ట్‌కు గండి పడిందని చెప్పారు. సరైన సమయానికి గేట్లు ఎత్తి ఉంటే ఇంతటి ముప్పు జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. కాగా, పెద్దవాగు ప్రాజెక్ట్ భూములను కొందరు కబ్జా చేశారని స్థానిక రైతులు మంత్రికి తెలపడంతో.. ఆయన స్పందించి.. వర్షాలు తగ్గాక పూర్తిస్థాయిలో సర్వే చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 41 మంది రైతు కూలీలను రక్షించేందుకు వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడామని, హెలికాప్టర్ సహాయంతో వారిని కాపాడారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ సర్కారుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు ప్రాంత ప్రజలు అధైర్య పడొద్దు

గోదావరి వరదల వల్ల ప్రజలెవ్వరూ అధైర్య పడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలోని గొమ్మూరు గోదావరి రేవు ప్రాంతంలో వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో గోదావరి వరద సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలందరినీ అప్రమత్తం చేయాలన్నారు. మంత్రి వెంట.. ఇరిగేషన్ సీఈ ఏ.శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఆర్డీవో మధు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఎన్పీడీసీఎల్ ఎస్సీ టీకం సింగ్, అశ్వారావుపేట తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య నిర్వీర్యం

- మూడో తరగతి వరకు అంగన్‌వాడీలకు ఇవ్వొద్దు : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన ఉంటుందన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని డీటీఎఫ్ తెలిపింది. దానివల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొంటాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు మూడో తరగతి వరకు విద్యాబోధన ఇవ్వడం వల్ల ప్రాథమిక విద్య ప్రయివేటుపరమయ్యే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీలను కలపాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు.

రాశీ స్టీల్‌కు కొత్త ఆర్డర్

హైదరాబాద్ : బన్సల్ వైర్ ఇండస్ట్రీస్‌కు స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేయడానికి ఆర్డర్‌ను అందుకున్నట్లు రాశీ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ తెలిపింది. ఈ ఆర్డర్ రూ.7.8 కోట్ల విలువ చేస్తుందని వైర్ రాడ్‌లు, బిల్లెట్‌లు, ఫ్లాట్‌లలో అగ్రగామిగా ఉన్న రాశీ స్టీల్ పేర్కొంది. ఇంతక్రితం ఈ సంస్థ ఘజియాబాద్‌లోని స్టీల్ మెల్టింగ్ యూనిట్‌ను "ది ఇండస్ట్రియల్ అండ్ సర్వీస్ సెక్టార్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ 2004" కింద పయనీర్ యూనిట్‌గా యుపి ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికలు

- బైడెన్‌కు బదులుగా పోటీ చేసేదెవరు ?

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి ప్రస్తుత అధ్యక్షులు జో బైడెన్ తప్పుకోవడంతో డెమోక్రటిక్ పార్టీ కొత్త అభ్యర్థి ఎవరనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై పోటీ చేసేందుకు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కే అవకాశం లభిస్తుందని అంతర్జాతీయ మీడియాలన్నీ ఒకే గొంతుకలో చెబుతున్నాయి. బైడెన్ కూడా కమలా హారీస్‌కే మద్దతు పలకడంతో ఆమె బరిలోకి దిగుతారని అంతా భావిస్తున్నారు. కమలా హారిస్ కోసం తాను పనిచేస్తానని బైడెన్ చెప్పారు. బైడెన్ వ్యాఖ్యలను అనుసరించి, అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం నిధుల సేకరణ కోసం డెమొక్రాటిక్ పార్టీ ఖాతా పేరును హారిస్ ఫర్ ప్రెసిడెంట్ అని కూడా మార్చారు. తొలి ఐదు గంటల్లోనే 4.67 మిలియన్ డాలర్లకు పైగా విరాళాలు వచ్చినట్లు సమాచారం. కమలా హారిస్ కూడా బైడెన్ తనను అధ్యక్ష అభ్యర్థిగా అంగీకరించినందుకు చాలా సంతోషంగా ఉందని, ట్రంప్‌ను, అయన ఎజెండాను ఓడించేందుకు డెమోక్రటిక్ పార్టీని, దేశాన్ని ఏకం చేయడం తన బాధ్యత అని ఇప్పటికే ప్రకటించారు. హిల్లరీ క్లింటన్, బిల్ క్లింటన్, ఎలిజబెత్ వారెన్, అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్ సహా సీనియర్ నేతలు కూడా కమలా హారిస్‌కు తమ మద్దతు ప్రకటించారు. అయితే డెమోక్రటిక్ పార్టీ కొత్త అభ్యర్థి రేసులో కమలా హారిస్‌తో పాటు పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో, నార్త్ కరోలినా గవర్నర్ రాయ్ కూపర్, మిచిగాన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్, అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ ఉన్నారు. వీరికి ఉన్న అవకాశాలను కూడా కొట్టి వేయలేమని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే మరోవైపు కమలా హారిస్ ట్రంప్‌ను ఓడించలేరని, కమలా హారిస్‌ను బలిపశువును చేయకూడదనే అభిప్రాయాలు కూడా పార్టీలో ఉన్నాయి. అలాగే బైడెన్‌కు ప్రత్యామ్నాయ పేర్లలో ప్రముఖమైనది మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా భార్య మిచెల్ ఒబామా. ఓటర్లు ఎక్కువగా ఇష్టపడే అభ్యర్థి మిచెల్ అని ఇప్పటికే కొన్ని వార్తలు కూడా వచ్చాయి. గతంలో బైడెన్‌ను అధ్యక్ష అభ్యర్థిగా అంగీకరించిన బరాక్ ఒబామా.. కమలా హారిస్‌ను అంగీకరించకపోవడం కూడా గమనార్హం. కన్వెన్షన్ ద్వారానే నామినీని ఎన్నుకోవాలని బరాక్ ఒబామా అభిప్రాయపడ్డారు. మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. బైడెన్‌ను రేసు నుండి తప్పించడంలో ఒబామా, నాన్సీ పెలోసీ ప్రధాన పాత్ర పోషించారని వార్తలు వస్తున్నాయి. మరోవైపు చర్చించే అభ్యర్థిని ఎన్నుకోవాలని కొంత మంది డెమోక్రటిక్ పార్టీ నాయకులు చెబుతున్నారు. 'అందరు నామినీలు తప్పనిసరిగా వినాలి, వారి ఎజెండాలను చర్చించాలి. ప్రజాస్వామ్యం డెమోక్రటిక్ పార్టీ యొక్క ప్రాథమిక సూత్రం. మనం దానిని ఆచరించకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేము' మరియాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆగస్టు 19న చికాగోలో జరిగే డెమోక్రటిక్ నేషనల్ కమిటీ సమావేశంలో అభ్యర్థిని ప్రకటిస్తారు. దేశ వ్యాప్తంగా 4,000 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. వీరిలో 3,800 మందికి పైగా ప్రతినిధులు బైడెన్‌కు అండగా నిలిచారు. అందువల్ల, బైడెన్ ఆమోదించిన కమలా హారిస్‌కు అభ్యర్థిత్వానికి మార్గం సులభం అవుతుంది. అధ్యక్షురాలిగా ఎన్నికైతే కమలా హారిస్ అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా, బరాక్ ఒబామా తర్వాత రెండో నల్లజాతి అధ్యక్షురాలిగా అవతరిస్తారు. దక్షిణాసియాకు చెందిన తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా కమల రికార్డు సృష్టించనున్నారు. అయితే బైడెన్‌ను ఓడించడం కంటే కమలాను ఓడించడం సులభమని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడాన్ని కూడా మనం గుర్తు పెట్టుకోవాలి.

ఐటీ సెక్టార్‌లో 14 గంటల పని దినం

- కర్నాటక ప్రభుత్వ ప్రతిపాదనను ఖండించిన సీఐటీయూ



న్యూఢిల్లీ : ఐటీ, ఐటిఇఎస్, బీపీఓ సెక్టార్‌లో పని గంటలను రోజుకు 14 గంటలకు పెంచడానికి కర్నాటక ప్రభుత్వ ప్రతిపాదనను సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. వ్యక్తిగత జీవితం గడిపే ప్రాథమిక హక్కుపై దాడిగా దీనిని విమర్శించింది. ఇటువంటి చర్య ప్రస్తుతం కంపెనీల్లో ఉన్న మూడు షిఫ్టులకు బదులుగా రోజుకు రెండు షిఫ్టులకు వెళ్లడానికి వీలు కల్పిస్తుందని, ప్రస్తుతం ఉన్న శ్రామిక శక్తిలో మూడింట ఒక వంతు మంది వారి ఉపాధి నుంచి తొలగించబడతారని సీఐటీయూ పేర్కొంది. ఐటి, ఐటిఇఎస్, బిపిఒ సెక్టార్‌లో పని గంటలను రోజుకు 14 గంటలకు పెంచేవిధంగా కర్నాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1961కు సవరణకు కర్నాటక ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది రాష్ట్రంలోని కార్మిక వర్గంపై కాంగ్రెస్ నేతృత్వంలోని కర్నాటక ప్రభుత్వం చేస్తున్న మూడో దాడిగా సీఐటీయూ తెలిపింది. మొదటిది 2023 ఆగస్టులో ఫ్యాక్టరీల చట్టానికి చేసిన సవరణలను అమల్లోకి తీసుకునిరావడం. దీని ద్వారా పనిగంటలను పెంచడం, రాత్రి షిఫ్టులకు మహిళా కార్మికులను అనుమతించడం. వీటిని కార్మికులు, కార్మిక సంఘాలు విజయవంతంగా తిప్పికొట్టాయని తెలిపింది. రెండోదాడిగా ఇండస్ట్రియల్ ఎంప్లాయ్‌మెంట్ స్టాండింగ్ ఆర్డర్స్ యాక్ట్ నుంచి ఐటి, ఐటిఇఎస్ పరిశ్రమల మినహాయింపును మరో 5 ఏళ్ల పొడిగించడం. ఇక మూడోది తాజాగా ఐటి, ఐటిఇఎస్, బిపిఒ సెక్టార్‌లో పని గంటలను రోజుకు 14 గంటలకు పెంచడానికి చట్ట సవరణల కోసం ప్రతిపాదన. ఇది వారానికి 72 గంటలు పనిచేయాలనే ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కోరికకు అనుగుణంగా ఉందని సీఐటీయూ విమర్శించింది. యజమానులను సంతోషపెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగానే ఇదంతా జరుగుతోందని సీఐటీయూ విమర్శించింది. ఇటువంటి సవరణ ప్రతిపాదనను కర్నాటక ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఇలాంటి క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఐటి, ఐటిఇఎస్ ఉద్యోగులకు సంఘీభావంగా నిలవాలని కార్మికులకు ఈ సందర్భంగా సీఐటీయూ పిలుపునిచ్చింది.

'రుణం' తీరట్లే..!



- కారణాలు తెలియక ఆందోళనలో రైతాంగం
- బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఖమ్మం జిల్లాలోనే అత్యధిక మందికి మాఫీ కాని రుణాలు
- రేషన్‌కార్డు ప్రామాణికమే కారణమని భావిస్తున్న రైతులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

రేషన్‌కార్డు లేదనా..? పీఎం కిసాన్ నిబంధనలా..? లేక రెన్యూవల్ చేయలేదనా? చేశారనా?? రీషెడ్యూలనా..? నిర్దేశిత గడువుకు ముందు తీసుకున్నారనా..? లేక గోల్డ్‌లోన్ రుణాలనా..? కుటుంబంలో ఇద్దరు, ముగ్గురి పేర్లతో రుణాలున్నాయనా..? ఒక్కరికే రెండు, మూడు బ్యాంకుల్లో లోన్లు ఉన్నాయనా..? పట్టేదారు పాస్‌పుస్తకాలు లేవనా..? కారణాలేవైనా.. అర్హతున్న లక్షలాది మంది రైతుల పేర్లు రూ.లక్షలోపు మాఫీ జాబితాలో లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ మూడురోజులుగా తిరుగుతున్నా ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఫేక్ జాబితాలు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వాటిలో పేర్లు కనిపించకపోవడంతో మాఫీ అయ్యి మెసేజ్ రాని వారు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

'గ్యారంటీ' బాగుంది.. ఇప్పుడేమైంది?

నాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క.. రైతు రుణమాఫీ గ్యారంటీ కార్డుపై సంతకం చేసి ఇంటింటికి ఇస్తూ ప్రచారం చేశారు. వరంగల్‌లో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటిస్తూ రూ.2లక్షలలోపు పంటరుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.



ఇచ్చిన మాట ప్రకారమే ప్రభుత్వం 40 లక్షల బ్యాంకు ఖాతాల నుంచి రూ.2 లక్షలలోపు రుణమాఫీకి రూ.31వేల కోట్లు కేటాయించింది. మార్గదర్శకాల విడుదలతో రైతుల్లో అనుమానాలు, ఆందోళన మొదలైంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం మూడు విడతలుగా రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. తొలి దశలో రూ.1లక్షలోపు రుణాలన్న 11,50,193 మంది రైతుల పేర్లతో జాబితా విడుదల చేసింది. గురువారం రూ.6,098.93 కోట్లను లోన్‌అకౌంట్లలో జమ చేసింది. అంతా బాగానే ఉన్నా ఈ జాబితాతోనే ఈ పథకం తీరుతెన్నులపై రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి.

లక్ష జాబితాలో డొల్లతనం..

రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాల్లో ప్రభుత్వ డొల్లతనం వెలుగుచూసింది. మెజార్టీ అర్హులకు మాఫీ కాలేదు. ఒక్క ఖమ్మం డీసీసీబీ పరిధిలోనే రూ.లక్షలోపు రుణం ఉన్నవారు 1,43,327 మంది ఉన్నారు. వీరికి రూ.526 కోట్లు మాఫీ కావాలి. కానీ 37,625 మందికి రూ.121 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగిలిన 1.05 లక్షల మందికి మాఫీ ఎందుకు కాలేదనే ప్రశ్నకు సమాధానాలు లేవు. జిల్లాలోని కారేపల్లి సొసైటీలో 3,790 మంది రైతులు రుణమాఫీకి అర్హులు. వీరికి రూ.19.27 కోట్లు మాఫీ కావాలి. వీరిలో రూ.లక్షలోపు రుణాలు మాఫీ కావాల్సిన వారు 3,153 మంది. వీరికి మాఫీ కావాల్సిన సొమ్ము రూ.10.30 కోట్లు.. కానీ కేవలం 668 మందికి రూ.2.06 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి.

'లక్ష' సందేహాలు.. ఒకటి, రెండే సమాధానాలు..

రూ.లక్షలోపు రుణమాఫీ అధికశాతం అర్హులకు వర్తించకపోవడంపై లక్ష సందేహాలున్నా ఒకటి, రెండు సమాధానాలు మాత్రమే వినిపిస్తున్నాయి. జాబితా వెలువరించాక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు బాధితులు భారీగా వస్తున్నారు. సోమవారం గ్రీవెన్స్ నేపథ్యంలో వేలాదిగా రైతులు తరలివచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదు. రైతులడిగే ప్రశ్నలకు ఒక్కటే సమాధానం ప్రధానంగా వినిపిస్తోంది. రేషన్‌కార్డు లేకపోవడంతో ఫ్యామిలీని గుర్తించడంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయని అంటున్నారు. గత ప్రభుత్వం రేషన్‌కార్డు లేనిపక్షంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిగణనలోకి తీసుకుంది. అయినా అప్పట్లో లోపాలు భారీగానే తలెత్తాయి. ఇప్పుడు పదేండ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. అలాంటప్పుడు రేషన్‌కార్డును ఎలా ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకరికి రెండు బ్యాంకుల్లో ఖాతాలు ఉండీ.. రెండు కలిపి కూడా రూ.లక్షలోపే ఉన్నా ఒకదాంట్లో మాత్రమే మాఫీ అయ్యి.. మరో దాన్ని వదిలివేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 'లక్ష'లాదిమంది రైతుల గగ్గోలు

పాస్‌బుక్‌లు లేనివారి రుణాలు కూడా మాఫీ కాలేదు. ఖమ్మం జిల్లాలో పాస్‌బుక్‌లు లేకుండా రుణాలు తీసుకున్న రైతులు వేలాదిగా ఉన్నారు. కొత్త పాస్‌బుక్‌లు రాకముందు పహానీల ఆధారంగా పంటరుణాలిచ్చారు. అనేక మంది పాస్‌బుక్‌లు లేకుండా లోన్లు తీసుకున్నారు. అటువంటి వారు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పాత రుణాలను రెన్యూవల్ చేయడం లేదు. కాబట్టి ఇలాంటి రైతులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. ఒక్క ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోనే 3,790 మంది రైతులకు గాను 921 మందికి పాస్‌పుస్తకాలు లేవు. ఇక ప్రభుత్వం విధించిన ప్రారంభ గడువు తేదీ కూడా అనేక మంది రైతులకు ప్రతికూలంగా మారింది. డిసెంబర్ 12, 2018కి ముందు పంట రుణాలు తీసుకున్న అనేక మంది రైతులకు రూ.లక్షలోపు రుణమున్నా గడువు కారణంగా అర్హత కోల్పోయారు. పీఎం కిసాన్ నిబంధనలు కూడా అనేక చోట్ల అర్హులైన రైతులను అనర్హులుగా మార్చినట్టు తెలుస్తోంది. రేషన్‌కార్డు ఉండి, పాస్‌పుస్తకం ఉన్నా అనేక మందికి రుణమాఫీ వర్తించలేదు. రూ.లక్షన్నర, రూ.2 లక్షలలోపు మాఫీ జాబితాలో వీరి పేర్లు ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రూ.లక్షలోపు ఉన్నవారి పేర్లు ఆ తర్వాతి జాబితాలో ఎలా ఉంటాయనే సందేహాలను రైతులు వెలిబుచ్చుతున్నారు. ఇక రూ.లక్షలోపు జాబితాలో పంటల కోసం తీసుకున్న గోల్డ్‌లోన్ల ఊసే లేదు.

> **రూ.68వేలే ఉన్నా మాఫీ కాలేదు - మాదూరు రమణారెడ్డి, రెడ్డిగూడెం, కొణిజర్ల**
>
> నాకు స్థానిక బ్యాంకులో రూ.68వేల రుణం మాత్రమే ఉంది. రేషన్‌కార్డుతో పాటు పాస్‌బుక్ కూడా ఉన్నా మాఫీ జాబితాలో నా పేరు లేదు. దాంతో వ్యవసాయ, బ్యాంక్ అధికారులను కలిశా.. సోమవారం ఉదయం 11 గంటలకల్లా కలెక్టరేట్‌కు రావాలని చెప్పారు. ఇలా అనేక గ్రామాల్లో రూ.30వేల లోపున్న రైతులకు కూడా మాఫీ వర్తించకపోవడం గమనార్హం.

జాబితా ప్రదర్శించాలి.. తిరస్కరణకు కారణాలు చూపాలి..

- బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

ప్రతి గ్రామంలో రూ.లక్షలోపు క్రాప్‌లోన్ ఉన్న 30శాతం మంది రైతుల పేర్లు మొన్నటి జాబితాలో లేవు. కారణాలు ఏంటనేది కూడా కచ్చితంగా తెలియట్లేదు. కాబట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు రుణమాఫీ జాబితాలను ప్రదర్శించాలి. స్థానిక పంచాయతీ కార్యాలయంతో పాటు రైతువేదికల వద్ద వీటిని ఏర్పాటు చేయాలి. ఆలోపు పంట రుణమున్నా రిజెక్ట్ చేస్తే అందుకు గల కారణాలను సైతం ఆ జాబితాలో పొందుపరచాలి. ఆతర్వాత కూడా సరైన ఆధారాలను చూపిస్తే అర్హులుగా గుర్తించాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి సరైన సమాధానాలు రావట్లేదు. అధికారులు ఎవరూ సరైన సమాధానం ఇవ్వట్లేదు.

పంచాయతీరాజ్ శాఖకు రూ.24 వేల కోట్లు?

- పింఛన్ల పెంపునకు ఆమోద ముద్ర!
- ఈ బడ్జెట్‌లోనే కేటాయింపులకు అవకాశం
- మహిళలకు ఆర్థిక సహాయంపై సిద్ధం కాని ప్రతిపాదనలు!

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ సారి రూ.24 వేల కోట్ల రూపాయలు కేటాయించబోతున్నట్టు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో సత్వరం లబ్ది చేకూర్చే పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే పింఛన్ల పెంపునకు ఈ బడ్జెట్‌లో ఆమోద ముద్ర వేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఇప్పటికే 44 లక్షల మంది లబ్దిదారులున్నారు. కొత్తగా లక్షకుపైగా లబ్ది దారులు చేరే అవకాశముంది. ఇప్పటి వరకు ఏటా పింఛన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నది. ప్రతి లబ్దిదారునికి రూ.2 వేలను అందజేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దాన్ని నాలుగు వేలకు పెంచుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు లబ్దిదారులకు పింఛన్లు ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా మరో వెయ్యి కోట్ల రూ పాయల భారం పడే అవకాశముంది. పంచాయతీ ఎన్నికలున్న నేపథ్యంలో పింఛన్ల పెంపు ప్రకటనను ఈ బడ్జెట్‌లోనే చేస్తారని ప్రచారం జరుగుతున్నది. అందుకోసం ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనల్లో వాటికి నిధులు కూడా కేటాయించినట్టు తెలిసింది. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయంపై మాత్రం ఇప్పటివరకూ గైడ్‌లైన్స్ ఖరారు కాలేదు. దీంతో ప్రస్తుత బడ్జెట్‌లో దీనికి సంబంధించి ప్రతిపాదనలు లేనట్టేనని తెలుస్తున్నది. అన్ని పథకాలకూ కీలకంగా మారిన రేషన్‌కార్డుల జారీపైనా ఈ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేయబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. సర్పంచులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మంజూరుపైనా తీపికబురు అందించబోతున్నట్టు తెలిసింది. ఇప్పటికే మూడు దశల్లో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేసే కార్యక్రమం మొదలు కావటం, మరోవైపు పంచా యతీ రాజ్ శాఖకు సంబంధించిన నిధుల్లో పథ కాలకు, ప్రాధాన్యతా రంగాలకు కేటాయించాలని నిర్ణయించడం వంటి అంశాలను పరిశీలిస్తే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర సర్కారు ముందుకెళ్తున్నట్టు కనిపిస్తున్నది.

నీట్ పరీక్షలో వివాదాస్పద ప్రశ్నపై సమీక్షకు నిపుణుల కమిటి

12గంటల కల్లా తెలియచేయాలని సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : నీట్-యుజి 2024 మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన వివాదాస్పదమైన ప్రశ్నను సమీక్షించడం కోసం ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ఐఐటి ఢిల్లీ డైరెక్టర్‌ను సుప్రీం కోర్టు సోమవారం ఆదేశించింది. ఆ ప్రశ్నకు సరైన సమాధానాలు చాలా వున్నాయని జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్‌కు ఎన్‌టిఎ తెలియచేసింది. అందువల్లే, దీనికి పరిష్కారంగా కొంతమంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపాలని ఎన్‌టిఎ నిర్ణయించింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న బెంచ్, మంగళవారం మధ్యాహ్నం 12గంటల కల్లా నిపుణుల కమిటీ ఏది సరైన సమాధానమో నిర్ణయించి, ఆ అభిప్రాయాన్ని తమ ముందుంచాల్సిందిగా ఆదేశించింది.

నీట్ పరీక్ష నిర్వహణలో పేపర్ లీక్‌తో సహా అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ నమోదైన పలు పిటీషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరిపింది. కేంద్రాలు, నగరాల వారీగా ఫలితాలను ప్రచురించాల్సిందిగా ఎన్‌టిఎను ఇంతకుముందు ఆదేశించింది.

నీట్ డేటాను ఎన్‌టిఎ బహిరంగపరచగానే హర్యానాలోని రేవరిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డిపిఎస్) సెంటర్ నుండి 264మంది అభ్యర్థుల్లో 22శాతం మంది 600కి పైగా మార్కులను సాధించినట్లు వెల్లడైంది. అంటే పరీక్ష సందర్భంగా కాపీయింగ్ జరిగివుంటుందనే ఆరోపణలు తలెత్తాయి. పాట్నా, హజారీబాగ్‌ల్లో పేపర్ లీక్‌లు జరిగాయన్నది అంగీకరించిన వాస్తవమేనని ఈ రెండు కేసులను సిబిఐ దర్యాప్తు చేస్తోందని కోర్టు పేర్కొంది.

50 అడుగులకు గోదావరి నీటిమట్టం

- రెండో ప్రమాద హెచ్చరిక జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగురాష్ట్రాల్లో కూడా వానలు విపరీతంగా కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు నదులకు వరద తాకిడి పెరిగింది. ఈ క్రమంలో భద్రాచలం దగ్గర గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువన కురుస్తున్నందున భారీ వర్షాలతో ఉపనదులు పొంగిపొర్లడంతో గోదావరి నదిలో 50 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. ఈనేపథ్యంలో ప్రాణహిత ఉపనదుల నుంచి భారీగా వరద నీరు గోదావరిలో కలుస్తున్నదని సమాచారం. ఎగువన ఉన్న ఛత్తీగఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న చర్ల మండలం తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుల్లోకి భారీ వరద నీరు వచ్చి చేరుతున్నదని అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు చెందిన 21 గేట్లను ఎత్తినీటిని గోదావరిలోకి విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 11.50 లక్షల క్యూసెక్కుల వరద నమోదు అవుతుందనీ, సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు 51.20 అడుగులకు చేరుకుటుందని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అధికారుల అంచనాగా ఉంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం కనపడుతున్నప్పటికీ, మంగళవారం రాత్రికి 53 అడుగులు దాటి ప్రవహించే అవకాశం ఉన్నట్టు కేంద్ర జలవనరుల సంఘం తెలియజేసింది. రాష్ట్రంలో మరో మూడు రోజులు వానలు కురిసే అవకాశం ఉన్నటు వాతావరణ శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో గోదావరి పరిహాహకంలోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం మధ్య వాగుల నుంచి భారీగా వరద వచ్చి గోదావరిలో కలుస్తున్నది. దీంతో ప్రవాహం పెరుగుతున్నది. అన్నారం బ్యారేజీకి చెందిన 66 గేట్లు ఎత్తేశారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ అనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి నిండుకుండలా తయారైంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు) ని నది దాటినట్టు అధికారులు ప్రకటించారు.



కృష్ణా బేసిన్ రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
ఆలమట్టి	129.72	97.37	112000	115000
నారాయణపూర్	37.64	32.14	145000	144250
జూరాల	9.66	7.37	160000	157718
తుంగభద్ర	105.79	85.36	104993	7925
శ్రీశైలం	215.81	49.49	153422	0
నాగార్జునసాగర్	312.05	121.71	0	9433
పులిచింతల	45.77	0.86	478	50

గోదావరి బేసిన్

సింగూరు	29.917	13.63	391	391
నిజాంసాగర్	17.800	3.14	314	0
శ్రీరాంసాగర్	90.300	19.19	18518	503
కడెం	7.600	5.44	14436	14436
శ్రీపాద ఎల్లంపల్లి	20.175	7.03	36259	331
మేడిగడ్డ	16.170	-	440420	440420
సమ్మక్కసాగర్	6.570	-	808260	808260
సీతమ్మసాగర్	36.570	53.30(ఎం)	751425	751425
భద్రాచలం	లెవెల్ 48.88 (ఎం)		629934	629934

యూపీ, ఉత్తరాఖండ్ విద్వేష ఉత్తర్వులపై సుప్రీంకోర్టు నిషేధం

- స్వాగతించిన సీపీఐ(ఎం)



న్యూఢిల్లీ : కన్వర్ యాత్ర నేపథ్యంగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు జారీ చేసిన విద్వేష ఉత్తర్వులను సుప్రీంకోర్టు సోమవారం నిషేధించింది. కన్వర్‌యాత్ర మార్గంలో ఆహార పదార్థాల దుకాణదారులు, ఉద్యోగులు తమ పేర్లు, ఇతర గుర్తింపు వివరాలు ప్రముఖంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఉత్తర్వులను సోమవారం రద్దు చేసిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌విఎన్ భటీల సుప్రీంకోర్టు ధర్మాసనం కన్వర్ యాత్ర సాగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి విద్వేష ఉత్తర్వులను అమలు చేస్తే సుమోటోగా విచారణ చేస్తామని స్పష్టం చేసింది. కన్వర్ యాత్ర సాగే స్టాళ్లు, వ్యాపారులు, కూరగాయలు అమ్మేవారు, దాబా యజమానులు, తదితరులకు తాము విక్రయించే ఆహారాన్ని ప్రదర్శించే స్వేచ్ఛ ఉందని, అయితే వాటి యాజమానులు, ఉద్యోగులను వారి పేర్లు, కులం, మతపరమైన గుర్తింపు వంటి విషయాలను ప్రదర్శించాలని పోలీసులు బలవంతం చేయకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. కన్వర్ యాత్రీకులకు పరిశుభ్రత, ఆహార ప్రాధాన్యతలకు అనుగుణంగా శాఖాహార ఆహారాన్ని అందించడానికి అధికారులకు అనుమతి ఉందని, అయితే చట్టం యొక్క మద్దతు లేకుండా స్వేచ్ఛను అణగద్రొక్కే ఉత్తర్వుల ద్వారా మున్సిపల్ అధికారుల అధికారాన్ని పోలీసులు లాక్కోలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రభావం చూపిస్తున్నాయని, కాబట్టి, వెంటనే న్యాయపరమైన జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గతవారంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ జారీ ఉత్తర్వులకు వ్యతిరేకంగా అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తరుపున సీనియర్ న్యాయవాది సియు సింగ్, విద్యావేత్త అపూర్వనంద ఝా, కాలమిస్ట్ అకార్ పటేల్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మరికొందరు వేరువేరుగా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసారు. ఈ ఉత్తర్వులు దేశం యొక్క లౌకిక స్వభావాన్ని ప్రభావితం చేశాయని, రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన లౌకిక విలువలను ఉల్లంఘించాయని, సమానత్వం-గౌరవంగా జీవించే హక్కులను ఉల్లంఘించాయని పిటీషన్లు వాదించారు. అలాగే ఈ ఉత్తర్వులు కన్వర్ యాత్ర మార్గంలో దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులను బలవంతంగా తొలగించడానికి దారితీసాయని తెలిపారు. జీవనోపాధి, వ్యాపారం, వర్తకం ద్వారా సంపాదించుకునే ప్రాథమిక హక్కును ఈ ఉత్తర్వులను ఉల్లంగించిందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్తర్వులు 'అస్పృశ్యత'ను చట్టబద్ధం చేశాయని సీనియర్ న్యాయవాది హుజీఫా అహ్మదీ విమర్శించారు.

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన విద్వేష ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిషేధించడాన్ని సీపీఐ(ఎం) ఘనంగా స్వాగతించింది. కన్వర్ యాత్ర మార్గంలో దుకాణదారులంతా తమ పేర్లు ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన మతపరమైన, విభజన సృష్టించే మనువాదీ ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిషేధించడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) ఒక ప్రకటనలో తెలిపింది. ఆహార పదార్థాల పేర్లు ప్రదర్శించాలని కానీ, యజమానుల పేర్లు కాదని సీపీఐ(ఎం) పేర్కొంది.

ఖాన్ యూనిస్‌పై మళ్ళీ గురి

- తాజా దాడుల్లో 39మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : వరుస దాడులతో ఖాన్ యూనిస్ నగరాన్ని శవాల కుప్పగా, శిధిలాల దిబ్బగా మార్చేసిన ఇజ్రాయిల్ ఆర్మీ మళ్లీ ఆ నగరంపైనే గురి పెట్టింది. తూర్పు ప్రాంతంలో కొత్తగా జరిపిన దాడుల్లో 39మంది పాలస్తీనియన్లు మరణించగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. గాజాలోని పాలస్తీనా పౌర రక్షణ దళాలను ఖాళీ చేయాల్సిందిగా మిలటరీ ఆదేశాలు జారీ చేసిన కొద్ది నిముషాలకే ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. శతఘ్ని గుళ్ళ వర్షాన్ని కురిపించింది.

హమాస్ అదుపులో వున్న బందీల్లో మరో ఇద్దరు మరణించారని ఇజ్రాయిల్ కేంపైన్ గ్రూపు హోస్టేజెస్ అండ్ మిస్సింగ్ ఫ్యామిలీస్ ఫోరమ్ సోమవారం ప్రకటించింది. 35ఏళ్ల సౌండ్ టెక్నీషియన్ యాగెవ్, వృద్ధుడు, చరిత్రకారుడైన అలెక్స్(76)ల మృతిపై దర్యాప్తు జరుపుతున్నామని మిలటరీ ప్రకటించింది. గతేడాది అక్టోబరు 7న జరిగిన దాడిలో వారిని వారి ఇళ్ళ నుండి అదుపులోకి తీసుకున్నారు. చర్చలు ప్రారంభించినా ఎటూ తేల్చకుండా వారాల తరబడి కాలయాపన చేసిన ఫలితమే ఈ బందీల మృతి అని ఫోరమ్ వ్యాఖ్యానించింది.

గత 9మాసాలుగా సాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు గాజాలో మరణించిన వారి సంఖ్య 39006కి చేరుకుంది. గాయపడిన వారి సంఖ్య 89,818కి చేరుకుందని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. వెస్ట్ బ్యాంక్‌లో జరుగుతున్న దాడుల్లో మృతుల్లో పిల్లలే ఎక్కువగా వుంటున్నారని యునిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. సగటున ప్రతి రెండు రోజులకు ఒక పాలస్తీనియన్ చైల్డ్ మరణిస్తున్నారని తెలిపింది. ఇప్పటివరకు 143మంది పిల్లలు చనిపోయారని పేర్కొంది. గత 24గంటల్లో 23మంది పాలస్తీనియన్లు మరణించగా, 91మంది గాయపడ్డారని తెలిపింది. సోమవారం ఉదయం గాజాలో మరో మూడు దాడులు జరిగాయని తెలిపింది. సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ మిలటరీ ప్రాంతంలో తమ సాయుధ విభాగం ఖసమ్ బ్రిగేడ్స్ స్వల్ప శ్రేణి క్షిపణులతో దాడులు జరిపినట్లు హమాస్ తెలిపింది.